thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 358 కరీంనగర్ బుధవారం, 5 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## అయోధ్య రామ మందిరంపై ఐఎస్ఐ కన్ను

న్యూఢిల్లీ : అయోధ్య రామ మందిరాన్ని లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాద దాడి జరపాలన్న పాక్ నిఘా సంస్థ ఐఎసఐ చేసిన కుట్ర భగ్నమయింది. గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు ఉత్తరప్రదేశ్‌లోని ఫరీదాబాద్‌కు చెందిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) సిబ్బంది సహకారంతో అనుమానితుడిని పట్టుకున్నారు. అతడిని అబ్దుల్ రహ్మాన్‌గా గుర్తించారు. పాలీ ఏరియాలో నిర్మానుష్యంగా ఉన్న ఇంట్లో నాలుగు గంటల పాటు సోదాలు చేసి రెండు గ్రెనేడ్లను స్వాధీనం చేసుకున్నారు. రహ్మాన్ మటన్ షాపు నిర్వహించడంతో పాటు, ఆటో కూడా నడుపుతుంటాడు. అతడు పలుమా ర్లు అయోధ్య వెళ్లి రామమందిరాన్ని నిశితంగా పరిశీలించాడు. కీలకమైన సమాచారాన్ని ఐఎసఐకి అందజేశాడు.




ఉత్తర తెలంగాణలో బీజేపీ వ్యూహం ఫలించింది. కేంద్ర మంత్రి బండి సంజయ్ ముందుండి రెండు ఎమ్మెల్సీ స్థానాలను గెలిపించుకున్నారు. తాజాగా జరిగిన కరీంనగర్- మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మల్క కొమురయ్య కు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుభాకాంక్షలు తెలిపారు. ఇంతటి చారిత్రాత్మక విజయాన్ని అందించిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు చెప్పారు. మల్క కొమురయ్య ఐదు వేలకు పైగా ఓట్ల తేడాతో విజయం సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. మోడీ మీదున్న నమ్మకమే దేశ వ్యాప్తంగా బీజేపీ విజయానికి బాటలు వేస్తోందని తెలిపారు. కాగా ఉపాధ్యాయుల సమస్యల కోసం మల్క కొమురయ్య కృషి చేస్తానన్నారు. అయితే మల్క కొమరయ్య గెలుపు కోసం బండి సంజయ్ చాలా గట్టిగానే కష్టపడ్డారు. కరీంనగర్ లో ఉండి పెద్ద ఎత్తునక్యాంపెయిన్ చేశారు. మల్క కొమరయ్య ఒక విధంగా విజయం సాధించారు అంటే దానిలో బండి సంజయ్ కి సంబంధించిన పోరాటం ఖచ్చితంగా ఉంది. బండి సంజయ్ కరీంనగర్ లోనేక్యాంప్ వేసి మొత్తం ప్రచారాన్ని తన భుజాలపై వేసుకొని మల్క కొమురయ్యను గెలిపించడంలో కీ రూల్ పోషించారు. మల్క కొమరయ్య.. బండి సంజయ్ ఇద్దరు మున్నూరు కాపు సామాజిక వర్గమే. ముఖ్యంగా మల్క కొమరయ్య ముఖ్యంగా 317 జీవో వ్యతిరేకంగా గతంలో రెండు సంవత్సరాల క్రితం బండి సంజయ్ చేసిన ఫైట్ ను ప్రధానంగా ప్రస్తావించారు. ఈ జీవోకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున వీధి పోరాటాలకు దిగారు. అప్పట్లో ఈ జీవోకు వ్యతిరేకంగా బండి సంజయ్ చేపట్టి దీక్ష చేపడితే.. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయన్ని గేట్లు బద్దలు కొట్టి తలుపులును గ్యాస్ కట్టర్స్ తో కట్ చేసి అర్ధరాత్రి పూట సంజయ్ ను అరెస్ట్ చేయించింది. ఇదే విషయాన్ని ఉపాధ్యా ఎన్నికల్లో కొమురయ్య పదే పదే ప్రస్తావించారు. ఆ ఇంపాక్ట్ ఎన్నికల్లో కనిపించింది. మొత్తంగా బండి సంజయ్ ఫైట్ తో పాటు.. బీజేపీకి సాంప్రదాయంగా వచ్చే ఓట్లు.. నరేంద్ర మోడీ ఇమేజ్ ఇవన్ని మల్క కొమురయ్యకు కలిసొచ్చాయి. మొత్తంగా ఈ గెలుపుతో ఉత్తర తెలంగాణలో బీజేపీ తన పట్టు నిలుపుకున్నట్లైయింది. ఇక మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 8 స్థానాల్లో 7 స్థానాలు ఉత్తర తెలంగాణలో ఉన్నాయి. మొత్తంగా ఉత్తర తెలంగాణకు సంబంధించి రెండుకు రెండింట్లో బీజేపీ హవా క్లియర్ గా కనిపిస్తోంది. ఇక్కడ బీసీ వాదం వినిపించినా.. నల్గొండ, వరంగల్ మాత్రం బీసీ నినాదం పని చేయలేదు. అక్కడ టాప్ త్రీలో ముగ్గురు రెడ్డి అభ్యర్థులే ఉన్నారు. ఈ రెండు సీట్లు గెలుపుతో ఉత్తర తెలంగాణలో బీజేపీ తిరుగులేని శక్తిగా ఆవిర్భంచవచ్చు. మొత్తంగా తెలంగాన రేవంత్ రెడ్డి సర్కారుకు కౌంట్ డౌన్ మొదలైందనే చెప్పాలి.



## రేవంత్ రెడ్డి రెండో రోజు కేంద్ర మంత్రుల వరస భేటీలు


హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండో రోజు ఢిల్లీ పర్యటనలో కేంద్రమంత్రులను కలుస్తున్నారు. ప్రహ్లాద్ జోషిని కలసి రాష్ట్రానికి రావాల్సిన రెండు వేల కోట్ల రూపాయల బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయనను కోరారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలసి ఆయన రెండో రోజు ఢిల్లీలో పర్యటిస్తున్నారు. పౌర సరఫరాల శాఖకు సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. బకాయిలను విడుదల చేయాలని...ఇందుకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సానుకూలంగా స్పందించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. 2014-15 సంవత్సరానికి సంబంధించి సేకరించిన ధాన్యం బకాయిలు రూ. 1,468.94 కోట్లను విడుదల చేయాలని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేశారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన రూ. 343.27 కోట్ల బకాయిలను విడుదల చేయాలని, కస్టమ్ మిల్లింగ్ రైస్ డెలివరీ గడువును పొడిగించాలని కోరారు.

## దేశంలో కార్పొరేట్ వ్యవస్థ రాజ్యమేలుతోంది : మీనాక్షి నటరాజన్

హైదరాబాద్ : ప్రజాస్వామ్యంలో ఎవరైనా తమ సమస్యల పైన ప్రభుత్వాలను, పాలకులను ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికి ఉందని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. ఇందుకోసం ప్రత్యేక అనుమతులు అవసరం లేదని తెలిపింది. పర్యావరణ, ఉద్యమకారురాలు మేధాపత్కర్ లాంటి వారు మూసీ నది పరివాహక ప్రాంతంలో పర్యటించడానికి వెళ్లారు.. అది గొప్ప విషయం.. ఉద్యమాల్లో నేను మీతో కలిసి పని చేస్తా అని ఆమె వెల్లడించింది.

ప్రతి ఒక్కరికి ప్రశ్నలను లేవనితే హక్కులు ఉన్నాయన్నారు. ఇక, ప్రస్తుతం దేశంలో కార్పొరేట్ వ్యవస్థ రాజ్యమేలుతోంది అని కాంగ్రెస్ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఆరోపించింది. దేశంలో కోటీశ్వరులు, సామాన్యులు ఒకే టాక్స్ కడుతున్నారు.. అంబానీ, అదానీ, పాల పాకెట్ కొనుగోలు చేసే సామాన్యులు సమానంగా టాక్స్ లు కడుతున్నారు.. ఈ విధానాలు మారాలి అని పేర్కొన్నారు.

అలాగే, దేశ ప్రజలు భారత్ మాతా జై అంటున్నారు కానీ.. సామాన్యులకు, వారి నిర్ణయాలకు చోటు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. కానీ, కేంద్ర ప్రభుత్వం కొందరు వ్యక్తుల నిర్ణయాల మేరకే పని చేస్తుంది.. ఆ విధానాలను మార్చాలని మీనాక్షి నటరాజన్ చెప్పుకొచ్చారు.



## కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై హైకోర్టులో పిటిషన్!

హైదరాబాద్: భారాస అధినేత, ఎమ్మెల్యే కేసీఆర్ అసెంబ్లీకి రావట్లేదంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. విజయ్‌పాల్‌రెడ్డి వేసిన ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యంపై కోర్టులో విచారణ జరిగింది. ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్.. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలను లేవనెత్తాల్సిన బాధ్యత ఆయనపై ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కొన్ని నెలలుగా ఆయన అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనడం లేదని, ఇలా సమావేశాలకు హాజరు కాకుంటే చట్టప్రకారం అనర్హుడిగా ప్రకటించవచ్చన్నారు. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేయాలని ధర్మాసనం ముందు వాదనలు వినిపించారు. కాగా.. ఈ వ్యాజ్యంలో జోక్యం చేసుకోవడానికి కోర్టు పరిధి ఏంటని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ పిల్‌కు అర్హత లేదని శాసనసభ వ్యవహారాల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే, కోర్టులు జోక్యం చేసుకోవచ్చని.. ఈ మేరకు వాదనలు వినిపించడానికి గడువు కావాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరడంతో.. విచారణను కోర్టు 2 వారాలకు వాయిదా వేసింది.

## తెలంగాణలో గ్రాడ్యుయేట్ స్థానంలో ఊహించని ఫలితం

తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా.. రెండు చోట్ల ఫలితం తేలిపోయింది. నల్గొండ, ఖమ్మం, వరంగల్ టీచర్ల ఎమ్మెల్సీ స్థానంలో పీఆర్‌టీయూ నేత శ్రీపాల్ రెడ్డి గెలవగా.. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీగా బీజేపీ బలపర్చిన మల్క కొమరయ్య విజయం సాధించారు. ఇక కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల స్థానానికి జరిగిన ఎన్నికకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. తుది ఫలితం రావడానికి అర్ధరాత్రి అయ్యే అవకాశం ఉంది. పట్టభద్రులు ఎవరికి పట్టం కట్టారనేది ఉత్కంఠ రేపుతోంది. బ్యాలెట్ పేపర్లు కట్టే సమయంలో కౌంటింగ్ ఏజెంట్లు చూడగా మొదటి ప్రాధాన్యత ఓట్లు బీజేపీ అభ్యర్థికి ఎక్కువ పడ్డాయనే ప్రచారం జరుగుతోంది. మొదటి ప్రాధాన్యత ఓట్లు అంజిరెడ్డికి ఎక్కువ పడ్డాయని, ఆ తర్వాత స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి ఉంటారని, మూడో స్థానంలో బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ ఉండే అవకాశం ఉంటుందనే చర్చ జరుగుతోంది. తొలి ప్రాధాన్యత ఓటులో ఏ అభ్యర్థి కోటా ఓట్లు సాధించే అవకాశం లేదని, ఈక్రమంలో రెండో ప్రాధాన్యత ఓటు కీలకం కానుందనే చర్చ జరుగుతోంది.

**ముగ్గురి మధ్య..** కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో త్రిముఖ పోటీ నెలకొంది. పోలింగ్ పూర్తైన తర్వాత బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ గెలుస్తారని చాలామంది అంచనా వేశారు. బ్యాలెట్ బాక్కులు తెరిచిచూస్తే మాత్రం ప్రసన్న హరికృష్ణ మూడో స్థానానికి పరిమితమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు సంబంధించి మొదటి ప్రాధాన్యత ఓట్లు బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి పడినట్లు తెలుస్తోంది. కరీంనగర్‌లో ఎవరు ఎక్కువ ఓట్లు సాధిస్తే వారికి విజయవకాశాలు ఎక్కువుగా ఉండే ఛాన్స్ ఉంది. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సమయానికి ప్రసన్న హరికృష్ణ మూడోస్థానంలో ఉంటే.. ఆయన ఎలిమినేషన్ ద్వారానే విజేత తేలే అవకాశం ఉంటుంది. అలా కాకుండా కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల్లో ఎవరైనా రెండు, మూడు స్థానాల్లో ఉంటే మూడో స్థానంలో ఉన్న అభ్యర్థి ఎలిమినేషన్ ద్వారా విజేత తేలే అవకాశం ఉంటుంది.

**ఊహించని ఫలితం...** కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ మధ్య పోటీ ఉంటుందని భావించారు.

బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి గణనీయంగా ఓట్లు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ మూడో స్థానంలో ఉండవచ్చనే అంచనాలు వెలువడ్డాయి. కానీ ఎవరూ ఊహించని విధంగా బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటీఉందని ఈ ఇద్దరు అభ్యర్థుల్లో ఎవరైనా గలియే అవకాశాలు ఉన్నట్లు తెలిస్తోంది.









## మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులు
## ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

# ఉమెన్స్ డే గిఫ్ట్..

## మహిళలకు రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్..

## 'అతివల చేతికి ప్రగతి రథ చక్రాలు'

హైదరాబాద్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. రాష్ట్రంలోని మహిళా సంఘాలకు ఉపాధి కల్పనలో భాగంగా ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ మేరకు మంగళవారం మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులు కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. రాష్ట్ర పంచాయతీ రాజ్ & గ్రామీణాభివృద్ధి విభాగం ఈ ఉత్తర్వులు విడుదల చేసింది. మొదటి విడతలో 150 మండల సమాఖ్యలకు 150 ఆర్టీసీ అద్దె బస్సులు ఇవ్వనుంది. ఆ తర్వాత మిగిలిన మండల సమాఖ్యలకు 450 ఆర్టీసీ అద్దె బస్సులు కొనుగోలు చేయనున్నట్లు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతి నెల ఒక్కో బస్సుకు రూ. 77, 220 అద్దె ఆర్టీసీ చెల్లించనుంది. బస్సుల కొనుగోలు కోసం మహిళా సంఘాలకు బ్యాంకు గ్యారంటీ ప్రభుత్వం ఇవ్వనుంది. దీంతో దేశంలోనే తొలిసారిగా మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సులు నడవనున్నాయని అధికార పార్టీ వర్గాలు తెలిపాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చ్ 8 న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్ వేదికగా 50 బస్సులను సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ లాంఛనంగా ప్రారంభించనున్నట్లు అధికారుల సమాచారం.

## దేశంలోనే ఫస్ట్!




## హాల్‌టికెట్‌పై క్యూఆర్ కోడ్.. ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం!

హైదరాబాద్ : ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. తెలంగాణవ్యాప్తంగా మొదటి, ద్వితీయ సంవత్సరం కలిపి దాదాపు పది లక్షల మంది విద్యార్థినివిద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మొత్తం 1,532 కేంద్రాల్లో జరగనున్న పరీక్షల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఇంటర్ బోర్డ్ ప్రకటించింది. ఈసారి పరీక్షా కేంద్రాల గుర్తింపు కోసం హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్‌లను సైతం ముద్రించటం విశేషం. ఇక పేపర్ లీకేజీ, మాస్ కాపీయింగ్ వంటి సమస్యలు తలెత్తకుండా సీసీ కెమెరా సర్వైలెన్స్, పెద్ద సంఖ్యలో స్క్వాడ్ లను సైతం ఏర్పాటు చేశామని ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య వివరించారు.

## ఎకో టూరిజం పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలి: డిప్యూటీ సీఎం భట్టి



సమ్మక్క, సారలమ్మ జాతర గోదావరి పుష్కరాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ అధికారులు ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రి కొండ సురేఖ అధికారులకు సూచించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ప్రీ బడ్జెట్ సమావేశంలో భాగంగా దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖల సమావేశం నిర్వహించారు. వందల కోట్ల రూపాయల తో చేపడుతున్న పనులు భవిష్యత్తులోనూ ఉపయోగపడేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలంటే ఇప్పటినుంచే అధికారులు అందుకు సంబంధించిన కసరత్తు ప్రారంభించాలని తెలిపారు. రాష్ట్రంలో టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాలు ఉన్నందున దేశవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం, మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో అర్బన్ పార్క్‌లను అభివృద్ధి చేయడం ద్వారా ఐటీ ఉద్యోగులు వారాంతాల్లో సేద తీరేందుకు ఉపకరిస్తాయని తెలిపారు. టైగర్ రిజర్వ్ ప్రాంతాలు, అర్బన్ పార్కులు అభివృద్ధి చేసుకోవడం ద్వారా శాఖలకు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. పురాతన దేవాలయాలు పునరుద్ధరించే పనులను ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ చేపట్టాలని డిప్యూటీ సీఎం సూచించారు. దేవాలయాల ద్వారా ప్రజల్లో భక్తి భావన పెరుగుతుంది, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు చేయూతగా ఉంటుందని తెలిపారు. ప్రజల్లో భక్తి భావన పెంపొందితే క్రమశిక్షణకు అవకాశం ఉంటుందని డిప్యూటీ సీఎం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఆరు ప్రధాన దేవాలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ ల రూపకల్పనపై మంత్రులు చర్చించారు. అటవీ హక్కు చట్టం ద్వారా గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇచ్చాం వారు సాగు చేసుకుంటున్నా నేపథ్యంలో అటవీ శాఖ తో సమన్వయం లేకపోవడం మూలంగా కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నట్లు గుర్తించాం. గిరిజన రైతుల ఇబ్బందులను పరిష్కరించేందుకు, వివిధ పంటల సాగుతో అటవీ విస్తీర్ణాన్ని పెంచుకోవడం, సోలార్ విద్యుత్ ద్వారా గిరిజన రైతులు పంపుసెట్ల వినియోగం వంటి కార్యక్రమాల పై చర్చించేందుకు కొద్దిరోజుల్లోనే అటవీ, గిరిజన, ఉద్యాన, వ్యవసాయ, ఇంధన శాఖల అధికారులతో ఒక సమావేశం నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. పనులు పెద్ద సంఖ్యలో చేపట్టే పచ్చదనాన్ని కాపాడాలని సూచించారు. ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకొని చెక్ డ్యాములు, ఇతర పనులు చేపట్టాలని డిప్యూటీ సీఎం సూచించారు. హైదరాబాద్ మహానగరం తో పాటు పరిసరాల్లో 59 అర్బన్ పార్కులు ఉన్నాయి. ఒత్తిడితో జీవించే నగర ప్రజలు ఉపశమనం పొందేందుకు వీటిని అభివృద్ధి చేయాలని.. అర్బన్ పార్క్ ల ద్వారా ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని మంత్రులు సంబంధిత అధికారులను ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలి. విద్యార్థులకు భాగస్వామ్యం కల్పించాలని సూచించారు. చిన్న చిన్న మొక్కలు కాకుండా రెండున్నర అడుగుల ఎత్తుకు తగ్గకుండా ఉన్న మొక్కలను నాటడం ద్వారా ఎక్కువ సంఖ్యలో బతికే అవకాశం ఉంటుందని తెలిపారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అహ్మద్ నదీం, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామ అయ్యర్, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ డోబ్రియాల్, తదితరులు పాల్గొన్నారు.




## వంతారాలో పులి పిల్లలతో సరదాగా గడిపిన ప్రధాని మోదీ

అహ్మదాబాద్: గుజరాత్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ రిలయన్స్ నిర్వహిస్తున్న వన్యప్రాణుల పునరావాసం, సంరక్షణ కేంద్రమైన వంతారాను మంగళవారం ప్రారంభించారు.

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ కుటుంబ సమేతంగా మోదీకి స్వాగతం పలికారు. అనంతరం అనంత్ అంబానీతో కలిసి ప్రధాని మోదీ వంతారా మొత్తం కలియదిరిగారు. వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో పునరావాసం పొందుతున్న వివిధ రకాల జంతువులతో ప్రధాని సరదాగా గడిపారు.

పులి, సింహం పిల్లలతో కాసేపు ఆడుకున్నారు. సింహాల పిల్లలకు, జిరాఫీలకు ఆహారం అందించారు. అలాగే, జంతువుల కోసం ఏర్పాటు చేసిన ఎమ్మారై, సీటీ స్కాన్, ఐసీయూ వంటి సదుపాయాలు కలిగిన పశువైద్య వన్యప్రాణుల ఆసుపత్రిని వీక్షించారు.

## దక్షిణాదిలో ఒక్క పార్లమెంటు సీటు కూడా తగ్గదు.. అని మోదీ చెప్పారు: ఎంపీ లక్ష్మణ్

హైదరాబాద్: దక్షిణాదిలో ఒక్క పార్లమెంట్ సీటు కూడా తగ్గదని ప్రధాని మోదీ చెప్పారని భాజపా రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ తెలిపారు. జన గణన చేసిన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ ఖరారు చేస్తారని వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎంపీ లక్ష్మణ్ మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. " 2011తో పోలిస్తే రెండు తెలుగు రాష్ట్రాల్లో జనాభా తగ్గింది. జనాభా తగ్గినప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల్లో పార్లమెంట్ సీట్లు తగ్గవు. ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో 153 సీట్లు తెలంగాణలో పెంచాలని పెట్టారు. దక్షిణాది వ్యక్తికి జాతీయ అధ్యక్ష పదవి అని ఎక్కడా చర్చలేదు. 11 రాష్ట్రాల అధ్యక్షులను ప్రకటించాం.. త్వరలోనే అన్ని రాష్ట్రాలకు ప్రకటిస్తాం. డీపీఆర్ సర్వే సక్రమంగా చేయకపోతే ట్రిపుల్ ఆర్ వెనుకకు వెళ్తుంది. భారాస చేసిన తప్పునే కాంగ్రెస్ చేస్తే ఎట్లా? బీసీల్లో 10శాతం ముస్లింలను కలపకపోతే ఆమోదిస్తాం. కులగణన తప్పుల తడకగా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డికి అవగాహన లేదు. భాజపా బలం పెరుగుతుందని రేవంత్‌రెడ్డికి భయం పట్టుకుంది. ఆయనే మిగతా నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నాం. సీఎం మార్పు అనేది కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అంశం. జమిలి ఎన్నికలపై చర్చ జరుగుతోంది.. ఇప్పటికే రెండు మూడు సమావేశాలు జరిగాయి. కుల గణన చేపట్టి రేవంత్ రెడ్డి ఏ ఒక్కరిని సంతృప్తి పరచలేదు" అని లక్ష్మణ్ అన్నారు.

## ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థి రాజశేఖరం విజయం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి మరో విజయం సాధించింది. ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయం సాధించారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఏడో రౌండ్ లెక్కింపు పూర్తయ్యే సరికి విజయానికి కావాల్సిన ఓట్లు (51శాతం) రాజశేఖరం సాధించారు. దీంతో మరో రౌండ్ లెక్కింపు ఉండగానే ఆయన గెలిచినట్లు అధికారులు ప్రకటించారు. ఎన్నికల అధికారి, ఏలూరు జిల్లా కలెక్టరు ఆయనకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేయన్నారు. ఏడు రౌండ్‌లు పూర్తయ్యేసరికి.. మొత్తంగా 1,12,331 ఓట్లను పేరాబత్తుల రాజశేఖరం సాధించారు. తన ప్రత్యర్థి దిడ్ల వీర రాఘవులుకు 41,268 ఓట్లు పోలయ్యాయి. దీంతో కూటమి అభ్యర్థి 71,063 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఏడు రౌండ్ల పూర్తయ్యే సరికి 1,96,000 ఓట్ల కౌంటింగ్ పూర్తయింది. వాటిలో చెల్లిన ఓట్లు 1,78,422 ఉండగా.. చెల్లనివి 17,578 ఓట్లున్నాయి. దాదాపు 22,000 ఓట్లు లెక్కించాల్సి ఉంది.

**పట్టభద్రుల హక్కుల సాధనకు కృషి చేస్తా: పేరాబత్తుల రాజశేఖరం...** కూటమి అభ్యర్థిగా ఇంత గొప్ప విజయం సాధించినందుకు సంతోషంగా ఉందని పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, రెండు జిల్లాల పట్టభద్రుల ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పట్టభద్రుల హక్కుల సాధనకు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. "నిరుద్యోగ యువత పట్ల గత ప్రభుత్వం అనాలోచితంగా వ్యవహరించింది. ఈ 8 నెలల కాలంలోనే రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి.

సీఎంగా ప్రమాణ స్వీకారం చేశాక చంద్రబాబు తొలి సంతకం డీఎస్సీపైనే చేశారు. ఎన్నికల ప్రక్రియ పూర్తికాగానే డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుంది. రాష్ట్రంలో నిరుద్యోగ యువత లేకుండా, అందరికీ ఉద్యోగాలు వచ్చేలా నా వంతు ప్రయత్నం చేస్తా" అని తెలిపారు.





దిల్లీ: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా సీఏ ఇంటర్, ఫౌండేషన్ పరీక్ష ఫలితాలు వచ్చేశాయ్. జనవరిలో నిర్వహించిన ఈ పరీక్షల ఫలితాలను ICAI మంగళవారం విడుదల చేసింది. విద్యార్థులు https://icai.nic.in/ వెబ్‌సైట్‌లో తమ రోల్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టినతేదీ వంటి వివరాలను ఎంటర్ చేసి స్కోరు కార్డులు, మెరిట్ జాబితాలను పొందొచ్చు. ఇక, సీఏ ఇంటర్ పరీక్ష ఫలితాల్లో హైదరాబాద్‌కు చెందిన దీపాన్షి అగర్వాల్ 86.63శాతం మార్కులతో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. విజయవాడకు చెందిన తోట సోమనాథ్ శేషాద్రి నాయుడు 86శాతం స్కోరుతో రెండో ర్యాంక్ దక్కించుకున్నాడు. హాథ్రస్ (యూపీ)కి చెందిన సర్థాక్ అగర్వాల్ 85.83శాతం మార్కులతో మూడో ర్యాంక్‌లో నిలిచాడు. సీఏ ఇంటర్ గ్రూప్ 1 పరీక్షల్లో 14.17శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. 1,08,187 మంది పరీక్ష రాయగా.. 15,332 మంది పాసయ్యారు. గ్రూప్ 2 పరీక్షలో 22.16శాతం, రెండు గ్రూప్‌ల విభాగంలో 14.05శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఇక, ఫౌండేషన్ పరీక్షలో 21.52శాతం మంది పాసయ్యారు. ఇంటర్మీడియట్ కోర్సులో గ్రూపు-1 పరీక్షలు జనవరి 11, 13, 15 తేదీల్లోబీ గ్రూపు-2ను జనవరి 17, 19, 21 తేదీల్లో ICAI నిర్వహించింది. రెండు గ్రూప్‌ల వారికి జనవరి 12, 14, 16, 18 తేదీల్లో పరీక్షలు జరిగాయి.




హైదరాబాద్ : రాష్ట్రంలో డ్యాముల సేఫ్టీపై ఇరిగేషన్ శాఖ దృష్టి సారించింది. పకడ్బందీ రక్షణ చర్యలు చేపట్టనున్నది. ఇప్పటికే డ్యాములకు ఓనర్లను నిర్ణయించి వాటి పూర్తి బాధ్యతలను ఆయా అధికారులకే అప్పగించిన ఇరిగేషన్ శాఖ.. వాటిని పర్యవేక్షించేందుకు డ్రోన్లను వినియోగించుకోవాలని యోచిస్తున్నది. వరద నియంత్రణ, ప్రాజెక్టుల డ్యామేజీల గుర్తింపు, గేట్ల నిర్వహణ, ప్రాజెక్టుల్లో లోపాలను గుర్తించేందుకు డ్రోన్లను వినియోగించుకోవాలన్న ఆలోచనలో ఉన్నది. ఈ నేపథ్యంలోనే బుధవారం జలసౌధలో డ్యామ్ సేఫ్టీ, నీటి యాజమాన్యంలో డ్రోన్ల వినియోగంపై ఒక రోజు వర్క్?షాప్ నిర్వహించనున్నది. ఈ వర్క్‌షాప్‌లో భాగంగా డ్యాముల డేటా ప్రాసెసింగ్, ప్రాజెక్టుల్లో డ్రోన్ల టెక్నాలజీ తదితర అంశాలపై చర్చించనున్నారు. డ్యామ్ ఆపరేషన్లలో డ్రోన్లను వినియోగించే తీరును వివరించనున్నారు. ప్రాజెక్టు ప్రాంతాల స్థితిగతులను తెలుసుకోవడం, ప్రాజెక్టు ఏరియాల కబ్జా/ఆక్రమణలు, ప్రాజెక్టుల పరిశీలన వంటి వాటి గురించి తెలియజేయనున్నారు. ప్రాజెక్టుల్లో ఎంత మేర ఇసుక ఉందన్న విషయాన్ని అంచనా వేయనున్నారు. ప్రాజెక్టుల్లోని రాతి నిర్మాణాలు, డ్యామేజ్?లు తెలుసుకుని వాటి డేటాను డ్రోన్ల ద్వారా ఎలా ప్రాసెస్ చేస్తారన్న విషయాలను చర్చించనున్నారు. వర్క్‌షాప్‌లో డ్రోన్లను ప్రదర్శించనున్నారు.

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంలో విచారణ.. ప్రతివాదులకు నోటీసులు



దిల్లీ: పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. గత విచారణ సందర్భంగా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోడానికి ఎంత సమయం తీసుకుంటారో స్పీకర్‌తో సంప్రదించి వివరాలు అందించాలని ధర్మాసనం ఆదేశించింది.

కౌంటర్లు దాఖలు చేయడానికి ఇప్పటి వరకు తమకు ఎలాంటి నోటీసులు రాలేదని, సాంకేతికంగా ఇది గమనించాల్సిన విషయమని రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ కార్యదర్శి తరపు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ స్పీకర్, కార్యదర్శి, 10 మంది ఎమ్మెల్యేలు, కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఈనెల 22లోపు నోటీసులకు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ మాసిహ్ జార్జ్‌ల ధర్మాసనం మార్చి 25కి వాయిదా వేసింది.




ములకలపల్లి : ఉమ్మడి జిల్లా లో చివరి ఆయకట్టు పొలాలకు సాగునీరు అందించేందుకు సీతారామ ప్రాజెక్టు ను కంప్లీట్ చేయడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావుఅన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలోని పూసుగూడెం, కమలాపురం గ్రామాల్లోని సీతారామ ప్రాజెక్టు ఎత్తిపోతల పనులు, నీటి విడుదలను పరిశీలించారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో లక్షా 30 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. కృష్ణా జలాల పంపిణీ లో కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లు గా వ్యవహరిస్తోందని విమర్శించారు. తెలంగాణకు నీటి కేటాయింపుల పై కేంద్ర జలశక్తి మంత్రిని కలిసేందుకు సీఎం రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమకుమార్ రెడ్డి ఢిల్లీ వెళ్లారని చెప్పారు. రాజీవ్ కెనాల్ ద్వారా సాగర్ ఆయకట్టుకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. సీతారామ ప్రాజెక్టు పంప్ హౌస్ లిఫ్ట్ లతో వైరా రిజర్వాయర్ కు గోదావరి జలాలు తరలించడంతో ఆయకట్టు స్థిరీకరణ అవుతుందన్నారు. తుమ్మల వెంట అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఇరిగేషన్ ఆఫీసర్లు ఉన్నారు.

## అవినీతికి కేరాఫ్ అడ్రస్ చెవిరెడ్డి కుటుంబం: పులివర్తి సుధారెడ్డి

చంద్రగిరి: ఐదేళ్ల వైకాపా పాలనలో ఆ పార్టీ నేతలు ఎన్నో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి, తెదేపా మహిళా నేత సుధారెడ్డి విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనపై నిరాధారమైన ఆరోపణలు చేయిస్తున్నారన్నారు. తాను లంచాలు తీసుకున్నట్లు వైకాపా నేతలు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రగిరిలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సుధారెడ్డి మాట్లాడారు. "నేను, నా భర్త ప్రజాసేవకే అంకితమయ్యాం. అభివృద్ధి చేయడం మాత్రమే మా కుటుంబానికి తెలుసు. అవినీతికి కేరాఫ్ అడ్రస్ చెవిరెడ్డి కుటుంబం. ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా, తుడా ఛైర్మన్‌గా చెవిరెడ్డి రూ.కోట్లు సంపాదించారు.

చెవిరెడ్డి అక్రమాస్తుల వివరాలు నా దగ్గర ఉన్నాయి. ఆయనకు సవాల్ విసురుతున్నా.. సాయంత్రం వరకు చంద్రగిరి క్లాక్ టవర్ దగ్గరే ఉంటాను. నేను అవినీతికి పాల్పడినట్లు ఆధారాలుంటే తీసుకురండి. మీ అవినీతి, అక్రమాల లిస్ట్ నా దగ్గర ఉంది. తుడా ఛైర్మన్‌గా చెవిరెడ్డి చేసిన అవినీతిపై ఒక్కొక్కటిగా ఆధారాలు బయటకు వస్తున్నాయి. తెదేపా నేతలు, కార్యకర్తలపై అవినీతి ఆరోపణలు చేయడం సరికాదు. చెవిరెడ్డి అక్రమాలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తాను" అని సుధారెడ్డి తెలిపారు. చంద్రగిరి క్లాక్ టవర్ వద్ద నుంచే చెవిరెడ్డికి సుధారెడ్డి కాల్ చేయగా.. ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

# విలక్షణ నటుడు కొంగర జగ్గయ్య

## - మార్చి 5 కళా వాచస్పతి కొంగర జగ్గయ్య వర్ధంతి




కొంగర జగ్గయ్య విలక్షణ నటుడు. ఎన్టీఆర్ ఏఎన్నార్ లతో పాటు, విశే ష ప్రేక్షకాదరణ, అశేష అభిమాను లను పొందిన నటుడు. ధరించిన పాత్ర ఏదైనా తన విలక్షణమైన నటనతో ఆ పాత్రకు ప్రాణప్రతిష్ట చేసి ఒక ప్రత్యేకతను, నిండు తనాన్ని, హుందా తనాన్ని సంతరిం ప జేసిన విశిష్ట వ్యక్తి జగ్గయ్య. జగ్గయ్య సినీ నటుడే కాదు ఒక రచయిత, సాహిత్యకారుడు, కళా వాచస్పతి, చిత్రకారుడు, పాత్రికే యుడు, సంపాదకుడు, రాజకీయ వేత్త. ఆకాశవాణి ఢిల్లీ కేంద్రంలో అనౌన్సర్. "ఆకాశవాణి... వార్తలు చదువుతుంది కొంగర జగ్గయ్య" అంటూ కంచు కంఠంతో ఆయన వార్తలు చదివిన సంగతి ఆనాటి శ్రోతలకు విదితమే. కొంగర జగ్గయ్య (డిసెంబర్ 31, 1928 – మార్చి 5, 2004) మాజీ పార్లమెంటు సభ్యుడు, ఆకాశ వాణిలో తొలితరం తెలుగు వార్తల చదువరి. సినిమాలలోను, అనేక నాటకాలలోను వేసిన పాత్రల ద్వారా ఆంధ్రులకు జగ్గయ్య సుపరిచితుడు. మేఘ గంభీరమైన ఆయన కంఠం కారణంగా "కంచు కంఠం" జగ్గయ్యగా, "కళా వాచస్ప తి"గా పేరు గాంచాడు. శివాజీ గణే శన్ నటించిన చిత్రాలు తెలుగులోకి అనువదించిన అన్ని సందర్భాల్లో జగ్గయ్యే కంఠం వినిపించేది. 'కళా వాచస్పతి' అనేది జగ్గయ్యకు ప్రదానం చేసిన బిరుదు కాదు. అది ఢిల్లీ లోని అంతర్జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఇచ్చిన గౌరవ డాక్టరేటు. స్వాతంత్ర్యోద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. ఉద్యమ పోరాటంలో పాల్గొంటూ అజ్ఞాత వాసంలో తలదాల్చు కునేందుకు వచ్చిన అంతర్రాష్ట్ర సమర యోధు లకు తన ఇంటిలో ఆవాసం కల్పిం చిన దేశ భక్తుడు జగ్గయ్య. జగ్గయ్య గుంటూరు జిల్లాలోని తెనాలికి సమీపంలో దుగ్గిరాల దగ్గర మోరంపూడి అనే గ్రామంలో, 1928, డిసెంబర్ 31 న ధనవం తుల కుటుంబంలో జన్మించాడు. 11 సంవత్సరాల పిన్న వయసులో రామాయణంలోని లవుడి పాత్రను బెంగాలీ రచయిత ద్విజేంద్రలాల్ రాయ్ వ్రాసిన సీత అనే ఒక హిందీ నాటకంలో పోషించాడు. గుంటూరు లోని ఆంధ్రా క్రిస్టియను కాలేజీలో ఎన్.టి.రామారావు, కొంగర జగ్గ య్య ఇద్దరు సహ విద్యార్థులు. వీళ్ళిద్దరూ కలిసి ఎన్నో నాటకాలు ప్రదర్శించారు. జగ్గయ్య మూడు సంవత్సరాల పాటు వరుసగా ఉత్తమ నటుడు పురస్కారం పొందాడు. ఇంటర్మీడియట్ తరువాత కొంత కాలం "దేశాభిమాని" అనే పత్రికలో ఉప సంపాదకుడిగానూ, ఆ తర్వాత "ఆంధ్రా రిపబ్లిక్" అనే ఆంగ్ల వారపత్రికకు సంపాదకుడి గానూ పనిచేశాడు. ఢిల్లీలో "ఆల్ ఇండియా రేడియో"లో మూడు సంవత్సరాల పాటు వార్తలు చదివే ఉద్యోగం చేసాడు. చిత్రకారుడు అడవి బాపిరాజు వద్ద చిత్రలేఖనం లో శిక్షణ పొందాడు. 1950ల నుండి 1970ల వరకు తెలుగు చిత్ర పరిశ్రమకు ఎనలేని సేవ చేసాడు. జగ్గయ్య దాదాపు 500కు పైగా చిత్రాలలో, వంద సినిమాల్లో హీరోగా, మరో వంద సినిమాల్లో సహ కథానాయకుడిగా నటించాడు. రెండువందల చిత్రాల్లో క్యారక్టర్ నటుడుగా రాణించాడు. ఎన్.టి.రామారావుతో కలిసి విజయవాడలో రవి ఆర్ట్ థియేటర్ స్థాపించి ఎన్నో నాటకాలు వేసి పరిషత్తు పోటీలలో బహుమతులు గెలుచుకున్నాడు. బుచ్చిబాబు రాసిన దారిన పోయే దానయ్య నాటిక జగ్గయ్యకు పేరు తెచ్చి పెట్టింది. ఎన్.టి. రామారావు, జమున, సావిత్రి, గుమ్మడి, ముక్కామల వంటి నటీనటులతో రంగస్థలం మీద నటించిన జగ్గయ్య ఎందరు నటులకో మార్గదర్శకుడు. నటి సావిత్రి నాట్యానికే పరిమితమైన ఆరోజుల్లో తను రచించిన 'బలిదానం' అనే నాటకం ద్వారా రంగస్థల నటిగా మార్చిన ఘనత జగ్గయ్యకు దక్కుతుంది. 100కు పైగా సినిమాలలో డబ్బింగు చేసాడు. తమిళ చిత్రరంగ నటుడు శివాజీ గణేశన్ నటించిన తెలుగు సినిమాలలో జగ్గయ్యే గాత్రధారణ చేసేవాడు. అంతేకాదు తెలుగులోకి డబ్బింగు చేసిన జురాసిక్ పార్క్ అనే ఆంగ్ల చిత్రంలో రిచర్డ్ అట్టెంబరో పాత్రకు తన గాత్రాన్ని అరువు ఇచ్చాడు. అల్లూరి సీతారామరాజులో పోషించిన రూథర్ ఫర్డ్ పాత్ర ఆయన జీవితంలో మరపురానిది. ఆ సినిమా తీసే నాటికి రూథర్ ఫర్డ్ చరిత్ర మరచి పోయిన వ్యక్తి కాదు. రూథర్ ఫర్డ్ ఎలా ఉంటాడో, ఎలా ప్రవర్తించేవాడో తెలిసిన వాళ్ళు అప్పటికి చాలా ఉన్నారు. 1940 వరకు ప్రభుత్వ సర్వీసులో ఉన్నా డు. కృష్ణా జిల్లా, గుంటూరు, కడప తదితర ప్రాంతాల్లో పనిచేశాడు. వారిని కలిసి, జగ్గయ్య రూథర్ ఫర్డ్ ప్రవర్తన గురించి, మనస్తత్వం గురించి తెలుసు కున్నాడు. రూథర్ ఫర్డ్ చాలా మంచి వ్యక్తి అని, సీతా రామరాజు అంటే ఆయనకు గౌరవం ఉండేదని తెలుసు కున్నాడు. అయితే రూథర్ ఫర్డ్ బ్రిటిష్ ప్రభుత్వానికి విధేయుడుగా, సేవకుడిగా అతను సీతారామ రాజును పట్టుకోక తప్పని స్థితి గురించి అవగాహన కలిగాక, జగ్గయ్య చిత్ర రచయిత మహారథిని కలిసి ఆ పాత్రను రొటీన్ విలన్ లా కాకుండా విధి నిర్వహణకు బద్ధుడై ఉండే హుందా అయిన వ్యక్తిలా మార్చి వ్రాయాలని కోరాడు. అలా ఆ పాత్ర చిత్రణ మార్చడంతో ఆ పాత్ర నిలబడడంతో బాటు సీతా రామరాజు పాత్ర మరింతగా హిట్ అయింది. ఆ సినిమా చూశాక పి.వి.నరసింహారావు జగ్గయ్యకు ఫోన్ చేసి "మీ పాత్ర పోషణ అద్భుతం." అని ప్రశంసించారట. 1967లో నాలుగవ లోక్‌సభకు జరిగిన ఎన్నికలలో ఒంగోలు నియోజక వర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి, 80 వేల ఓట్ల మెజారిటీతో గెలిచాడు. లోక్ సభకు ఎన్నికైన తొలి దక్షినాది, తొలి భారతీయ నటుడు జగ్గయ్య కావడం విశేషం. 1930లో గాంధీజీ నాయకత్వంలో జరిగిన సహాయ నిరాకరణోద్యమం నేపథ్యంలో డాన్సులు, డ్యుయెట్ల వంటి ఆకర్షణలు లేకుండా "పదండి ముందుకు" తీశారు. ఈ తొలి రాజకీయ చిత్రానికి రాష్ట్ర ప్రభుత్వం 50,000 రూపాయల పురస్కారాన్ని ఇచ్చింది. ఈ సినిమా రష్యాలో తాష్కెంట్ ఫిల్మ్ ఫెస్టివల్ తో బాటు మరికొన్ని నగరాల్లో ప్రదర్శితమైంది. సంభాషణలతో బాటు చిత్రం చివర్లో వచ్చే 'మంచికి కాలం తీరిందా' అనే పాటను కూడా జగ్గయ్యే వ్రాశాడు. ఇది మహమ్మద్ రఫీ పాడిన తొలి తెలుగు పాట. కృష్ణ ఒక చిన్న పాత్ర చేశాడు. మోహన్ బాబు నిర్మించిన 'కుంతీ పుత్రుడు' లో జగ్గయ్య చివరిసారిగా నటించారు. నోబెల్ పురస్కారము అందుకున్న రవీంద్రుని గీతాంజలిని "రవీంద్ర గీతా" అనే పేరుతో తెలుగులోకి అనువదించాడు. గీతాంజలికి ఇది తొలి తెలుగు అనువాదం. రవీంద్ర నాథ ఠాగూరు రాసిన నాటకం "సాక్రిఫైస్" ను తెలుగులోకి "బలిదానం" అనే పేరుతో అనువదించాడు. భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన "పద్మభూషణ్" తో సత్కరించింది. ఢిల్లీ లోని సంస్కృత విశ్వ విద్యా లయం "కళా వాచస్పతి"అనే బిరు దుతో జగ్గయ్యను సత్కరించింది. తెలుగు విశ్వ విద్యాలయం గౌరవ "డాక్టరేటు"తో సత్కరించింది. తమిళనాడు ప్రభుత్వం "కలైమా మణి" బిరుదు నిచ్చింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం "కళాప్రపూర్ణ" బిరుదుతో సత్కరించింది. 2004, మార్చి 5 న 76 సంవత్సరాల వయసులో చెన్నైలో గుండెపోటుతో జగ్గయ్య మరణించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయ కవి

## - మార్చి 5...మధునాపంతుల జయంతి




మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి (1920–1992) తెలుగు సాహిత్యంలో ప్రముఖ కవి, విమర్శకుడు, రచయిత. ఆయన సంప్రదాయ సాహిత్యాన్ని నూతనంగా రూపుదిద్దిన మహాకవి. "ఆంధ్ర కల్హణ", "కళా ప్రపూర్ణ" వంటి బిరుదులు ఆయనకు లభించాయి. సిద్ధార్థి నామ సంవత్సరం ఫాల్గుణ పౌర్ణమి నాటికి సరి అయిన 1920, మార్చి 5వ తేదీన తూర్పు గోదావరి జిల్లా ఐలెండు పోలవరంలో జన్మించిన శాస్త్రి బాల్యంలోనే కవిత్వంపై ఆసక్తి కనబరిచారు. మహేంద్రవాడ సుబ్బరాయశాస్త్రి, ఓలేటి వెంకటరామశాస్త్రిల వద్ద విద్య అభ్యసించారు. ఆంధ్ర భాషమీద ఉన్న అపారమైన అభిమానంతో 1939లో ఆంధ్రి అనే మాసపత్రికను ప్రారంభించారు. ఈ పత్రిక ఆనాటి పండితుల, పరిశోధకుల అభిమానం చూరగొంది. ఈ పత్రిక సాహిత్య మాసపత్రికలలో మేల్తరమైనది, అందలి ప్రతి వ్యాసానికి, కవితలకు శాస్త్రి పుటకు దిగువ పాద గమనికలు వ్రాసేవారు. 1940లో మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి విద్వాన్ పట్టా పొందారు. 1940లో మద్రాసు విశ్వవిద్యాలయం నుండి విద్వాన్ పరీక్ష ఉత్తీర్ణుడయ్యారు. 1940–44ల మధ్యకాలంలో 'సూర్యరాయాంధ్ర నిఘంటువు' నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్నారు. 1947లో ఆయన నివాసం రాజమండ్రికి మార్చి వీరేశలింగ ఆస్తికోన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా చేరి 1974 వరకు అ పాఠశాలలోనే పనిచేసి పదవీ విరమణ చేశారు. శాస్త్రి అద్భుతమైన ఖండకావ్యాలు, పురాణాలు, విమర్శా రచనలు అందించారు. "ఆంధ్ర పురాణం" ఆయన ముఖ్య రచనగా నిలిచింది. "ఆంధ్ర రచయితలు" అనే గ్రంథంలో తెలుగు సాహిత్యకారుల విశేషాలను వర్ణించారు. ఆయన రచనలలో ...ఖండకావ్యాలు: తోరణం, శ్రీఖండం, చైత్రరథం, కేళాకుళి, పురాణ కావ్యాలు: ఆంధ్ర పురాణం, నవలలు: బోధివృక్షము, కళ్యాణతార, చరిత్ర రచనలు: పతంజలి చరిత్ర, ధన్వంతరి చరిత్ర ముఖ్యమైనవి. శాస్త్రి రచనలు విశ్లేషణాత్మకంగా, పరిశోధనాత్మకంగా ఉండేవి. "ఆంధ్ర రచయితలు" గ్రంథంలో శతకవికుల నుంచి ఆధునిక రచయితల వరకు సమగ్ర సమీక్ష చేశారు. విశ్వనాథ సత్యనారాయణ, శాస్త్రిని "రాజమహేంద్రిలో నడయాడుతున్న నన్నయ" అని ప్రశంసించారు. తెలుగు చరిత్రను కావ్యరూపంలో అందించినందుకు "ఆంధ్ర కల్హణ" బిరుదును పొందారు. 1992 నవంబర్ 7న ఆయన పరమపదించారు.

ఆయన రచనలు, విమర్శలు, అనువాదాలు తెలుగుభాషాభిమానులకు చిరస్థాయిగా నిలుస్తాయి. మధునాపంతుల శాస్త్రి తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయ కవి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాల మిస్ట్...9440595494**

# ప్రపంచ ప్రజాస్వామ్య గ్లోబల్ ర్యాంకింగ్స్.. భారత్ స్థానమెంతంటే?



ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిస్థితి రోజురోజుకీ సంక్షోభంలో పడుతున్నట్లు "ది ఎకనమిస్ట్" కు చెందిన ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ తాజాగా ప్రకటించిన గ్లోబల్ డెమోక్రసీ ఇండెక్స్ 2024 వెల్లడించింది. ప్రతి సంవత్సరం ఈ సంస్థ 167 దేశాల్లో ప్రజాస్వామ్య స్థాయిని అంచనా వేసి, 0 నుంచి 10 వరకు స్కోర్ కేటాయించి ర్యాంకులను ప్రకటిస్తుంది. ఈ నివేదిక ప్రకారం, నార్వే 9.81 పాయింట్లతో వరుసగా 16వ సంవత్సరం మొదటి స్థానాన్ని దక్కించుకుంది. న్యూజీలాండ్, స్వీడన్ దేశాలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. అయితే, ప్రజాస్వామ్య పరంగా అత్యంత బలహీనంగా నిలిచిన దేశాల జాబితాలో పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్తాన్ ఉన్నాయి. ఈ దేశాల్లో ప్రజాస్వామ్య విలువలు క్షీణిస్తున్నాయని నివేదిక పేర్కొంది. అంతేకాకుండా, మయన్మార్ (166), ఉత్తర కొరియా (165), చైనా (145), లావోస్ (160), వియత్నాం (133) దేశాలు కూడా ప్రజాస్వామ్య పరంగా బలహీనంగా నిలిచాయి. అఫ్ఘానిస్తాన్ కేవలం 0.25 పాయింట్లు మాత్రమే సాధించి 167వ ర్యాంకులో ఆఖరున నిలిచింది. తాలిబాన్ పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థలు పూర్తిగా దెబ్బతిన్నాయని, మహిళల హక్కులు, మీడియా స్వేచ్ఛ హరించబడటంతో దేశ పరిస్థితి మరింత దారుణంగా మారిందని నివేదిక స్పష్టం చేసింది. పాకిస్తాన్ ప్రజాస్వామ్య స్థాయి మరింత క్షీణించి 124వ స్థానానికి పడిపోయింది. ఈ దేశం గత 16 ఏళ్లలో 6 స్థానాలు దిగజారడం గమనార్హం. రాజకీయ అస్థిరత, ఎన్నికల లోపాలు, సైనిక జోక్యం, పత్రికా స్వేచ్ఛ హరించబడటం వంటి అంశాలు పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. భారతదేశం గురించి విశ్లేషిస్తే, ఆసియా ఖండంలో మెరుగైన స్థానంలో ఉన్నప్పటికీ, ప్రపంచ ర్యాంకింగ్‌లో 41వ స్థానాన్ని దక్కించుకుంది. అయితే, ఈ నివేదిక భారతదేశాన్ని "లోపభూయిష్ట ప్రజాస్వామ్య దేశాల" జాబితాలో చేర్చింది. ప్రజాస్వామ్య విలువలు క్రమంగా తగ్గిపోతున్నాయని, మీడియా స్వేచ్ఛ కొంత మేర తగ్గిందని నివేదిక పేర్కొంది. ఈ జాబితాలో అమెరికా 28వ స్థానంలో, ఫ్రాన్స్ 26వ స్థానంలో ఉన్నాయి. ఆసియా దేశాల్లో దక్షిణ కొరియా కూడా పూర్తిస్థాయి ప్రజాస్వామ్య దేశాల జాబితా నుంచి బయటపడిపోయి, 32వ స్థానానికి పడిపోయింది. యూరోపియన్ సెంటర్ ఫర్ పాపులిజం స్టడీస్ (%జుజూూ%) ప్రకారం.. ప్రజాస్వామ్య దేశాల్లో ఎన్నికలు న్యాయబద్ధంగా, స్వేచ్ఛగా జరిగినప్పటికీ, మీడియా స్వేచ్ఛ లేకపోవడం, రాజకీయ ప్రత్యర్థుల అణచివేత వంటి సమస్యలు ఉంటే ఆ దేశాలను "లోపభూయిష్ట ప్రజాస్వామ్య దేశాలుగా" వర్గీకరిస్తారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ సంస్కృతి అభివృద్ధి చెందకపోవడం, పాలనలో పారదర్శకత లేకపోవడం వంటి అంశాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారుతున్నాయని ఈ నివేదిక హెచ్చరించింది.

# బాహుబలి అమ్మాయి.. బాగా నచ్చావ్ అమ్మీ!


అబ్బాయిలే కండలు పెంచాలి.. అమ్మాయిలు సుకుమా రంగా ఉండాలన్నది పాత నానుడీ.. అనకాలపల్లి నుంచి అంతరిక్షం దాకా అంతటా అమ్మాయిలు రాజ్యమేలుతున్న ఈ లోకంలో వారిని ఎందులోనూ తక్కువగా చూపడానికి.. చూడడానికి ఆస్కారమే లేదు. అందుకే అందంలోనూ.. అందాన్ని విభిన్నంగా ప్రదర్శించడంలోనూ అమ్మాయిలు తమకు తామే సాటి అని నిరూపించుకున్నారు. మగాళ్లే కాదు.. ఆడవాళ్లు కూడా కండలు పెంచగలరని ఎన్నో సార్లు నిరూపించారు. లేడీ వస్తాదులు ఒలంపిక్స్ పతకాలు తీసుకొచ్చారు. దేశానికి పేరు తెచ్చారు వారిపై ఏకంగా 'దంగల్' లాంటి సినిమాలు రిలీజ్ అయ్యాయి.. 2 వేల కోట్లకు పైగా కొల్లగొట్టి దేశంలోనే అత్యధిక కలెక్షన్లు సాధించిపెట్టాయి. కర్ణాటకకు చెందిన చిత్ర అనే యువతి పెళ్లి కూతురులా ముస్తాబై.. బాహుబలిలా కండలు చూపిస్తూ ఇచ్చిన ఫోజులతో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ఫిట్‌నెస్ ట్రైనర్‌గా పనిచేస్తున్న చిత్ర సంప్రదాయ కంజీవరం చీరను ధరించి, సంపూర్ణ పెళ్లికూతురిలా ముస్తాబై తన కండలను ప్రదర్శిస్తూ కనువిందు చేసింది. ఆమె బంగారు నగలు ధరించి, సంప్రదాయతను పాటించినప్పటికీ, తన బాడీబిల్డింగ్ పోజులతో అందరినీ ఆశ్చర్యపరిచింది. పెళ్లి దుస్తుల్లోనూ తన ఫిట్‌నెస్ ప్రదర్శన కొనసాగించడం నెటిజన్లను ఆకట్టుకుంది.



ఆమె కాన్ఫిడెన్స్‌కి, ఫిట్‌నెస్‌పై ఉన్న ప్రేమకు ప్రతి ఒక్కరూ ఫిదా అవుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఈ వీడియో చూసిన వారంతా చిత్రను అభినందిస్తున్నారు. "పెళ్లి కూతురు స్టైల్లోనూ బాడీబిల్డింగ్ చూపించగల సమర్థత ఉన్న మహిళలకు ఇది గొప్ప ప్రేరణ" అంటూ చాలా మంది కామెంట్లు చేస్తున్నారు. చిత్ర లాంటి మహిళలు తమ ఫిట్‌నెస్‌తో, కాన్ఫిడెన్స్‌తో, సాంప్రదాయాన్నీ, ఆధునికతనూ కలిపి సమతుల్యాన్ని చూపించడం విశేషం. ఆమె వీడియో ఇప్పుడు అమ్మాయిలందరికీ స్ఫూర్తిదాయకంగా మారింది.

# ఉక్రెయిన్ కు షాక్.. మిలటరీ, రక్షణ సహా అన్నీ బంద్ చేసిన అమెరికా!

అమెరికాకు వచ్చి.. వైట్ హౌస్ లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తోనే వాగ్వాదం పెట్టుకున్న ఉక్రెయిన్ అధ్యక్షుడికి గట్టి షాక్ తగిలింది. తమ మాట వినని జెలెన్ స్కీకి దిమ్మదిరిగేలా కౌంటర్ ఇచ్చాడు ట్రంప్. రష్యాతో యుద్ధం ముగించి శాంతి స్థాపన చేయాలన్న ట్రంప్ మాటను పెడచెవిన పెట్టినందుకు ఇప్పుడు యుద్ధం వేళ ఉక్రెయిన్ ను చావుదెబ్బ తీశాడు ట్రంప్. ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లోదిమిర్ జెలెన్స్కి రష్యాతో యుద్ధాన్ని ముగించేందుకు.. దీనిపై ఏదో ఒకటి నిర్ణయించేంత వరకూ ఉక్రెయిన్ కు అమెరికా అందించే అన్ని సహాయాలను అధ్యక్షుడు ట్రంప్ నిలిపివేసిన్నట్టు యుఎస్ మీడియా నివేదికలు పేర్కొన్నాయి. ఫాక్స్ న్యూస్‌లో ఈ మేరకు ఓ అధికారి ఇచ్చిన సమాచారం ప్రకారం ఈ ఆదేశం త్వరలోనే అమలులోకి రానుందని తెలిపింది. అధ్యక్షుడు ట్రంప్ మంగళవారం సాయంత్రం అమెరికా కాంగ్రెస్ ఉభయ సభలకు తన ప్రసంగంలో ఉక్రెయిన్ అంశంపై మాట్లాడనున్నారు. ఇదే రోజు కెనడా , మెక్సికో నుండి దిగుమతయ్యే వస్తువులపై 25 శాతం, చైనా నుండి వచ్చే వస్తువులపై 20 శాతం టారిఫ్ పెంపు అమలులోకి రానుంది. వైట్ హౌస్‌లో ఉ



క్రెయిన్ తో మళ్లీ చర్చలు ప్రారంభిస్తారన్న అన్న ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ "అమెరికా ఉక్రెయిన్ కు ఎల్లప్పుడూ అండగా నిలిచిందని మరింత అభినందించాల్సిన అవసరం ఉంది" అని అన్నారు. తమ డిమాండ్లకు ఒప్పుకుంటే చర్చలు కొనసాగుతాయన్నారు. లండన్‌లో జెలెన్స్కి యుద్ధం ఇంకా చాలా కాలం కొనసాగవచ్చని చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. రష్యా యుద్ధాన్ని ముగించాలని కోరుకుంటోందని, అలాగే ఉక్రెయిన్ ప్రజలు కూడా అదే కోరుకుంటున్నారని అన్నారు. ఇది జెలెన్స్కికి అతని వర్గానికి ఇష్టం లేదని ట్రంప్ అన్నారు. కొన్ని వారాల క్రితం, ట్రంప్ ఏకంగా జెలెన్స్కిని "డిక్టేటర్" అని విమర్శించారు. అలాగే ఎన్నికల గురించి ఆలోచించకపోవడానికి కారణం అతను ఓడిపోతానని భయపడటమే అని సూచించారు. ఓవల్ కార్యాలయంలో జరిగిన గట్టి వాదనల తర్వాత, ఉక్రెయిన్ కు మద్దతు తెలిపే ప్రముఖ రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహమ్ ఏకంగా జెలెన్స్కి రాజీనామా చేయాలని పిలుపునిచ్చారు. దీనికి జెలెన్స్కి స్పందిస్తూ "నేను ఉక్రెయిన్ ప్రజలకే మాత్రమే సమాధానం చెప్పాలి" అని అన్నారు. అంతేకాకుండా గ్రాహమ్‌కి యుక్రైన్ పౌరసత్వాన్ని ఆఫర్ చేస్తూ "అక్కడి ఎన్నికల్లో ఓటు వేయడానికి మీకు అవకాశం ఉంటే, నన్ను తొలగించడానికి ప్రయత్నించండి" అని వ్యంగ్యంగా చెప్పారు. దీంతో జెలెన్ స్కీ ఇక తగ్గేలా కనిపించడం లేదని భావించిన ట్రంప్ ఆ దేశానికి అన్ని రకాల సహాయాలను నిలిపివేస్తూ షాకిచ్చారు. మరి యూరప్ దేశాలు ఉక్రెయిన్ కు అండగా ఉంటాయా? రష్యా ఈ యుద్ధాన్ని కొనసాగిస్తుందా? ఉక్రెయిన్ ఇప్పుడు ఏం చేస్తుందన్నది తేలాల్సి ఉంది.

చురకలు

## సంపాదకీయం

# మస్క్ అన్నట్టు అమెరికా నాటో నుంచి తప్పుకుంటే లాభమా? నష్టమా?

ప్రపంచ రాజకీయాల్లో అమెరికా కీలక పాత్ర పోషిస్తున్నది. ముఖ్యంగా నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ కూటమిలో అమెరికా ప్రధాన భాగస్వామిగా ఉంది. అయితే, ఇటీవల టెక్ మిలియనీర్ ఎలాన్ మస్క్ నాటో కూటమి నుంచి అమెరికా వైదొలగాలనే వాదనకు మద్దతు తెలపడం సంచలనంగా మారింది. ఆయన అభిప్రాయం ప్రకారం.. అమెరికా తన స్వంత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు. అయితే, నిజంగా ఇది సరైన నిర్ణయమేనా? దీని వల్ల ఎవరికీ లాభం? ఎవరికి నష్టం?

**– నాటోలో అమెరికా పాత్ర**... నాటో 1949 లో స్థాపించబడింది. ప్రధానంగా ఇది పశ్చిమ దేశాల భద్రతా సంరక్షణ కోసం రూపొందించబడిన కూటమి. అమెరికా ఈ కూటమికి ప్రధాన బలంగా నిలుస్తోంది. అమెరికా తన %+ఞా%లో యూరప్ దేశాలకంటే ఎక్కువ శాతం నిధులను ఈ కూటమికి కేటాయిస్తూ వస్తోంది.. దీన్నే ట్రంప్ తప్పుపడుతున్నారు. యూరప్ దేశాలు ఎక్కువ ఖర్చు పెట్టాలని డిమాండ్ చేస్తున్నాడు.

**– అమెరికా తప్పుకుంటే ఎవరికి నష్టం?...** యూరోప్ దేశాలకు: అమెరికా మద్దతు లేకుంటే యూరోప్ దేశాలు రష్యా వంటి బలమైన శక్తుల నుంచి తమను తాము కాపాడుకోవడానికి కష్టపడతాయి.

**– ట్రంప్ 'గోల్డ్ కార్డ్' వీసాను తిరస్కరించిన బిలియనీర్లు.. కారణమిదే...** జాతీయ భద్రతపై ప్రభావం: అమెరికా నాటో నుంచి వైదొలిగితే, తన భద్రతా వ్యూహంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉంటుంది. ఇది రష్యా, చైనా వంటి శక్తులకు బలాన్నిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచ రాజకీయం మార్పులు: అమెరికా నాటో నుంచి తప్పుకుంటే, యూరప్ దేశాలు కొత్త భద్రతా ఒప్పందాల కోసం ఇతర దేశాలపై ఆధారపడవచ్చు. ఇది జియో పొలిటికల్ సమీకరణాలను పూర్తిగా మార్చివేయొచ్చు.

**– అమెరికాకు లాభమా?...** ఆర్థిక ప్రయోజనాలు: నాటోలో భాగంగా అమెరికా గణనీయమైన మొత్తం ఖర్చు చేస్తోంది. నాటో నుంచి తప్పుకుంటే ఈ వ్యయం తగ్గించుకోవచ్చు. అమెరికా స్వప్రయోజనాలకు వాడుకోవచ్చన్నది ట్రంప్, మస్క్ ప్లాన్. అమెరికన్ ఫస్ట్ నినాదానికి ఇది బూస్ట్ లా పనిచేస్తుంది. ఆత్మనిబ్బరత: మస్క్ అభిప్రాయం ప్రకారం.. అమెరికా ఇతర దేశాల రక్షణలో కాకుండా, తన సొంత ప్రయోజనాలపై దృష్టి పెడితే మంచిదని భావిస్తున్నారు. అభివృద్ధి ప్రాజెక్టులపై పెట్టుబడి: నాటో ఖర్చును కట్ చేసి.. ఆ మొత్తాన్ని అమెరికా అంతర్గత అభివృద్ధికి ఉపయోగించుకోవచ్చు. నాటో నుంచి అమెరికా వైదొలగితే దాని ప్రభావం అంతర్జాతీయంగా చాలా విస్తృతంగా ఉంటుంది. దీని వల్ల అమెరికా తక్కువ ఖర్చుతో సొంత ప్రయోజనాలపై దృష్టి పెట్టగలుగుతుంది, కానీ దీని ప్రభావం యూరప్ భద్రతపై తీవ్రమైనదిగా ఉండొచ్చు. ప్రపంచ రాజకీయాల్లో కొత్త మార్పులను తెస్తుంది. సంఖ్యా పరంగా చూస్తే, అమెరికా నాటోలో కొనసాగడం భద్రతా పరంగా మంచిదని, అదే సమయంలో ఆర్థికంగా కొంత భారం అని చెప్పవచ్చు. కాబట్టి, దీని లాభనష్టాలను పూర్తిగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ఎలాన్ మస్క్ అభిప్రాయం కొంతమేరకు ఆర్థికంగా వాస్తవమైనదైనా, భద్రతా పరంగా దీని ప్రభావం లోతుగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

# తెలుగు సినీ సంగీతంలో చెరగని ముద్ర పిఠాపురం - మార్చి 5...పిఠాపురం నాగేశ్వరరావు వర్ధంతి



తెలుగు సినీ సంగీతంలో హాస్య గీతాలను ప్రాచుర్యంలోకి తెచ్చిన ప్రముఖ గాయకుల్లో పిఠాపురం నాగేశ్వరరావు ఒకరు. తన వినూత్న గాత్రశైలి, వినోద భరితమైన హాస్య గీతాలతో తెలుగు ప్రేక్షకులను అలరించిన ఈ గాయకుడు, తనదైన శైలిలో చిరస్థాయిగా నిలిచి పోయారు. 1940ల నుండి 1970ల వరకు తెలుగు చిత్రసీమలో హాస్య గీతాలను పాడి, ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. పిఠాపురం నాగేశ్వరరావు అసలు పేరు పాతర్లగడ్డ నాగేశ్వరరావు. ఆయన 1930, మే 5న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లా, పిఠాపురం గ్రామంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు విశ్వనాథం – అప్పయమ్మ గార్లు. ఆయన తండ్రి రంగస్థల నటుడు కావడంతో చిన్నతనం నుండే రంగస్థలంపై ఆసక్తి కలిగారు. పిఠాపురం నాగేశ్వరరావు చిన్నతనం నుండే నాటకాలలో పాల్గొన్నారు. "శ్రీకృష్ణ తులాభారం", "బాలనాగమ్మ", "కృష్ణార్జున యుద్ధం", "దేవదాసు", "ఏకలవ్య" వంటి నాటకాలలో అర్జునుడు, శ్రీకృష్ణుడు, దుర్యోధనుడు, సుబ్బిసెట్టి పాత్రలు పోషించి మంచి నటుడిగా గుర్తింపు పొందారు. ఈ నాటకాలలో పాటలు, పద్యాలు, శ్లోకాలు పాడే ప్రత్యేకత ఆయనకు ఉండేది. కొంతమంది నటీనటులు పాటలు పాడలేని సందర్భాల్లో తెరవెనుక ఆయన పాటలు పాడేవారు. ఇదే ఆయన సినీ సంగీత రంగం వైపు అడుగులు వేయడానికి ప్రేరణగా మారింది. పిఠాపురం నాగేశ్వరరావు సినీరంగ ప్రవేశం 1946లో విడుదలైన "మంగళ సూత్రం" సినిమా ద్వారా జరిగింది. అప్పటికే 16 ఏళ్ల యువకుడైన ఆయన, తన గాత్రంతో పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు పొందారు. సినీ పరిశ్రమలో హాస్య గీతాలకు ప్రత్యేక స్థానం కల్పించిన తొలి గాయకులలో ఆయన ఒకరు. ఆయన పాటలు వినసొంపుగా, వినోద భరితంగా ఉండటంతో ప్రేక్షకుల హృదయాలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. పిఠాపురం పాడిన హాస్య గీతాలు ఇప్పటికీ తెలుగు సంగీత ప్రేమికులలో మధురమైన జ్ఞాపకాలను మిగిల్చాయి. అయితే, ఆయన గొంతులోని వినోదాత్మకత, ప్రత్యేకమైన ఉత్సాహం పాటలకు ప్రాణం పోశాయి. ఆయన పాటల్లో సాహిత్యం, వినోదం, మిమిక్రి శైలి కలిసి వచ్చేవి. పాటల్లో వింత వింతగా పలికే పదజాలం, మాటలతో నవ్వించే తీరు ఆయనకు ప్రత్యేకమైన గుర్తింపు నిచ్చాయి. ఆయన పాటలు రేలంగి, పద్మనాభం, రాజబాబు వంటి హాస్య నటులకు మరింత బలాన్ని ఇచ్చేవి. అందుకే "ఆంధ్ర రఫీ", "జనతా సింగర్", "గాన గంధర్వ" వంటి బిరుదులు ఆయనకు దక్కాయి. పిఠాపురం నాగేశ్వరరావు దాదాపు 25 సంవత్సరాల పాటు సినీ పరిశ్రమలో పాటలు పాడారు. 1970ల నాటికి సినీ పరిశ్రమలో సంగీత స్వరూపం మారిపోవడంతో, పిఠాపురం నాగేశ్వరరావు గీతాల సంఖ్య తగ్గిపోయింది. అయితే, ఆయన పాడిన పాటలు ఇప్పటికీ రేడియో, టీవీ కార్యక్రమాల్లో ప్రసారం అవుతూనే ఉన్నాయి. సినీ సంగీతంలో ఆయన చేసిన కృషిని గుర్తిస్తూ అనేక సంగీత కార్యక్రమాలు, ప్రత్యేక అనుస్మరణ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. పిఠాపురం నాగేశ్వరరావు 1996, మార్చి 5న కన్ను మూశారు. కానీ, ఆయన పాటలు ఆయన పేరును చిరస్థాయిగా నిలిపాయి. ఆయన ఒక నిర్దిష్ట శైలికి చెందిన గాయకుడు. ముఖ్యంగా హాస్య గీతాలకు ఆయన జన్మనిచ్చినవారు. ఆయన గొంతులో వినసొంపైన హాస్యం, నటనతో కలిసిన గానం, పాటల్లో తనదైన ముద్ర ఆయనను మరొకరితో పోల్చలేని గొప్ప గాయకుడిగా నిలిపాయి. ఈనాటి సంగీత ప్రియులు, పాత తెలుగు పాటలను ఆస్వాదించే వారు పిఠాపురం పాటలను వింటే, ఆయన గాత్రంలోని నవ్వు, ఉత్సాహం, వినోదం ఇప్పటికీ నవనవలాడుతూనే ఉంటాయి. పాటలపై మక్కువ ఉన్న తెలుగు ప్రజలు, హాస్యగీతాల అభిమానులు ఆయనను ఎప్పటికీ మరిచిపోలేరు!

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# అవకాశాలున్నా అందుకోలేని అభాగిని అలనాటి మేటి నటి ... - మార్చి 5...చిత్తజల్లు కాంచనమాల జయంతి




ప్రతిభ ఉండీ, అందం, అభినయం అద్భుతంగా కలిగి, అవకాశాలు గడప తట్టినా, వాటిని వినియోగించు కొలేని తెలుగు సినీ నటి చిత్తజల్లు కాంచనమాల. తెలుగు సినీ ప్రపంచంలో తొలి తరం కథానాయికగా, ఆమె పేరుతో, ఫోటోతో తయారు చేసి మార్కెట్ లోకి వదిలిన వస్తువులు క్షణాలలో అమ్ముడు పోయాయంటే ఆమెకు ఆ రోజుల్లో గల క్రేజీ అర్థం అవుతుంది. అంతటి అభిమాన గణం కలిగి, నిర్మాతలు, దర్శకులు ఆమె తమ చిత్రాలలో నటించాలని కోరుకున్నా, విధి వంచితయైన ఆమె జీవితం హృదయ విదారక రం. కాంచనమాల (మార్చి 5, 1917 – జనవరి 24, 1981) తొలితరం నటీమణులలో ఒకరు. ఆంధ్రా ప్యారిస్‌గా పేరుపొందిన తెనాలి పట్టణం ఆమె జన్మస్థలం. ఆ కాలంలో బాగా పేరు తెచ్చుకున్న నటీమణులలో ఆమె ఒకరు. కాంచనమాల మార్చి 5, 1917లో గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని కూచిపూడి (అమృతలూరు)లో జన్మించారు. చిన్నాన్న దగ్గర సంగీతం నేర్చుకున్న కాంచనమాల ఓ చిన్న పాత్ర ద్వారా సినిమాలో ప్రవేశించారు. కాంచనమాల రూప లావణ్యం, విశాల నేత్రాలు, అందమైన ముఖం చూసి సి. పుల్లయ్య ఆమె చేత వై.వి.రావు నిర్మించిన కృష్ణ తులాభారం (1935) లో మిత్రవింద వేషం వేయించారు. రూప లావణ్యవతి అయిన ఆమె ఆ సినిమాలో తన అందంతో అందరి చూపులని తన వైపుకు తిప్పుకున్నారు. ఆ తర్వాత చిత్రం వీరాభిమన్యు (1936) లోనే ఆమె కథానయిక స్థానం దక్కించు కున్నారు. ఆ తర్వాత వరుసగా విప్ర నారయణ (1937), మాల పిల్ల (1938), వందేమాతరం (1939), మళ్ళీ పెళ్ళి (1939), ఇల్లాలు (1940), మైరావణ (1940), బాల నాగమ్మ (1942) వంటి సినిమాలలో కథానాయిక పాత్ర పోషించారు. గృహలక్ష్మి (1938) లో మాత్రం వాంప్ పాత్ర పోషించారు. విప్ర నారాయణలో దేవదేవిగా ఆమె అందం, అభినయం అప్పటి ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయేదిగా మారింది. తర్వాత మాలపిల్లలో టైటిల్ రోల్ పోషించి, మాల పిల్ల ఇంత అందంగా ఉంటే ఎవరు పెళ్ళి చేసుకోరు అని ఎందరి చేతో అనిపించు కున్నారు కాంచనమాల. కులాంతర వివాహాల ఉద్యమాలు జరుగుతున్న ఆ కాలంలో ఆ సినిమా రావడం నిజంగా అభినందనీయం. ఆ సినిమా రెండవ భాగంలో ఆమె విద్యావంతురాలిగా కన్పిస్తారు. ఒక సీన్లో ఆమె స్లీవ్ లెస్ జాకెట్ ధరించి చిరునవ్వుతో కాఫీ తాగే స్టిల్ ఎన్నో కాలెండర్ల మీద అచ్చయింది. అలా తొలితరం గ్లామర్ క్వీన్ గా వెలుగొందారు ఆమె. అప్పట్లోనే కాంచన మాల చీరలు, జాకెట్లు, గాజులు బాగా అమ్ముడయ్యేవి..ఆ సమయంలోనే గృహలక్ష్మిలో వాంప్ పాత్ర ధరించిన ఆమె విమర్శకుల మన్ననలు కూడా అందుకుంది. ఆ తర్వాత వచ్చిన వందేమాతరం సినిమాలో ఈమె చిత్తూరు నాగయ్య సరసన నటించారు. అది నాగయ్య రెండవ సినిమా. ఈ చిత్రం ద్వారా నాగయ్య, కాంచనమాల గారు ఇద్దరూ పేరు తెచ్చు కున్నారు. ఆ సమయంలోనే వచ్చిన మళ్ళీపెళ్ళి వితంతు వివాహాన్ని ప్రబోధించిన చిత్రం. ఆ చిత్రంలో ఆమె వితంతువుగా కూడా అందంగా ఉన్నారని అందరూ చెప్పుకునే వారట. ఆమె నటించిన ఇల్లాలు సినిమా విడుదల అయి మునుపటి సినిమాలంత విజయం సాధించలేక పోయినా ఆంధ్రపత్రిక ఫిలిం బ్యాలెట్ లో ఉత్తమ నటిగా ఇల్లాలు చిత్రం ద్వారా కాంచనమాల ఎంపిక అయ్యారు. ఆ సమయంలో విడుదల ఐన మైరావణ కూడా అన్ని తరగతుల ప్రజాదరణను అందుకోలేక పోయింది. ఆ తర్వాత జెమినీ వాసన్ నిర్మాణ సారథ్యంలో బాలనాగమ్మ రూపుదిద్దుకుంది. ఆ సమయంలో వారి చిత్రాలలోనే నటిస్తానని కాంచన మాల అగ్రిమెంట్ వ్రాసి ఇచ్చారు. అదే ఆమె చేసిన పెద్ద తప్పిదం అయింది. ఆ సమయానికే పేరు పొందిన కాంచనమాల చెంతకు ఎన్నో మంచి ప్రాజెక్టులు రాసాగాయి. కానీ అగ్రిమెంట్ వలన ఆమె ఆ చిత్రాలలో నటించడానికి వీలు లేక పోయింది. ఆ సమయంలో వాసన్ కూడా కొత్త ప్రాజెక్టులు ఏమీ నిర్మించక పోవడంతో కాంచనమాల వాసన్ తో అగ్రిమెంట్ రద్దు చేయమని కోరగా ఆయన ససేమిరా అన్నారట. అది ఆమెకు ఊహించని షాక్. ఈ సమయం లోనే బాల నాగమ్మ విడుదల అయి అఖండ విజయం సాధించి, లాభాలను సంపాదించి పెట్టినా, వాసన్ కు ప్రయోజనం చేకూర్చాయి అంటారు. కాంచన మాల నటనకు ఈ సినిమా గీటురాయి అయినా, ఆ సినిమానే హీరోయిన్ గా ఆమెకు ఆఖరి చిత్రం అయినది. ఆంధ్రుల కళ్ళన్నీ తన వైపుకి తిప్పుకున్న ఆమె కళ్లు ఆ షాక్ తో శూన్యం లోనికి చూడటం మొదలు పెట్టాయి. హిందీ చిత్ర సీమలో అవకాశాలు కలిగినా, తెలుగు మీద మమకారంతో తిరస్కరించిన ఆమెకు అలా దురదృష్టం వెంటాడడం అత్యంత విచారకరం. ఆమె బ్రతికి ఉండగానే తెలుగు చలన చిత్ర ప్రపంచం ఓ మహానటిని కోల్పోయింది. ఆ స్థితిలో ఆమె ఉండగానే ఆమె భర్త గాలి వెంకయ్య క్షయ వ్యాధితో మరణించారు. దాంతో ఆమె మరి కోలుకునే ప్రయత్నం కూడా చేయలేదు. కాంచనమాల స్నేహితురాలు , నటి ఐన లక్ష్మీరాజ్యం 1963 లో నర్తనశాల చిత్రం నిర్మించారు. లక్ష్మీరాజ్యం బలవంతంతో ఓ చిన్న పాత్రను పోషించారు కాంచనమాల. 1940 లో ఆమె స్వంత ఊరు తెనాలిలో "శాంతి భవనం" అనే భవంతిని ఎంతో ఇష్టంతో నిర్మించుకున్న కాంచనమాల, ఆ ఇంట్లో నివసించినప్పుడు ఆ పక్కింటి వారికి కూడా ఆమె ఎవరో తెలియకుండా గడిపారు. నటనలో ఆమె నుండి స్ఫూర్తి పొందిన వారిలో జి.వరలక్ష్మి ఒకరు. తొలితరం నటీమణుల్లో ఒకరైన కృష్ణవేణి తీసిన దాంపత్యం సినిమా సమయంలో కాంచనమాల గారిపై ఉన్న అభిమానంతో ఆమె ఛాయా చిత్రాన్ని సెట్ లో ఉంచారు. వడ్ల బస్తా కేవలం 3 రూపాయలు ఉన్న రోజుల్లోనే ఆమె 10000/– పారితోషికంగా తీసుకునేవారు. 1975 లో ప్రపంచ తెలుగు మహాసభల్లో ఘన సత్కారం పొందినా ఈమె కళ్ళు శూన్యాన్ని తప్ప మరోవైపు చూడలేదట. మహా కవి శ్రీశ్రీ కూడా అభిమానంతో అందమైన కాంచనమాలపై 2 సార్లు కవితలల్లారు. కాంచన మాల 1981 జనవరి 24 న మద్రాసులో ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అసమాన ప్రతిభాశాలి వెంకటసుబ్బన్న - మార్చి 5... అవధాన పితామహ సి.వి. సుబ్బన్న వర్ధంతి




కడప వెంకటసుబ్బన్న. తెలుగు సాహిత్యంలో అసమాన ప్రతిభాశాలి. అవధాన ప్రక్రియలో అందె వేసిన చేయి. సహస్రాధిక అవధాన కార్యక్రమ నిర్వహణా దురందరులు. అవధానాలు మాత్రమే కాక, పురాణ ప్రబందాలను అలవోకగా రచించిన సవ్యసాచి. సి.వి. సుబ్బన్న.(కడప వెంకటసుబ్బన్న) అద్భుతమైన ప్రతిభ, అనన్యసామాన్యమైన వ్యుత్పత్తి, అసాధారణమైన అభ్యాసం కలిగిన శతావధాని. వర్ణన, సమస్యాపూరణం, వ్యస్తాక్షరి, న్యస్తాక్షరి, నిషేధాక్షరి మొదలైనా ఏ అంశాన్నయినా అలవోకగా నిర్వహించగలిగిన సరస్వతీ పుత్రుడు. వెయ్యికి పైగా అవధానాలు నిర్వహించిన ఘనత ఆయనదే. సుబ్బన్న కడప జిల్లా ప్రొద్దుటూరు లో నవంబరు 12 , 1929 న కడప రంగమ్మ చెన్నప్ప దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్య ప్రొద్దుటూరులో, సెకండరీ విద్య అనీబిసెంట్ మునిసిపల్ హైస్కూలులో, ఇంటర్మీడియట్ మదనపల్లి అనీబిసెంట్ కళాశాలలో జరిగింది. తరువాత డిగ్రీ, ఎం.ఎ. ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి పూర్తి చేశారు. కె.సుబ్బ రామప్ప పర్యవేక్షణలో అవధాన విద్య అనే విషయం పై పరిశోధనచేసి మైసూరు విశ్వవిద్యాలయం నుండి 1981లో పి.హెచ్.డి పట్టాను పొందారు. అదే సంవత్సరం అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వారు గౌరవ డాక్టరేటుతో ఆయనను సత్కరించారు. ఆంధ్ర దేశాన్ని అవధానాలతో ఉర్రూతలూపి, పద్యాన్ని పశువుల కాపరి దాకా తీసుకుపోయిన తిరుపతి వేంకటకవులు గ్రంథాలు రచించి తమ పద్యావిద్యా ప్రతిభను ప్రదర్శించినట్లే, సి.వి. సుబ్బన్న శతావధాని కూడా శతానేక అవధానాలు చేసి పదికి పైగా పద్య గ్రంథాలు రచించారు. సుబ్బన్న అనేక ప్రాంతాల్లో చేసిన అవధానాల్ని క్రోడీకరించి మూడు సంపుటాలుగా ముద్రించారు. ఆమూడింటిని కలిపి శతావధాన ప్రబంధం త్రిపుటిః పేరుతో బృహద్గ్రంథాన్ని ప్రచురించారు. శ్రీ భద్రాచల రామదాస ప్రబంధం, దివ్యలోచన ప్రబంధం (ధనుర్దాసు) భోజకువింద చరిత్రము, గోపవధూ కైవల్యము, త్రివేణి, దుర్భిక్షము, పల్లెపదాలు, కళావాహిని, తీయని త్రోవ, నైవేద్యము, అష్టావక్రుడు, పురందరదాసు, కుంతి, చెంచులక్ష్మి (నాటకం), శ్రీ వీరాంజనేయ శతకం, శ్రీకృష్ణశతకం, శ్రీ రామలింగేశ్వర శతకం, శ్రీ వేంకటేశ్వర శతకం అనే గ్రంథాల్ని రచించి ప్రచురించారు. అవధాన విద్యను గూర్చి ఆయన రచించిన సిద్ధాంత గ్రంథాన్ని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వారు ముద్రించారు. 'శ్రీ వ్యాసవిలాస ప్రబంధము'ను డా.ఎసి.వి.సుబ్బన్న 2004లో మొదటి ముద్రణగా వెలువరించారు. తర్వాతి సంవత్సరమే ఇది రెండవ ముద్రణకు నోచుకొని, అశేష ప్రజాదరణ పొందింది. అష్టాదశ పురాణాల రచనయే గాకుండా పంచమ వేదమైన భారత రచనకు నడుం బిగించి, మహావిష్ణువు అవతారమైన వ్యాసుని జీవిత పూర్వాపరాలను ప్రబంధంగా రచించడం ద్వారా ప్రతిభ తేట తెల్ల మయింది. శ్రీ వ్యాసవిలాస ప్రబంధము'లో ఏడుఆశ్వాసాలలో... ప్రతి ఆశ్వాసంలోనూ కథను సక్రమంగా నడిపించటానికి, ఆయా సన్నివేశాలకు ప్రత్యేక శీర్షికలుంచటం, అరుంధతీ పాణి గ్రహణంతో ప్రథమాశ్వాసం ప్రారంభమై, తర్వాత పరాశరజననం, వసురాజు, శుక్తిమతి మత్స్యగంధి వృత్తాంతాలు, సద్యోగర్భంలో వ్యాసుడు మత్స్యగంధికి పరాశరునికి జన్మించటం, శంతనుడు గాంగేయుని భీష్మ ప్రతిజ్ఞ తదితర అంశాలను మూలాన్ని విభేదించకుండా రాయడం అద్భుత రచనా సృష్టికి, సామర్థ్యానికి తార్కాణం. 2007లో ప్రథమ ముద్రణగా వెలువరించిన ప్రబంధం 'భద్రాచల శ్రీరామదాస ప్రబంధము', భద్రాచల రామదాసుగా ప్రసిద్ధి పొందిన కంచెర్ల గోపన్న జీవిత చరిత్రను, ఆనాటి చారిత్రక విశేషాలను పద్య ప్రబంధంగా సుబ్బన్న రచించారు. సంస్కృత సమాస భూయిష్టంగా పద్యాన్ని ఎలా కూర్చారో, తేట తెలుగు పదాలతో పద్యాన్ని అలాగే భావం, విషయం, పటుత్వం తగ్గకుండా జేయగలిగిన గొప్ప ప్రతిభాశాలి. సుబ్బన్న. మొదటి అవధానం ప్రొద్దుటూరులో 1950వ సంవత్సరంలో శివరాత్రి పర్వదినం నాడు చేశారు. చివరి అవధానం 1997లో ఫిబ్రవరి 25వ తేదీన పేరాలలో చేశారు. ఈ మధ్య కాలంలో అంటే 47 సంవత్సరాల పాటు వెయ్యికి పైగా అష్ట, శతావధానాలు చేశారు. భారత దేశమంతా తిరిగి అవధాన ప్రతిభా సామర్థ్యాన్ని నిరూపించు కొన్నారు. షష్టిపూర్తి తర్వాత కూడా ధారణ తగ్గకుండా అవధానాలు చేసి అందరి మెప్పులు పొందిన సరస్వతీ పుత్రులు సుబ్బన్న శతావధాని. సాహిత్య రంగంలో లబ్ధప్రతిష్ఠులైన దేవులపల్లి కృష్ణ శాస్త్రి, చెలమచెర్ల రంగాచార్యులు, కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి, డా.దివాకర్ల వేంకటావధాని, వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి , గంటిజోగి సోమయాజి, దీపాల పిచ్చయ్య శాస్త్రి, మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి , డా.పుట్టపర్తి నారాయణాచార్యులు, దాశరథి, డా.సి.నారాయణరెడ్డి, ఆరుద్ర వంటి వారెందరో పృచ్ఛకులుగా సుబ్బయ్య అవధానాలలో పృచ్ఛకులుగా వ్యవహరించిన గొప్పతనాన్ని మూట కట్టుకున్నారు. ప్రబంధ రచనలో, కవిత్వ పటుత్వ సంపదలో సాటిలేని మేటిగా పేరెన్నిక గన్నారు. పద్యానికి కాలం చెల్లిందను కొంటున్న కాలంలో, పెద్ద కావ్యాలకు ఆదరణ కరువు అవుతున్నది అనుకునే సమయంలో ఛందోబద్ధంగా అద్భుత ప్రబంధాల్ని రచించి సహృదయ పాఠకుల, శ్రోతల మన్ననలను పొందిన సి.వి.సుబ్బన్న శతావధాని ప్రజ్ఞ అనన్య సామాన్యం. అవధాన ప్రక్రియను తిరుపతి వేంకట కవులు కొప్పరపు సోదరుల తర్వాత విశేషంగా వ్యాప్తి చేసిన సాహితీవేత్తగా సుబ్బన్నకు పేరుంది. 1964లో గుర్రం జాషువా అధ్యక్షతన వీరికి భట్టిప్రోలులో కనకాభిషేకము, గజారోహణ మహోత్సవం జరిగింది. ఆయనకు పది పర్యాయాలు కనకాభిషేకం జరిగింది. 1965లో దీపాల పిచ్చయ్యశాస్త్రి అధ్యక్షతన బెజవాడ గోపాలరెడ్డిచే అవధాని ఎడమ కాలికి గండ పెండేరము తొడగ బడింది. 1981లో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం వారిచే గౌరవ డాక్టరేటు పొందారు. అనేక సన్మానాలు, సత్కారాలు పొందారు. విశాఖలోని లోక్ నాయక్ ఫౌండేషన్ అందించే విశిష్ట పురస్కారం, మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో మాజీ ముఖ్యమంత్రి రోశయ్య చేతుల మీదుగా పురస్కార గ్రహీతగా నిలిచారు. సరస్వతీ పుత్ర, అవధాని పితామహ బిరుదులు పొందారు. సుబ్బయ్య మార్చి 5, 2017న హైదరాబాదులో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాసను విడిచారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు


# సీఎస్ఆర్ నిధులు... ఆధునిక సౌకర్యాలు

జిన్నారం : సీఎస్ఆర్ నిధులు గ్రామాలకు వరప్రసాదంగా మారుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు మారేందుకు దోహదపడుతున్నాయి. జిన్నారం మండలం ఖాజీపల్లిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కోసం నిర్మిస్తున్న భవనం పూర్తయ్యే దశకు చేరింది. ఈ నెలాఖరులో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నారు. స్థానిక పారిశ్రామికవాడలోని కెమిటెక్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో దీని నిర్మాణం చేపట్టారు.

**సమస్యలు పునరావృతం కాకుండా..**

గతంలో శిథిల భవనం కావడంతో వాన కురిస్తే విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. ఆ రోజు సెలవు ఇవ్వాల్సిన దుస్థితి. మరోవైపు ఇరుకు గదులతో పాట్లు పడక తప్పలేదు. ఈ ఇబ్బందులు తీర్చేందుకు కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. ఐదు తరగతి గదులు, గ్రంథాలయం, కార్యాలయానికి వేర్వేరుగా గదులు నిర్మించారు. గతంలో ఒక గదిలో రెండు తరగతుల వారిని కూర్చోబెట్టగా.. ఇప్పుడిక ఆ సమస్య ఉ



ండదు. విశాలమైన భోజనశాల సైతం అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ప్రస్తుతం రంగులు వేస్తున్నారు. రూ.1.8 కోట్ల అంచనాతో నిర్మాణ పనులు చేపట్టారు.

**అంగన్‌వాడీ సైతం**

ఇదే సముదాయంలో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఎలాంటి అవస్థలు పడకుండా అన్ని వసతులు కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా సామగ్రి నిల్వ కోసం ప్రత్యేకంగా గదిని నిర్మించారు. చిన్నారులకు సకల సౌకర్యాలు కల్పించారు. వారిని ఆకట్టుకునేలా కార్పొరేట్ తరహాలో గోడలపై బొమ్మలు వేయించారు. అన్ని సదుపాయాలతో..: అన్ని వసతులతో భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గతంలో ఉన్న సమస్యలు చాలా వరకు పరిష్కారం అయినట్లే. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఒనగూరనున్నాయి. అనిల్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు

# సీడీపీ నిధులేవి?

ఆదిలాబాద్ : సాధారణంగా ఎమ్మెల్యేకు ఏటా నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం(సీడీపీ) కింద నిధులు విడుదలవుతాయి. గ్రామాల్లో ఇచ్చిన హామీలు.. కార్యకర్తలు సూచించిన పనులను మంజూరు చేసేందుకు ఎమ్మెల్యేలకు ఉన్న ఏకైక నిధి ఇదే. గెలుపొంది ఏడాది కావొస్తున్నా ఈ సీడీపీ నిధుల జాడ లేకపోవడంపై ఎమ్మెల్యేలు నిట్టూరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని విపక్ష ఎమ్మెల్యేల పరిస్థితి అయోమయంగా ఉందని వారి అనుచరులు వాదిస్తున్నారు. తమ వద్దకు వచ్చిన ప్రజల సమస్యలు పరిష్కరించలేకపోతున్నామని ఇటు ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు గత ప్రభుత్వ హయాంలో తొలుత సీడీపీ కింద రూ.3 కోట్లకు పెంచారు. చివరి సంవత్సరం 2022–23లో ఆ నిధి ఏకంగా రూ.5 కోట్లకు పెరిగింది. నిధులు పెంచినా అందులో ఒక నిబంధనను తీసుకొచ్చారు. రూ.3 కోట్లు ఎమ్మెల్యే కోటా కింద విడుదల చేసి మిగతా వారి ప్రమేయం లేకుండానే రూ.2 కోట్లు నేరుగా ప్రభుత్వమే విద్యాశాఖ కింద 'మన ఊరు – మన బడి'కి కేటాయించింది. దీంతో కోటా పెంచినా అంతగా ప్రయోజనం లేకుండా పోయిందని అప్పట్లో కొందరు ఎమ్మెల్యేలు ఆవేదన వెలిబుచ్చారు. ఆఖరుగా 23.05.2023న జిల్లాలకు సీడీపీ కింద రూ.3 కోట్ల చొప్పున ఒక్కో నియోజకవర్గానికి విడుదలయ్యాయి. ఇది ఇంతకు ముందున్న ఎమ్మెల్యేలు వినియోగించారు. కొత్తవారికి ఇప్పటి వరకు ఏమీ రాలేదు.

**పదిలో ఆరుగురు విపక్ష ఎమ్మెల్యేలే**

గత డిసెంబరు 7న ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. తాజాగా సంవత్సరం కావొస్తోంది. సీడీపీ నిధుల జాడలేక విపక్ష ఎమ్మెల్యేలు నిరాశలో ఉన్నారు. అధికార కాంగ్రెస్‌కు సంబంధించి మంచిర్యాల, ఖానాపూర్, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో ప్రేంసాగర్‌రావు, వెడ్మబొజ్జు, వివేక్, వినోద్‌లు గెలుపొందారు. బోథ్, ఆసిఫాబాద్‌లలో భారాసకు చెందిన అనిల్‌జాదవ్, కోవలక్ష్మి విజయం సాధించారు. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూర్ నియోజకవర్గాల్లో భాజపా నుంచి పాయల్‌శంకర్, మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్, పాల్వాయి హరీష్‌బాబులు గెలుపొందారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రం ఇతర నిధులతో పనులు మంజూరు చేయించుకుంటున్నా ఆరురుగు విపక్ష ఎమ్మెల్యేలు ఉండటంతో నిధుల కేటాయింపు సమస్యగా మారింది.

**నిరాశే..**

అసలే సీడీపీ నిధుల విడుదల లేక అయోమయంగా ఉన్న విపక్ష ఎమ్మెల్యేలకు ఇతర నిధుల్లోనూ ప్రాధాన్యం లభించకపోవడం ఇబ్బందికరంగా మారింది. నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున ప్రత్యేక అభివృద్ధి నిధి(స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) మంజూరుకాగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నచోట వారే పనులు ప్రతిపాదించారు. విపక్ష ఎమ్మెల్యేలు ఉన్నచోట మాత్రం వారు ప్రతిపాదించిన పనులను పక్కనపెట్టడం రాజకీయ చర్చకు తెరలేపింది. ఈ పనులను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదించాల్సి ఉండటంతో అన్ని చోట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జులు సూచించిన పనులకు అధిక ప్రాధాన్యమిచ్చినట్లు తెలుస్తోంది. గెలిచిన కొత్తలో ఉపాధిహామీ కింద రోడ్లు, మురుగుకాలువల కోసం నిధులు రాగా కాంగ్రెస్ కార్యకర్తలకు కొన్ని కేటాయించి మిగతా సగం విపక్ష ఎమ్మెల్యేలకు సైతం రూ.3.50 కోట్ల చొప్పున మంత్రి కేటాయించడంతో అంతా సంతృప్తిచెందారు.

అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దామని మంత్రి చెప్పడంతో ఇతర నిధుల కేటాయింపుల్లోనూ ప్రాధాన్యం ఉంటుందని విపక్ష ఎమ్మెల్యేలు భావించినా ఎస్‌డీఎఫ్ పనుల్లో నిరాశే మిగలడంతో కథ మొదటికొచ్చింది. దీంతోనే సీడీపీ నిధుల విడుదలకు పట్టుబడుతు న్నారు. కేవలం కల్యాణలక్ష్మి చెక్కులు, సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీకే పరిమితమవుతున్నామని విపక్ష ఎమ్మెల్యేలు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేక అన్ని నిధుల్లో ఎమ్మెల్యేల ప్రతిపాదనలే తీసుకోవాల్సి ఉన్నా తమ హక్కులను కాలరాస్తున్నారని విపక్ష ఎమ్మెల్యేల్లో ఒకరైన భారాసకు చెందిన బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పేర్కొనడం ఇక్కడ ప్రస్తావించాల్సిన అంశం.

# ఉపయోగం వెన్నంటే ఉపద్రవం!



గోదావరిఖని : కర్ణాటక రాష్ట్రంలోని హెూటళ్లలో ప్లాస్టిక్‌ను నిషేధించారు. ఇడ్లీల తయారీకి ప్లాస్టిక్ వినియోగిస్తున్నట్లు అక్కడి ప్రభుత్వం గుర్తించింది. 250 నమూనాలు సేకరించి పరీక్షలు జరిపారు. 52 నమూనాల్లో క్యాన్సర్ కారకాలను గుర్తించి హెూటళ్లలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను కేంద్ర ప్రభుత్వం గతంలోనే నిషేధించింది. 120 మైక్రాన్‌ల కన్నా ఎక్కువ మందం ఉన్న వాటినే అనుమతిస్తున్నారు. ఈ నిబంధనలు ఉమ్మడి జిల్లాలో అమలుకు నోచుకోవడం లేదు. ప్లాస్టిక్ సంచుల వినియోగం అధికంగా ఉంది. మార్కెట్‌కు వెళ్తే వెంట వస్త్ర సంచులు తీసుకెళ్లాలన్న ఆలోచన జనంలో ఉండటం లేదు. ప్లాస్టిక్ వినియోగం ఇటు ఆరోగ్యానికి అటు పర్యావరణానికి పెనుముప్పుగా మారుతుందన్న కనీస స్పృహ కరవైంది. అధికారులు అప్పుడప్పుడు దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తూ ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్నా.. వినియోగిస్తున్నా జరిమానాలు విధిస్తున్నారు. అయినా పూర్తి స్థాయి నియంత్రణ సాధ్యపడటం లేదు. సాధారణ వస్తువులతోపాటు ఇటీవల కాలంలో వేడి పదార్థాలను కూడా ప్లాస్టిక్ సంచుల్లోనే ప్యాకింగ్ చేసి తీసుకెళ్తున్నారు. దీంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు చెబుతున్నా జనం పెడచెవిన పెడుతున్నారు. ఎటైనా వెళ్లినప్పుడు ప్రత్యేకంగా సంచి తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదన్న ఒక్క కారణంతో ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని రెండు నగరపాలికలు, 14 పురపాలక సంఘాల పరిధిలో ప్లాస్టిక్ నియంత్రణకు అడపాదడపా తనిఖీలు నిర్వహిస్తున్నారు. కాని నియంత్రణకు పూర్తి స్థాయి చర్యలు తీసుకోవడం లేదు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాల్సిన అధికారులు సిబ్బంది కొరత కారణంగా మొక్కుబడిగా తనిఖీలు చేపడుతున్నారు. నగర, పురపాలక సంఘాలతోపాటు గ్రామ పంచాయతీల్లో కూడా ప్లాస్టిక్ నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలి. కాని దీనిపై ప్రత్యేక పర్యవేక్షణకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో నియంత్రణ సాధ్యమవడం లేదు.

**పర్యావరణానికి విపత్తు**

ప్లాస్టిక్ కవర్లలో వేడి ఆహార పదార్థాలు తీసుకెళ్లడం వల్ల రసాయనిక చర్య జరిగి హానికరమైన కణాలు తయారవుతాయి.

మైక్రో ప్లాస్టిక్‌లోని రసాయనాలు శరీరంలోని కణాలను దెబ్బతీస్తాయి. హార్మోన్ల అసమతుల్యతకు కారణమవుతాయి.

మురుగు కాలువల్లో ప్రవాహానికి ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుపడి వర్షాలు పడినప్పుడు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతాయి

చెత్తలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తిని పశువులు, వన్య ప్రాణుల ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్లాస్టిక్ వ్యర్థాలు కలిసిపోవడం వల్ల భూసారం తగ్గిపోతోంది. వర్షపు నీరు భూగర్భంలోకి ఇంకకుండా అడ్డుపడుతుంది. ఫలితంగా భూగర్భ జలాలు పడిపోతాయి. ఇలా చేసి చూద్దాం..ప్రతి ఒక్కరూ వస్తువులు, కూరగాయల కొనుగోలుకు వెళ్లే సమయంలో వస్త్ర సంచులు తీసుకెళ్లాలి. ఆహార పదార్థాలను తెచ్చుకోవడానికి స్టీల్ డబ్బాలు ఉపయోగించాలి. ఉమ్మడి జిల్లాలో ఏటా సగటున 750 మంది మహిళల్లో, 400 మంది పురుషుల్లో క్యాన్సర్ లక్షణాలను గుర్తిస్తున్నారు.

క్యాన్సర్ ముప్పు ప్లాస్టిక్ వల్ల క్యాన్సర్ ముప్పు పొంచి ఉంటుంది. ప్లాస్టిక్ తయారు చేసేందుకు వినియోగించే రసాయనాలు మనం తెచ్చుకునే ఆహార పదార్థాల్లోకి చేరతాయి. వాటిని భుజించడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. జీవక్రియ దెబ్బతింటుంది. ప్లాస్టిక్ వినియోగాన్ని ఎంత తగ్గించగలిగితే అంత మేలు.–డా.అశోక్‌కుమార్, సీనియర్ ఫిజిషియన్, గోదావరిఖని

# నిధులు వస్తేనే జాతర నిండుగా!



ధర్మపురి: ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలపై నిధుల ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ నెల 10 నుంచి 13 రోజుల పాటు జరిగే ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భారీసంఖ్యలో భక్తులు తరలివస్తారు. కనీస వసతులు లేకపోవడంతో వారు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. రెండేళ్ల నుంచి ఉత్సవాలకు ప్రత్యేక నిధులు కేటాయించడం లేదు. భారాస ప్రభుత్వం హయాంలో నాలుగేళ్ల కిందట సుమారు రూ.50 లక్షల నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడినా విడుదల మాత్రం కాలేదు. వసతుల కల్పనపై సమన్వయ సమావేశంలో చర్చిస్తున్నా.. నిధులు కేటాయించడం లేదు.

**పెండింగ్‌లో రూ.15 లక్షలు**

రెండేళ్లుగా దేవస్థానంలో జాతర ఏర్పాట్ల బిల్లులను అధికారులు చెల్లించడం లేదని గుత్తేదార్లు, అదనపు కార్మికులు వాపోతున్నారు. అదనపు పారిశుద్ధ్య కార్మికులకు, బ్లీచింగ్ పౌడర్, విద్యుత్తు గుత్తేదార్లకు ఇంతవరకు మున్సిపల్ నుంచి ఒక్క రూపాయి రాలేదు. సుమారుగా రూ.15 లక్షల వరకు నిధులు రావాల్సి ఉంది. బకాయిలు చెల్లించాలంటూ బాధితులు పురపాలక కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. బకాయిలు చెల్లిస్తేనే జాతరకు ఏర్పాట్లు చేస్తామని గుత్తేదార్లు అంటున్నారు. అలాగే అదనపు కార్మికులను సుమారుగా 100 మందిని తాత్కాలిక పద్ధతిలో తీసుకుంటున్నారు.

గోదావరి ఎగువ ప్రాంతంలో సత్యవతి, బ్రహ్మగుండాల వద్ద లోతు ఉండటంతో భక్తులు స్నానానికి దిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఇక్కడ ప్రమాదం తెలిపేలా బోర్డులు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలి. సంతోషీమాతా, మంగళిగడ్డ ప్రాంతంలో దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేయాలి. దేవస్థానంలో తాగునీటికి కటకట ఏర్పడుతోంది. క్యూలైన్ల వద్ద తాగునీటి వసతులు కల్పించాల్సి ఉంది. పుర అధికారులు ప్రతి వాహనానికి రూ.50 వసూలు చేస్తున్నారే తప్ప పార్కింగ్ స్థలంపై దృష్టి సారించడం లేదు. మరుగుదొడ్ల నిర్మాణం రెండు నెలలుగా నత్తనడకన సాగుతున్నాయి. రాయపట్నం నుంచి కరీంనగర్‌కు ప్రత్యేక బస్సులు నడిపించాలి. ధర్మపురి పట్టణంలో అంతర్గత రహదార్లు అధ్వానంగా మారాయి.

# అతివలకు అండ

మెదక్: పని ప్రదేశంలో వేధింపులకు గురయ్యే అతివలకు 'మహిళా సాధికారత కేంద్రం' బాసటగా నిలుస్తోంది. ప్రభుత్వ శాఖల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీ(ఐసీసీ)ల ఏర్పాటుకు కసరత్తు మొదలైంది. పలు ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ రంగంలో కమిటీలు ఏర్పాటవుతున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు ఆయా శాఖల్లో ఐసీసీలు ఏర్పాటు కాగా, మిగిలిన వాటిల్లో పూర్తిచేసేందుకు కసరత్తు చేస్తున్నారు. జిల్లా స్థాయిలో కమిటీని ఏర్పాటు చేయనున్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం–2013 ప్రకారం శారీరక సంబంధం, లైంగిక ప్రయోజనాలను కాంక్షిస్తూ అభ్యర్థించడం, లైంగికపరమైన వ్యాఖ్యలు, అశ్లీల చిత్రాలను చూపుతూ అసభ్య ప్రవర్తనకు పాల్పడటం నేరంగా పరిగణిస్తారు.

**జిల్లా స్థాయిలో ఎల్‌సీసీ...**

జిల్లా స్థాయిలో స్థానిక ఫిర్యాదుల కమిటీ(ఎస్‌సీసీ) పని చేయనుంది. ఇందులో కనీసం ఐదుగురు ఉంటారు. సభ్యుల్లో జిల్లా అధికారిణులు, న్యాయవాది, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, మహిళా ఉద్యోగులు భాగస్వాములు కానున్నారు. ఇది వరకు కమిటీ ఉండగా, ప్రతి మూడేళ్లకు ఒకసారి మార్పు చేయాల్సి ఉండడంతో కొత్త కమిటీ ఏర్పాటుకానుంది.

**ఫిర్యాదు ఎలా అంటే...**

లైంగికపరమైన వేధింపులకు గురైతే ఐసీసీకి ఫిర్యాదు చేస్తే గోప్యంగా విచారణ చేస్తారు. పరిష్కారం కాకుంటే ఎల్‌సీసీ వరకు వెళ్లొచ్చు. సంఘటన జరిగిన మూడు నెలల్లోపు ఫిర్యాదు చేయొచ్చు. మరికొన్ని సందర్భాల్లో అదనపు కాల పరిమితిని పరిగణనలోకి తీసుకుంటారు. విచారణ పూర్తయిన తరువాత నివేదికను ఇరుపక్షాలకు చేరవేయాలి.

**నోడల్ అధికారులుగా తహసీల్దార్లు...**

వేధింపులకు సంబంధించి మహిళలు మండల స్థాయిలో తహసీల్దార్ల దృష్టికి తీసుకెళ్లవచ్చు. తహసీల్దార్లను నోడల్ అధికారులుగా నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల జీవో విడుదల చేసింది. కేసులు వచ్చినా మహిళా



సాధికారత కేంద్రం దృష్టికి తీసుకురావాలి.

**అన్ని సంస్థల్లోనూ అమలు**

ప్రైవేటు, ప్రభుత్వ, ఇతర సంస్థలు సహా అన్ని ప్రదేశాల్లో 10 లేదా అంతకుమించి ఉద్యోగులున్న చోట కమిటీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. జిల్లాలో 12 ప్రభుత్వ శాఖల్లో, 31 కంపెనీలు, ఆరు షాపింగ్ మాల్స్‌లలో ఐసీసీ కమిటీలు ఏర్పాటయ్యాయి. సీనియర్ ఉద్యోగి ప్రిసైడింగ్ అధికారిగా, మిగిలిన వారు సభ్యులుగా ఉంటారు. అవసరం మేర స్వచ్ఛంద సంస్థలు, నాయకత్వ లక్షణాలు కలిగిన మహిళలను తీసుకుంటారు. వీరు ప్రతి ఏడాది నివేదికను మహిళా సాధికారత కేంద్రంలో అందజేయాలి.

**ఉపేక్షించవద్దు**

ప్రస్తుతం ప్రభుత్వ శాఖల్లో ఐసీసీల ఏర్పాటుపై దృష్టి సారించాం. రానున్న రోజుల్లో పని ప్రదేశాల్లో ఏర్పాటు చేయిస్తాం. జిల్లా స్థాయిలో ఎల్‌సీసీ ఏర్పాటు చేస్తాం. వేధింపులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దు. సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్లు 181, 100కు ఫోన్ చేయాలి. సంతోషి, జిల్లా సమన్వయకర్త, మహిళా సాధికారత కేంద్రం

# సంతోషాలను 'ఏరు'కో..!

భద్రాచలం : తెలుగు రాష్ట్రాల్లో పర్యాటక ప్రాంతాలంటే సాధారణంగా ఏపీలోని కోనసీమ అందాలు.. మారేడుమిల్లి పాపికొండలు.. బొర్రా గుహల పేర్లు వినిపిస్తుంటాయి. అదేస్థాయిలో అనుభూతులను పంచేందుకు 'ఏరు' ఉత్సవం వేదికవనుంది. నీటివనరులను ఆస్వాదించేందుకు భద్రాచలం మన్యం కేంద్రంగా సాగే ఈ యాత్ర పూర్తిగా ప్రకృతితో మమేకం చేస్తుంది. దైనందిన జీవితంలో అలసినవారు సంతోషాలను ఏరుకునే యాత్ర ఇది. తొలి విడతగా ఏరు ఉత్సవాన్ని గురువారం ప్రారంభించి శనివారం వరకు కొనసాగిస్తారు. ఆ తర్వాత ప్రతి మూడు రోజులకు ఒక ప్యాకేజీ కింద పర్యాటకులను ఆహ్వానిస్తారు. స్నానఘట్టాల వద్ద ఆహార పదార్థాలు, హస్త కళారూపాలను స్టాళ్లలో ఉంచారు. కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్ చొరవతో 'రివర్ ఫెస్టివల్'కు రూపకల్పన జరగటంతో భద్రాద్రి జిల్లా పర్యాటకానికి మహర్దశ పట్టనుంది.

**మూడు రోజుల యాత్ర ఇలా..**

1. గురువారం తెల్లవారుజామున 3 గంటలకు భద్రాచలంలోని గోదావరి ఒడ్డున ఏర్పాటుచేసిన క్యాంప్ కుటీరాలకు పర్యాటకులు చేరుకుంటారు. వీటిలో ఇద్దరు, ముగ్గురు, నలుగురు చొప్పున ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. టీ లేదా కాఫీ, బిస్కెట్లు ఇస్తారు. బోట్ షికారు చేయవచ్చు. సాయంత్రం 5 గంటలకు ఘాట్‌పై సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. రాత్రి 8 గంటలకు క్యాంప్



కుటీరాలకు చేరుకుని క్యాంప్ ఫైర్‌ను ఆస్వాదించవచ్చు. అక్కడే రాత్రి భోజనం ఉంటుంది.

2. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు ఉత్తర ద్వార దర్శనం చేసుకోవచ్చు. 7 గంటలకు అల్పాహారం, 8 గంటలకు కిన్నెరసాని బోట్ షికారు, మధ్యాహ్నం 12కి భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని మ్యూజియాన్ని సందర్శిస్తారు. ఇక్కడ సృష్టించిన ఆదివాసీ పల్లెను చూడవచ్చు. అక్కడే మధ్యాహ్న భోజనం చేయాలి. సాయంత్రం 4 గంటలకు బొజ్జిగుప్ప ఆదివాసీ పల్లెను సందర్శిస్తారు. అక్కడే రాత్రి భోజనం ఉంటుంది. అక్కడి వాగులో బోటింగ్ చేయవచ్చు. ఆదివాసీ సంప్రదాయ నృత్యాలను చూడవచ్చు. రాత్రి 8కి తిరిగి క్యాంప్ కుటీరాలకు చేరుకుని బస చేస్తారు.

3. శనివారం ఉదయం 8 గంటలకు అల్పాహారం చేసి చంద్రుగొండ మండలం కనిగిరిగుట్ట టెక్కింగ్‌కు చేరుకోవాలి. అక్కడ టీ, స్నాక్స్‌తో పాటు మధ్యాహ్నం భోజనం ఉంటుంది. గుట్ట పైనుంచి ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు. మధ్నాహ్నం ఒంటి గంటకు కొత్తగూడెం చేరుకున్నాక యాత్ర పూర్తవుతుంది. మూడు రోజుల ప్యాకేజీలో టికెట్ ధర పెద్దలకు ఒక్కొక్కరికి రూ.6వేలు, 12ఏళ్లలోపు పిల్లలకు రూ. 4వేలు నిర్ణయించారు.

మాది ములకలపల్లి మండలం. మాలాంటి పది మంది మహిళలకు ఆవులు, గేదెలు ఉండటంతో స్వచ్ఛమైన నెయ్యి విక్రయిస్తున్నాం. దీనికి అధికారుల నుంచి ధ్రువపత్రం ఉంది. రాములోరి క్షేత్రంలో ఏరు ఉత్సవాల సందర్భంగా స్టాల్ ఏర్పాటుకు అవకాశం లభించింది. ఆదరణ బాగుండటంతో ఈ రంగంలో రాణిస్తామనే నమ్మకం కలిగింది. టి.మంజుల, జి.లత

భద్రాచలం ఐటీడీఏ సహకారంతో రాగి, జొన్న, కొర్రలతో బిస్కెట్లు తయారు చేస్తుంటాం. ఏరు ఉత్సవం సందర్భంగా స్టాల్‌లో వీటిని ఉంచుతున్నాం. పర్యాటకులు తిని మెచ్చుకుంటున్నారు. పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశముంది. మాకు ఉపాధి లభిస్తుందనే భరోసా కలిగింది.

టి.లలిత, వి.వెంకటలక్ష్మి

భద్రాచలంలో బ్యూటీషియన్ శిక్షణ తీసుకున్నాం. తక్కువ పెట్టుబడితో మేం ఏర్పాటుచేసిన మెహందీ స్టాల్‌కు ఆదరణ లభిస్తోంది. ముక్కోటి, ఏరు ఉత్సవాల కోసం వచ్చేవారు మెహందీకి ప్రాధాన్యమిస్తుండటంతో స్వయం ఉపాధిపై మాకు నమ్మకం ఏర్పడింది. ఈ ప్రాంత యువతకు ఇదో చక్కని అవకాశం.

ఎం.రేణుక, కె.పావని, ఎస్.దుర్గ

# గోదావరిలోకి దారి వేసి..ఇసుకను కాజేసి

కడెం: కడెం మండలం లింగాపూర్ గోదావరి రేవు నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఇందుకు గ్రామ కమిటీకి కొంత రుసుము చెల్లించి ఆమోదం పొందినట్లు సమాచారం. అదే అదనుగా ఇలా నేరుగా దారి వేసుకుని గోదావరి నుంచి ఇసుకను తెచ్చి ఒడ్డున కుప్పలుగా పోస్తున్నారు. ఇక్కడి నుంచి వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కడెం మండలంలోని గోదావరి రేవుల వెంట ఇలా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇలా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీని కోల్పోయే అవకాశముంది. ఇలాంటి



అక్రమ దందాపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కాగా ఇసుక రవాణాకు ఎవరికీ అనుమతులు లేవని, తమ సిబ్బందిని అప్రమత్తం చేశామని, డంపులు ఉంటే సీజ్ చేస్తామని, తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుజాత పేర్కొన్నారు. ట్రాక్టర్‌లో మట్టిని గోదావరి నదిలోకి తీసుకెళుతున్నారు చూశారా.. గ్రామంలో అయితే ఏదో దారి వేసేందుకో, ఇంటి అవసరాలకో అనుకోవచ్చు. కానీ ఏకంగా గోదావరిలోకి మట్టి ట్రాక్టర్లను ఎందుకు తీసుకెళుతున్నారంటే గోదావరిలోనూ దారి నిర్మించేందుకే. అవును గోదావరి మధ్యలో ఇసుక తెట్టెలుగా ఉంది. అక్కడి వరకు ట్రాక్టర్లు వెళ్లాలంటే మొదట దారి వేసుకోవాలి. ఇందుకు ఎవరి అనుమతీ అక్కర లేదు. దర్జాగా మట్టి తరలించి గోదావరిలో దారి ఏర్పాటు చేసుకుని ఇసుకను అక్రమంగా తరలించడమే వీరి ఉద్దేశం.

చురకలు



# ఏటీఎంలకు రక్షణేదీ?

కామారెడ్డి : ఉమ్మడి జిల్లాలో చోరులు రెచ్చిపోతున్నారు. ఏకంగా ఏటీఎంలలో దొంగతనాలకు పాల్పడుతున్నారు. తాజాగా పిట్లం మండలంలో చోటుచేసుకున్న ఘటన కలకలం సృష్టించింది. అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని తాజా ఉదంతం చాటుతోంది.

**వ్యవస్థ లోపంతోనే..** వ్యవస్థ లోపంతోనే వరుస ఏటీఎం చోరీలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. నేరుగా పోలీసులను అప్రమత్తం చేసే అలారం వ్యవస్థ లేకపోవడం, పోలీసులకు సమాచారం చేరవేయడంలో బ్యాంకు అధికారులు సమయం వృథా చేస్తున్నారు. సెక్యూరిటీ గార్డులను నియమించకపోవడం, పెట్రోలింగ్ లేమి, ఏటీఎంల



సమీపంలో సీసీ కెమెరాలు, పర్యవేక్షణ లేకపోవడం తదితర అంశాలు వ్యవస్థ లోపాలను తేటతెల్లం చేస్తున్నాయి.

**బాధ్యత ఎవరిది..**

ఏటీఎంల రక్షణ బాధ్యతను కేవలం సాంకేతికతకే వదిలేస్తున్నారు. వాటిని కాపాడే పనిని ఎవరికో ఒక్కరికి అప్పగించాల్సిన ఆవశ్యకతను గుర్తించాలి. దీనికోసం పోలీసులను వినియోగిస్తే మేలంటున్నారు. లేదంటే కనీసం బ్యాంకు అధికారులైన సెక్యూరిటీ గార్డులను నియమించాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

**తాజా ఘటనలు**

కామారెడ్డి జిల్లాలో.. ఇటీవల బిచ్కుంద మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎంను నలుగురు దుండగులు గ్యాస్ కట్టర్‌తో తొలగించి డబ్బాతో సహా ఎత్తుకెళ్లారు. చోరీకి వినియోగించిన వాహనాన్ని ఒక్కరోజు ముందే నిజామాబాద్ జిల్లా రెంజల్‌లో చోరీ చేసి తెచ్చారు. ఏటీఎం డబ్బాను పగులగొట్టి రూ.3లక్షల నగదు దొంగిలించుకెళ్లారు.

భిక్కనూరు మండలంలోని జంగంపల్లిలోని ప్రస్తుత యూనియన్ బ్యాంకు ఏటీఎంలో చోరీకి విఫలయత్నం చేశారు. జిల్లా కేంద్రంలోని మరో రెండు చోట్ల సైతం ఏటీఎం చోరీలకు విఫలయత్నం జరిగింది.

తాజాగా పిట్లం మండల కేంద్రంలోని ఏటీఎంను దుండగులు గ్యాస్ కట్టర్‌తో తొలగించి రూ.17,79,100 నగదును దోచుకెళ్లారని పోలీసులు చెబుతున్నారు.

**నిజామాబాద్ జిల్లాలో..** రుద్రూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం పగులగొట్టి రూ.25 లక్షలను దుండగులు ఎత్తుకెళ్లారు. జిల్లాకేంద్రంలో ఏటీఎం చోరీకి ప్రయత్నించగా అలారం మోగడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అంతలోనే దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. జిల్లా కేంద్రంలోని గోశాల రోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎంను, అర్సపల్లిలో, నవీపేటలో ఏటీఎంలను ధ్వంసం చేసి నగదును దోచుకెళ్లే ప్రయత్నం చేయగా అలారాలు మోగడంతో దొంగలు అక్కడి నుంచి ఉడాయించారు.

# నేతలు చెప్పిన చోటే సర్వే

నిజామాబాద్:: జిల్లాలో రెవెన్యూ యంత్రాంగం పనితీరు విమర్శలకు తావిస్తోంది. ముఖ్యంగా భూముల సర్వే విషయంలో ఇది కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఆక్రమణలు, కబ్జాలపై వస్తున్న ఫిర్యాదులపై స్పందించే తీరు ఇందుకు కారణమవుతోంది. రాజకీయ పలుకుబడి ఉన్నవారు చెప్పిన విషయాలకు ప్రాధాన్యం ఇవ్వటంలో చూపే శ్రద్ధ.. మిగతా సందర్భాల్లో ఉండటం లేదు. జిల్లాలో పలు సంఘటనల్లో చోటుచేసుకున్న విషయాలు ఇందుకు నిదర్శనం. ఉన్నతాధికారులకు తెలిసినా.. పరిస్థితిలో మార్పు కనిపించకపోవటం సామాన్యులకు బాధ కలిగిస్తోంది. మాక్లూర్ మండలంలో గ్రామ అవసరాలకు కేటాయించిన భూమి ప్రైవేటు వ్యక్తుల భూమిలో కలిసిందని ఇటీవల అధికారులకు ఫిర్యాదు అందింది. సాధారణంగా ఈ వివాదంలో రెవెన్యూ వారు స్పందించి చర్య తీసుకోవాలంటే నెలలు గడిచేవి. కానీ ఒక నెలలోనే నాలుగుసార్లు ఉద్యోగులు మోకా మీదకు వెళ్లారు. సర్వే చేసి మ్యాప్‌ల ఆధారంగా హద్దుల నిర్ధారణ చేసి నివేదిక సిద్ధం చేశారు. ఇంత వేగంగా స్పందించడం ఆశ్చర్యానికి గురిచేసింది. కారణం ఏంటని ఆరాతీస్తే అసలు విషయం తెలిసింది. అధికార పార్టీకి చెందిన ఓ నేత చెప్పటంతో అధికారులు ఇంత వేగంగా కదిలారు.

నిజామాబాద్ గ్రామీణ మండలంలోని ఓ గ్రామంలో ఇటీవల భూవివాదం తెరపైకి వచ్చింది. ఇది ఇద్దరి వ్యక్తుల ఆస్తి తగాదాతో ముడిపడి ఉంది. ఇందులో ఒకవర్గం వారు ఓ రాజకీయ పార్టీ నాయకుడిని కలిశారు. తమకు అన్యాయం జరిగిందని.. అవతలి వ్యక్తులు ఇతర పార్టీకి చెందిన వారు అని చెప్పారు. దీంతో సదరు నాయకుడు వారికి సహాయం చేయటానికి ఆసక్తి చూపించారు. ఇంకేముంది రెవెన్యూ యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగి ఆగమేఘాల మీద సర్వే చేపట్టింది. బోధన్ శివారులోని ఓ ప్రాంతంలో భూమి లెక్కలు తేల్చేందుకు రెవెన్యూ అధికారులు ఇటీవల ఆగమేఘాల మీద సర్వే చేశారు. ఎందుకు చేస్తున్నది కూడా బయటకు చెప్పలేదు. దీంతో చుట్టుపక్కల రైతులు ఆందోళన చెందారు. ఒకచోట అయితే ఓ రైతు పొలంలోకి వచ్చి కొలతలు వేయడంతో ఆయన భయపడ్డారు. ఇది కూడా ఓ పెద్దాయన చెప్పడంతో చేశారని తర్వాత తెలిసింది.

**ప్రాధాన్యం మరిచి.. పనులు**

నేతలు చెప్పిన విషయాలకు స్పందించొద్దని కాదు.. ఇతర సమస్యలకూ ప్రాధాన్యం ఇవ్వాలి. జిల్లాలో దేవాదాయశాఖ భూములు ఆక్రమణకు గురయ్యాయి. బడారాంమఠ్ భూములను ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేశారు. వీటిని దేవాదాయశాఖ రికార్డుల ఆధారంగా క్షేత్రస్థాయిలో గుర్తించి హద్దులు నిర్ణయించాల్సి ఉంది. ఇందుకోసం సర్వే విభాగం సహాయం కోసం దేవాదాయశాఖ పలుమార్లు విన్నవించింది. కానీ రెవెన్యూ విభాగం నుంచి ఆశించిన స్పందన లేదు. ఎన్నిసార్లు చెప్పినా రెవెన్యూ అధికారులు కదలటం లేదు. ఏడాది కాలంగా ఈ సమస్య దేవాదాయ, రెవెన్యూ శాఖల మధ్య నలుగుతోంది. విమర్శలకు తావిస్తున్న ఈ పరిస్థితిలో మార్పు రావాలని జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు.

# పర్యవేక్షణ కొరవడి.. నాణ్యత తడబడి



సిరిసిల్ల: కోనరావుపేట మండలం బావుసాయిపేట బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ రహదారి ఇది. 2022లో 200 మీటర్ల రహదారిని రూ.10 లక్షలతో నిర్మించారు. ఏడాది గడవకముందే రహదారి మొత్తం ఇలా బీటలువారింది. నాణ్యతా ప్రమాణాలు పాటించి ఒక సారి సీసీ రహదారి నిర్మించాక 20 సంవత్సరాలు మన్నికగా ఉండాలి. ఇక్కడ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీలో రూ.47.59 కోట్ల నిధులతో 693 సీసీ రహదారులు మంజూరయ్యాయి. 2023-24లో 2451 రహదారులు మంజూరు కాగా అందులో రూ.87.01 కోట్లతో 1915 పూర్తిచేశారు. ఏటా ఆర్థిక సంవత్సరం ముగిసే రెండు నెలల్లో మండలాల వారీగా గుత్తేదారులకు పనులు అప్పగిస్తున్నారు. దీంతో ఇసుక, మెటీరియల్ సమకూర్చుకునేందుకే సమయం పడుతోంది.

**గుత్తేదారుల ఇష్టారాజ్యం**

జిల్లాలో మానేరు, మూలవాగుల్లో గుర్తించిన ఇసుక క్వారీల నుంచి ప్రభుత్వ అభివృద్ధి పనులకు అనుమతించారు.

ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ క్వారీని గంభీరావుపేట, వీర్నపల్లి మండలాలకు కేటాయించారు. అక్కడి గ్రామస్థులు వేరే మండలాల ట్రాక్టర్లను క్వారీలోకి అనుమతించడం లేదు. అలాగే మూలవాగులో కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి మండలాలకు కేటాయించిన క్వారీల్లోనూ అదే పరిస్థితి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికీ 23 చోట్ల మాత్రమే పనులు ప్రారంభమయ్యాయి. పనులు దక్కించుకున్న గుత్తేదారులు తొలుత నత్తలా పనులు మొదలు పెట్టి.. గడువు ముగుసే సమయంలో హడావుడి చేస్తున్నారు. దీనికితోడు వేసవి కావడంతో క్యూరింగ్‌పైనా దృష్టి పెట్టడంలేదనే ఆరోపణలు ఉన్నాయి.

కొన్ని మండలాల్లో సిమెంటు డస్ట్, (కంకర పొడి, మిశ్రమాన్ని) సైతం వాడుతున్నట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు ఉన్నాయి.

ఎల్లారెడ్డిపేట, వేములవాడ సబ్ డివిజన్‌లలో తొమ్మిది మంది ఏఈలకు నలుగురు మాత్రమే ఉన్నారు.

సిరిసిల్ల డీఈకి ఈఈ అదనపు బాధ్యతలు ఉండగా వేములవాడ డీఈ బదిలీపై వెళ్లారు. సిబ్బంది కొరతతో పనులపై పర్యవేక్షణ కొరవడి గుత్తేదారులు వేసిందే రహదారి అన్నట్లుగా మారింది.

**పర్యవేక్షించేలా ఆదేశాలు**

పనుల ప్రారంభానికి చాలాచోట్ల ఇసుక రవాణా సమస్య ఉందని చెబుతున్నారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్నాం. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిన మరుసటి రోజునుంచే కట్టలు కట్టి నీటిని పట్టించాలి. దీంతో రెండు రోజుల్లో నిర్మాణం పటిష్ఠంగా మారుతుంది. పనులు జరుగుతున్న ప్రాంతాలను ఏఈ, డీఈలు వెళ్లి పర్యవేక్షించేలా ఆదేశాలిస్తున్నాం.

– సుదర్శన్, ఈఈ, పంచాయతీరాజ్‌శాఖ

# పొలం బాటల ప్రగతి అంతంతే!



పెద్దపల్లి : పల్లెల్లో వ్యవసాయ క్షేత్రాల వద్దకు వెళ్లడానికి దారులు సరిగ్గా లేక ఎరువులు, విత్తన బస్తాలు తరలించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వారి కష్టాలు తీర్చేందుకు మూడు నెలల కిందట ఉపాధిహామీలో చేపట్టిన 'పొలం బాట'ల నిర్మాణానికి గ్రహణం వీడటం లేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో 30 రోజుల సమయమే ఉండగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. యాసంగి పంటల సాగు పనులు రహదారి నిర్మాణానికి ఆటంకాలు ఎదురవుతున్నాయంటూ అధికారులు సాకులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పనులు చేసేందుకు అవకాశాలున్నా శ్రద్ధ చూపడం లేదన్న ఆరోపణలున్నాయి.

**రూ.1.70 కోట్ల కేటాయింపు**

పొలాల వద్దకు వెళ్లే దారులు ఇరుగ్గా ఉండటంతో బస్తాలు మోసుకొని రాకపోకలు సాగించే సమయంలో రైతులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎరువులు తరలించేందుకు అదనపు కూలీల ఖర్చు భరించాల్సి వస్తోంది. ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు 'పొలం బాట'లో జిల్లావ్యాప్తంగా రూ.1.70 కోట్లతో 63 పనులను ప్రతిపాదించగా 50 చోట్ల నిధులు కేటాయించారు. కాలి బాటలను ఫార్మేషన్ రోడ్లుగా మార్చడం, మొరం చల్లే పనులకు ప్రతిపాదనలు రూపొందించారు. ప్రతి నియోజకవర్గానికి 20 కి.మీ. చొప్పున రహదారులు నిర్మించాలని మొదట భావించినా జిల్లాలో అనువైన ప్రాంతాలను గుర్తించి నిధులు మంజూరు చేశారు.

**హద్దులు చూపక జాప్యం**

పొలాలకు వెళ్లే అధికారిక దారులను పక్కనున్న రైతులు సాగు చేస్తుండటంతో ఆక్రమణకు గురవుతున్నాయి.

ప్రస్తుత దారులు ఇరుగ్గా ఉండటంతో రాకపోకలకు రైతులు అవస్థలు పడుతున్నారు. రహదారి స్థలాలను పొలాలుగా మార్చడంతో పనులు చేయడం కష్ట సాధ్యమవుతోంది. రెవెన్యూ అధికారులు హద్దులు చూపకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతోంది.

పూర్వం నుంచి ఉన్న దారులే అయినా పలు చోట్ల పనులు చేయడానికి పక్కనున్న రైతులు అభ్యంతరం చెబుతున్నారు.


**గడువులోగా సాధ్యమేనా!**

జిల్లాలోని 266 పంచాయతీల్లో మొత్తం 63 పనులను ప్రతిపాదించగా ఆమోదం లభించింది. మూడు నెలల కిందట పనులు ప్రారంభించినా పురోగతి అంతగా లేదు. ఇప్పటివరకు కేవలం 50 చోట్ల మాత్రమే ప్రారంభించారు. ధర్మారం మండలంలో 10 పనులు గుర్తించగా అదనంగా 14 చోట్ల పనులు చేస్తున్నారు. జూలపల్లిలో 7, ఎలిగేడులో 6, శ్రీరాంపూర్‌లో 5, సుల్తానాబాద్‌లో 9, కమాన్‌పూర్‌లో 2 చొప్పున పనులు ప్రారంభించగా మిగిలిన ఏడు మండలాల్లో ఒక పని మాత్రమే ప్రారంభించారు. మార్చి గడువు ముంచుకొస్తుండటంతో ప్రగతిపై నీలినీడలు కమ్ముకున్నాయి. వరి కోతల తర్వాతే పనులు చేసే అవకాశాలుండటంతో నిధుల వ్యయంపై సందిగ్ధం నెలకొంది.

**వేగం పెంచుతున్నాం**

జిల్లాలో పొలం బాట పనుల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తిస్తూ పరిష్కరిస్తున్నాం. కూలీల భాగస్వామ్యంతో పనుల్లో వేగం పెంచుతున్నాం. గడువులోగా మంజూరైన పనులన్నింటినీ ప్రారంభిస్తాం. త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. –కాళిందిని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

# ఆన్‌లైన్‌లో దినుసుల వివరాలు



జగిత్యాల : ఇది వరకు చాలామంది వ్యాపారులు రైతుల వద్ద నుంచి కొన్న పంట ఉత్పత్తులను జీరోకింద తరలించేవారు లేదా పంట విలువను తక్కువచేసి చూపేవారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పండటం, అక్రమ నిల్వలకు ఆస్కారం, రైతులను మోసగించేలా ఉన్న ఈ తంతును అరికట్టేలా మార్కెటింగ్‌శాఖ ఈ-పర్మిట్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. నూతన విధానం ప్రకారం వ్యాపారులు రైతుల వద్ద నుంచి దినుసులు కొన్న తరువాత 1 శాతం మార్కెట్ ఫీజు చెల్లిస్తారు. సరకును ఇతర ప్రాంతాలకు తరలించాల్సి వచ్చినపుడు ఆన్‌లైన్ ద్వారా మార్కెటింగ్‌శాఖ వెబ్‌సైట్‌లోకి లాగినై సరకు వివరాలు నమోదు చేయాలి. ఎక్కడ కొన్నది, రైతు నుంచి ఎంత కొన్నది, చెల్లించిన ధర, ఎక్కడికి తరలిస్తున్నది, ఎంత ఎగుమతి చేస్తున్నారనే వివరాలన్నీ నమోదు చేయాలి. రైతు చరవాణి నంబరుతో సహా వివరాలన్నీ అప్‌లోడ్ చేసిన తరువాతనే సరకు ఎగుమతికి ఆన్‌లైన్ అనుమతి వస్తుంది. ప్రతి పర్మిట్‌కు ఒక నంబరు ఆటోమెటిక్‌గా జనరేట్ అవుతుంది. ఈ ఆన్‌లైన్ పర్మిట్ తీసుకొని వాహనాల్లో సరకును తరలిస్తున్నపుడు తనిఖీ అధికారులకు ఆన్‌లైన్‌లో పర్మిట్ నంబరును పరిశీలించినపుడు వివరాలన్నీ కనిపించాలి. ఒకే పర్మిట్‌తో దేశంలో ఎక్కడికైనా సరకులను తరలించే వీలుంటుంది.

మక్కలు, బియ్యం సహా అన్ని పంట ఉత్పత్తుల తరలింపునకు ఈ-పర్మిట్ తప్పనిసరి కానుండటంతో రైతులనుంచి సరకు ఎక్కడికి తరలింది, ఏ ప్రాంతంలో నిల్వచేశారు, గోదాముల్లోని నిల్వలను ఎక్కడికి తీసుకెళ్లారనే వివరాలన్నీ ప్రభుత్వం వద్ద ఉంటాయి కాబట్టి అక్రమ నిల్వలకు అవకాశముండదు. ఈ-పర్మిట్ పద్ధతిని అతిక్రమించిన వ్యాపారులకు అధికారులు భారీగా జరిమానాలు విధించవచ్చు. జిల్లాలో దొడ్డు ధాన్యం మాత్రమే పూర్తిస్థాయిలో ప్రభుత్వం సేకరిస్తుండగా మిగిలిన ఉత్పత్తుల్లో 20-95 శాతం వరకు జీరోగానే తరలటంతో తూకంలో మోసాలు, డబ్బుల ఎగవేత, అక్రమ నిల్వలతో ఉపఉత్పత్తుల ధరలను అమాంతం పెంచటం తదితరాలు చోటు చేసుకుంటున్నాయి. పత్తి, సన్నధాన్యం, నువ్వులు, మక్కలు, అలసందలు, మామిడి, కందులు, పసుపు, పెసలు, మినుము, సోయాబీన్ తదితర చాలా ఉత్పత్తుల క్రయవిక్రయాల్లో ఇకపై ఈ-పర్మిట్ విధానాన్ని అమలు చేయటం, గ్రామాల్లో జీరో కొనుగోళ్లను అరికట్టడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత సీజన్‌లో ఈ-పర్మిట్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలి. దీనిపై ఏఎంసీ కార్యదర్శి టి.రాజశేఖర్ వివరిస్తూ ఇప్పటికే ఈ చలానాను అమలు చేస్తుండగా పరిశీలన పూర్తయిన కొన్నింటికి ఈ-పర్మిట్లు జారీ అవుతున్నాయన్నారు. ముమ్ముందు అన్నిరకాల ఉత్పత్తులు ఈ-పర్మిట్ ద్వారానే తరలించేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

# మసక బారిన హెచ్‌ఎండీఏ విజి'లెన్స్'

హైదరాబాద్: శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు పెద్దఎత్తున అక్రమ భవంతులకు అడ్డాగా మారుతున్నాయి. భూముల ధరలకు రెక్కలు రావడం, నివాస, వాణిజ్య భవనాల అద్దెలు భారీగా పెరగడంతో చాలామంది ఉన్న తక్కువ స్థలంలోనే బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. దీంతో పెద్దఎత్తున అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. వాస్తవానికి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు 1000 చ.మీ. విస్తీర్ణంలో జీ౦5 వరకు అనుమతులు ఇచ్చేందుకు అధికారం ఉంది. అయితే స్థానిక అధికారుల అండదండలతో కొందరు మరో 3 అంతస్తులు అదనంగా, అక్రమంగా నిర్మిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో 200 చ.మీ. విస్తీర్ణంలోనూ 5 అంతస్తుల భవనాలు చేపడుతున్నారు. అందుకు ప్రతిఫలంగా స్థానిక యంత్రాంగానికి భారీగా ముడుతోంది. దీంతో ఏటా రూ.కోట్లల్లో హెచ్‌ఎండీఏ ఆదాయానికి గండిపడుతోంది. అనుమతులు ఇతరత్రా ఫీజుల ద్వారా హెచ్‌ఎండీఏకు నెలకు రూ.100 కోట్ల వరకు సమకూరుతుండగా.. అక్రమ నిర్మాణాలతో రూ.50-60 కోట్లు ఆదాయం కోల్పోతోంది.

**ఎక్కడెక్కడంటే..** శంషాబాద్, బోడుప్పల్, బడంగ్‌పేట్, మీర్‌పేట్, జవహర్‌నగర్, ప్రగతినగర్, బండ్లగూడ జాగీర్ తదితర పురపాలికల్లో భారీఎత్తున అక్రమాలు జరుగుతున్నట్లు ఇప్పటికే హెచ్‌ఎండీఏ




గుర్తించింది. గతంలో ఆయా ప్రాంతాల్లో 600 అక్రమ భవనాలున్నట్లు తేల్చగా వాటిలో 200 పది అంతస్తుల వరకు ఉన్నాయి. వీటిని అధికారులు పాక్షికంగా కూలగొట్టి వదిలేశారు. దీంతో వాటికి యజమానులు మరమ్మతులు చేయించి విక్రయించినట్లు తెలుస్తోంది. మరికొందరు ఇప్పటికే వాటిని వ్యాపార, వాణిజ్య సంస్థలకు అద్దెకు ఇచ్చారు. అక్రమ నిర్మాణాలకు ఊతమిచ్చిన అధికారులపై ఎలాంటి చర్యలు లేకపోవడంతో దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

**తెలిసినా ఫిర్యాదులేవీ?**

హెచ్‌ఎండీఏలో ఓ డీసీపీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో విజిలెన్స్ విభాగం పనిచేస్తోంది. ఓ సీఐ, ఎస్ఐ కానిస్టేబుళ్లు, హోంగార్డుల ఆధ్వర్యంలో గతంలో విజిలెన్స్ వింగ్ ఏర్పాటు చేశారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి మాదిరిగా హెచ్‌ఎండీఏ విజిలెన్స్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం లేకపోవడంతో స్వయంగా నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి. అక్రమ నిర్మాణాలు గుర్తించినా వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాలతో ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. ఎక్కడికక్కడ కొందరు అధికారులు ఈ అక్రమాల్లో భాగస్వాములు కావడంతో అక్రమ భవనాల గురించి సమాచారం అందించినా ప్రయోజనం లేదు. విజిలెన్స్ విభాగంలో కొంతకాలంగా సీఐ పోస్టు ఖాళీగానే ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కల్పించుకొని అక్రమ భవనాలపై కొరడా ఝళిపించాల్సిన అవసరం ఉంది.

# సమాఖ్య స్ఫూర్తి.. స్వశక్తి కీర్తి

గంగాధర : స్వశక్తి ఉద్యమంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నా రు. పొదుపు మంత్రంతో బ్యాంకుల నుంచి రుణాలు పొంది కుటుంబాలను చక్కదిద్దుకుంటున్నారు. పిల్లలకు ఉన్నత చదువులు చెప్పిస్తూ నిలదొక్కుకునేలా జాగ్రత్త పడుతున్నారు. నెలనెలా ఆదాయ మార్గాలు అభివృద్ధి చేసుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గంగాధర మండలంలో గతేడాది 491 సంఘాలకు రూ.57.78 కోట్ల రుణాలు బ్యాంకులు మంజూ రు చేశాయి. ఆయా సంఘాలకు 548 యూనిట్లు కేటాయించి స్వశక్తిపై ఎదిగేలా చర్యలు తీసుకుంటున్నారు. స్వశక్తిపై రాణించి కుటుంబాలకు అండగా ఉంటున్న పలువురి విజయగాథపై



స్ఫూర్తిదాయక కథనం.

**ఏడాదిన్నరగా చేతినిండా పని**

గంగాధరకు చెందిన మెరుగు గంగాభవానీ, అమిరిశెట్టి విజయ, తాళ్ల నిర్మల మండల కేంద్రంలో ఏడాదిన్నరగా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. రూ.1.50 లక్షలు బ్యాంకు ద్వారా రుణం పొందారు. ఆర్డరుపై పిండి వంటలు తయారు చేసి ఇతర ప్రదేశాలకు పంపిస్తున్నారు. ఖర్చులు పోగా రోజుకు రూ.1000 మిగులుతున్నాయని, సొంత పనులు చేసుకుంటున్నామని సభ్యులు తెలిపారు.

**లేడీస్ ఎంపోరియం, కంప్యూటర్ మగ్గం వర్క్**

ర్యాలపల్లికి చెందిన బొజ్జ స్వాతి గంగాధరలో లేడీస్ ఎంపోరియం, కంప్యూటర్ మగ్గం వర్క్ యూనిట్‌తో నెలకు రూ.30 వేలు సంపాదిస్తున్నారు. బ్యాంకు ద్వారా రెండు విడతల్లో రూ.3.05 లక్షల రుణం పొందారు. నెలకు రూ.7 వేల చొప్పున బ్యాంకుకు చెల్లిస్తూ రుణం తీరుస్తుండగా కుటుంబ ఖర్చులు పోను నెలకు రూ.15 వేలు పొదుపు చేస్తున్నారు. 1998 నుంచి సంఘంలో పొదుపు చేస్తూ పిల్లలను చదివిస్తున్నారు.

**ఇతరులకు ఉపాధినిస్తూ..** తాడిజెర్రికి చెందిన గుంటుకు అరుణ కూలీ పనులకు వెళ్లేవారు. 2016లో స్వశక్తి ఉద్యమంలో చేరాక పిల్లల చదువుకు బ్యాంకు ద్వారా రుణం పొందారు. గ్రామైక్య సంఘం ద్వారా రూ.లక్ష, బ్యాంకు లింకేజీ ద్వారా రూ.2 లక్షలు తీసుకొని భర్త శేఖర్‌కు బైక్ మెకానిక్ షాపు ఏర్పాటు చేశారు. ఇందులో మరో ఇద్దరికి ఉపాధి కల్పిస్తున్నారు. బ్యాటరీలు కూడా విక్రయిస్తున్నారు. నెలకు రూ.20 వేల ఆదాయం వస్తోందని అరుణ తెలిపారు.

**కుటుంబానికి అండగా..**

ఉప్పరమల్యాలకు చెందిన శ్రీలత కుటుంబంతో వచ్చి గంగాధరలో కిరాణ దుకాణం నడిపించుకుంటున్నారు. 2020లో రూ.లక్ష రుణం తీసుకొని దుకాణం ప్రారంభించారు. బ్యాంకు రుణం తీర్చి పిండిగిర్ని, కొవ్వొత్తుల తయారీతో వ్యాపారాన్ని విస్తృతం చేశారు. రూ.2 లక్షల రుణం తీసుకొని భర్త లక్ష్మీకాంతంకు ట్రాలీ ఆటో కొనుగోలు చేసి ఇచ్చారు. ఆయిల్ డీలర్‌షిప్ తీసుకొని దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. పిల్లలను చదివించుకుంటూనే స్వశక్తి ద్వారా నెలకు రూ.35 వేలు సంపాదిస్తున్నట్లు శ్రీలత ఆత్మవిశ్వాసం వెలిబుచ్చారు.

## జలమండలికి.. ఆదిత్య 365

హైదరాబాద్: సౌరవిద్యుత్‌తో విద్యుత్ ఛార్జీల భారం నుంచి కొంతమేర ఉపశమనం పొందే కార్యాచరణను జలమండలి సిద్ధం చేసింది. 365 రోజులూ సౌరశక్తితో విద్యుత్తు అవసరాలు తీరేలా ప్రణాళికలు తయారు చేస్తోంది. ఖాళీ స్థలాలు, రిజర్వాయర్లు, నీటి శుద్ధిప్లాంట్లు, ఇతర ప్రదేశాల్లో 80 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి రంగం సిద్ధం చేస్తోంది. దీనికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదికను రూపొందించింది. జలమండలి ఏటా కోట్ల రూపాయల విద్యుత్ ఛార్జీలను చెల్లిస్తుండటంతో ఆర్థికభారం తప్పడం లేదు. తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీరెడ్కో) ద్వారా జలమండలి సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రక్రియను ముందుకు తీసుకెళ్తోంది.

**భారం తగ్గించుకోవడానికి...**

జలమండలికి డిస్కంల నుంచి కనెక్టడ్‌లోడ్ 300 మెగావాట్లు ఉండగా గరిష్ఠంగా 200 మెగావాట్లు వినియోగిస్తున్నారు. ఆర్థికభారం తగ్గించుకోవడానికి సౌరవిద్యుత్ ప్రణాళికలను ముందుకు తీసుకెళ్తోంది.



తెలంగాణ రెడ్కో ఇతర కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలతో కలిసి సౌర విద్యుత్ ప్లాంట్లను నెలకొల్పనుంది. నగరానికి వస్తున్న కృష్ణా, గోదావరి జలాలతోపాటు భవిష్యత్తులో వచ్చే ప్రాజెక్టులు సైతం విద్యుత్తు వినియోగంపైనే ఆధారపడటంతో సోలార్‌ను ప్రత్యామ్నాయంగా ఆలోచిస్తున్నారు. జలమండలి సగటున నెలకు చెల్లిస్తున్న విద్యుత్తు ఛార్జీలు రూ.120 కోట్లు ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే ఏటా రూ.40 కోట్ల ఛార్జీల మిగులు ఉంటుందని ప్రాథమిక అంచనా. దీంతో పాటు ఏటా 75 వేల టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గుతాయని భావిస్తున్నారు. ఏడాది క్రితమే 32 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రణాళికలు రూపొందించినా ప్రక్రియ ముందుకు సాగలేదు. దీంతో తాజాగా 80 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు. ప్రధానంగా నగరానికి నీటిని సరఫరా చేస్తున్న కృష్ణా, గోదావరి పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లు, వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, డిస్ట్రిబ్యూషన్ పంప్‌హౌస్‌లు, మురుగునీటి శుద్ధి కేంద్రాలతో పాటు ఖాళీ స్థలాల్లో సౌర ఫలకలను ఏర్పాటు చేసి సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నారు. ఒక్కో మెగావాట్ ఉత్పత్తికి రూ.70 లక్షలనుంచి రూ.కోటిదాకా వ్యయం అవుతుందని అంచనా వేశారు.

## ఓయూలో డిజిటల్ మార్కెటింగ్ బోధన

హైదరాబాద్: విభిన్న బోధన పద్ధతులు.. నాణ్యమైన సాంకేతిక విద్యా ప్రమాణాలను విద్యార్థులకు అందిస్తున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం.. డిజిటల్ మార్కెటింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తోంది. రాష్ట్రంలోనే తొలిసారిగా శిక్షణ ఇస్తున్నామని, 4 దశల్లో శిక్షణ, అవగాహన కార్యక్రమాలుంటాయని మానవ విజ్ఞాన, నైపుణ్యాల అభివృద్ధి కేంద్ర సమన్వయకర్త డాక్టర్ పి.మురళీధర్‌రెడ్డి వివరించారు.

**వ్యక్తిగత మార్కెటింగ్.. భిన్నమైన అంశాలు..**

వ్యక్తిగత మార్కెటింగ్.. భిన్నమైన అంశాలు.. ఇలా రెండు అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు భవిష్యత్తులో సొంత వ్యాపారం పెట్టుకుంటే ఈ–కామర్స్ తరహాలో విక్రయాలు వంటివాటిలో వేటిని



ఎంచుకున్నా.. డిజిటల్ మార్కెటింగ్ ద్వారా ప్రచారం కల్పించునేందుకు, అమ్మకాలను పెంచుకునేందుకు శిక్షణ ఇస్తున్నారు. వ్యాపారాన్ని ప్రారంభించాక సొంతంగా వెబ్‌సైట్‌ను రూపొందించుకోవడం, అనంతరం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించడం, ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్రచారం చేయడం వంటివాటిని నేర్పించనున్నారు.

**బహుళజాతి సంస్థలు... కంపెనీలకు ప్రచార బాధ్యతలు**

సొంతంగా సంస్థలు.. కంపెనీలు ఏర్పాటు చేసే స్తోమత లేకపోతే బహుళజాతి సంస్థలకు కన్సల్టెంట్లుగా నియమితులవ్వచ్చు. ఉత్పత్తులు వేగంగా అమ్ముడయ్యేలా వినూత్న ఆలోచనలతో పోస్టర్లు, లఘు చిత్రాలను రూపొందించడం.. వాటిని ఎంతమంది వీక్షిస్తున్నారు.. ఏస్థాయిలో రేటింగ్‌లు వస్తున్నాయో పరిశీలించే తర్ఫీదు ఇస్తారు. ప్రస్తుతం 85 మంది చేరి శిక్షణ తీసుకుంటున్నారు.

## రైలెక్కాలంటే బస్సు దిగి నడవాల్సిందే

హైదరాబాద్: చర్లపల్లి టెర్మినల్ మార్గంలో ఆర్టీసీ బస్సులను నడుపుతున్నా ప్రయాణికులకు ప్రయాస తప్పడం లేదు. కొత్తగా ప్రారంభమైన టెర్మినల్ ప్రధాన ద్వారం వైపు 400 మీటర్ల దూరంలో బస్సులను ఆపేస్తుండటంతో నడక తప్పడం లేదు. బుకింగ్ కౌంటర్‌కు వెళ్లి అక్కడి నుంచి ప్లాట్‌ఫాం వైపు వెళ్లేందుకు 15 నిమిషాలు పడుతోంది. ఆర్టీసీ బస్సులకేమో పరిమితులు విధించి.. క్యాబ్‌లను ప్రధాన ద్వారం వద్ద నిలిపేలా అనుమతులు ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బస్సులను టెర్మినల్ వరకు అనుమతించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

**విశాలమైన స్థలం ఉన్నా..** ప్లాట్‌ఫామ్ 9 మార్గంలో చెంగిచెర్ల, ఉప్పల్, రామంతాపూర్ నుంచి బోరబండ వరకు ప్రతి 40 నిమిషాలకో బస్సు ఉంది. ప్రధాన ద్వారం నిర్మించిన ప్రాంతంలో విశాల స్థలం ఉన్నా.. స్టేషన్‌కు అల్లంత దూరంలోనే ఆపేస్తుండడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పాత మార్గం వైపు ఇలా..**

పాతమార్గం మీదుగా స్టేషన్‌కు చేరుకునే ప్రయాణికులకు అనువుగా ప్లాట్‌ఫామ్ నెంబర్ 1, 2లను ఎంఎంటీఎస్ రైళ్ల నిలుపుదలకు కేటాయించగా..ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. వ్యక్తిగత, ప్రైవేటు వాహనాల పార్కింగ్‌కు సరైన సదుపాయాలు లేవు. ఈ మార్గంలో 100 మీటర్ల దూరంలో బస్సులు నిలుపుతున్నా...రహదారి విస్తీర్ణం తక్కువగా ఉండటంతో విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. త్వరలో రైళ్ల సంఖ్య పెరగనున్న తరుణంలో ఎక్కువ సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగించే అవకాశం ఉంది.

## కఠోర శబ్దం.. కర్ణానికి అనర్థం



కరీంనగర్ : భారీ ద్విచక్రవాహనాల వినూత్న హారన్, భారీగా వచ్చే సైలెన్సర్ ధ్వనిపై యువతకుకు ఉండే క్రేజ్ రోడ్డుపైకి వచ్చే వారి పాలిట శాపంగా మారుతోంది. భారీ శబ్దాలు చేస్తూ దూసుకెళ్తున్న తీరుతో ప్రజల గుండెలు జల్లుమంటున్నాయి. వాయు, ధ్వని కాలుష్యాలతో ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ మధ్యకాలంలో భారీ శబ్దాలతో దూసుకెళ్లే వాహనాలు ఎక్కువయ్యాయి. హారన్లతో మోత మోగిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఈ బాధలు నిత్యం ఎదుర్కొంటున్నారు. ఒరిజినల్ సైలెన్సర్లను తీసి భారీ శబ్దం వచ్చే వాటిని అమర్చుకొని ట్రెండ్ అంటున్నారు. పోలీసు, రవాణాశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి ఆకతాయిల ఆగడాలకు కళ్లెం వేయాల్సిన అవసరంపై కథనం.

**తనిఖీ చేస్తున్నా..**

వాహనాల తనిఖీ సమయంలో కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు శబ్ద కాలుష్యం చేస్తున్న బుల్లెట్ బండ్లను పట్టుకొని ఠాణాకు తరలిస్తున్నారు. ఎక్కువ శబ్దం వచ్చే సైలెన్సర్‌ను పోలీస్‌స్టేషన్‌లోనే మార్చుకొని తీసుకెళ్లాలనే నిబంధనను కఠినంగా అమలు చేసున్నా.. యువతలో మార్పు రావడంలేదు. పోలీసులతోపాటు రవాణాశాఖ అధికారులు దృష్టి సారించాలి.

**ఈ ప్రాంతాల్లో హారన్ కొట్టొద్దు..**

రోడ్డుపై వెళ్తున్న సమయంలో ముందు వాహనం వస్తే అడ్డుగా ఉన్న వాహనాలు పక్కకు వెళ్లేందుకు సాధారణంగా వాహనదారులు హారన్ కొడతారు. కానీ ఆసుపత్రులు, విద్యాలయాలు, న్యాయస్థానం, ఠాణాలు, పార్థనాలయాలు, పర్యావరణ ప్రాంతాల్లో హారన్ కొట్టడం నిషేధం. ఈ అంశంపై పోలీసులు, రవాణాశాఖ అధికారులు అవగాహన కల్పించాలి.

**రిజిస్ట్రేషన్ తరువాత..**

భారీ ద్విచక్రవాహనాలను కంపెనీలు నిబంధనల మేరకే తయారు చేస్తాయి. రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత సైలెన్సర్‌లో మఫ్లర్‌ను తీసేస్తుంటారు. భారీగా శబ్దం వచ్చే సైలెన్సర్, వివిధ రకాలుగా వచ్చే హారన్‌ను అమర్చుకొంటున్నారు. రాత్రి, పగలు అంటూ తేడా లేకుండా దూసుకెళ్లడంతో రోడ్డుపై వెళ్లే మహిళలు, యువతులు వింతగా పెద్దగా వచ్చే శబ్దాలతో ఉలిక్కిపడుతున్నారు. జంతువులు అరిచినట్లు, ఒకేసారి పెద్దగా శబ్దం రావడం, చిన్న వాహనాలకు భారీ వాహనాల హారన్, వింత హారన్లతో రోడ్లపై ఉన్నవారిని భయపెడుతున్నారు.

**నరం దెబ్బతింటే చెవుడు..**

భారీ శబ్దాలతో చెవి నరాలు దెబ్బతిని చెవుడు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఒక్కసారి నరం దెబ్బతింటే ఎలాంటి శస్త్రచికిత్సలు లేవు. మిషన్ తప్పనిసరిగా అమర్చుకోవాల్సి ఉంటుంది. మానవుల చెవులు 25 నుంచి 35 డెసిబుల్స్ మాత్రమే వినగలుగుతాయి. కానీ ఇలాంటి బండ్లలో వచ్చే శబ్దం 55 నుంచి 70 డెసిబుల్స్‌లో ఉంటుందని అంచనా. సాధారణంగా 70 ఏళ్లు దాటితే వినికిడి శక్తి తగ్గుతుంది. కానీ ఎక్కువ శబ్దాలు వినేవారికి 40 నుంచి వినికిడి సామర్థ్యం తగ్గుతోంది. అధిక శబ్దాలతో రక్తపోటులోనూ మార్పులు ఉంటాయి. డాక్టర్ వంశీకృష్ణారావు (ఎంఎస్, ఈఎన్‌టీ)

**సీజ్ చేసి జరిమానా..**

శబ్దకాలుష్యం చేస్తున్న ద్విచక్రవాహనాలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేస్తున్నాం. నిబంధనల ప్రకారం సైలెన్సర్, హారన్ లేకుంటే పోలీస్‌స్టేషన్‌కు తరలించి వాహనాన్ని సీజ్ చేసి రూ.1200 జరిమానా విధిస్తున్నాం. రోడ్లపై ఎవరికి ఆటంకం కలగకుండా వాహనాలు నడపాలి, మెకానిక్‌లు కూడా సైలెన్సర్లు, చిన్న వాహనాలకు భారీ హారన్‌లు బిగించొద్దు. కరీంఉల్లాఖాన్, ట్రాఫిక్ సీఐ, కరీంనగర్

## బకాయిలు రూ.6.26 కోట్లు




హుజూరాబాద్ : వ్యవసాయ శాఖ సేవలను రైతులకు మరింత చేరువ చేసే లక్ష్యంతో నిర్మించిన రైతు వేదికల నిర్వహణ గాలిలో దీపంలా మారింది. వాటి నిర్వహణకు అవసరమైన నిధులు నెలల తరబడి మంజూరు చేయకపోవడంతో రూ.కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. దీంతో వీటి నిర్వహణ ఏఈవోలకు గుదిబండగా తయారైంది. వారి వేతనాల నుంచి నిర్వహణ ఖర్చులు భరించాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లాలో 258 రైతు వేదికలు నిర్మించారు. ముందుగా ఒక్కో రైతు వేదిక నిర్వహణ ఖర్చుల కింద ప్రతీ నెలా రూ.3 వేలు ఇచ్చారు. ఈ నిధులు సరిపోకపోవడంతో వ్యవసాయ శాఖ ప్రతిపాదనల మేరకు 2020 ఏప్రిల్ నుంచి రైతు వేదికల నిర్వహణకు రూ.9 వేల చొప్పున అందజేస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. 2022 ఆగస్టు వరకు 5 నెలలకుగానూ ఒక్కో రైతు వేదికకు రూ.45 వేలు అందించింది. ఇక ఆ తర్వాత ఒక్క పైసా విదల్చలేదు. ఉమ్మడి జిల్లాలోని రైతు వేదికల నిర్వహణ నిధుల బకాయిలు రూ.6,26,94,000 మేర పేరుకుపోయాయి. 27 నెలలుగా మండల వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవోలు) తమ వేతనాల నుంచే నిర్వహణ ఖర్చులు భరిస్తున్నారు. విద్యుతు ఛార్జీలు, పారిశుద్ధ్య నిర్వహణ, మరమ్మతులు, స్టేషనరీ, రైతు శిక్షణ, తాగునీటి సౌకర్యాలకు నిధులు ఖర్చు చేయాల్సి ఉండగా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో తాము ఇబ్బందులకు గురవుతున్నామని, ఒక్కో రైతు వేదికకు రూ.2.43 లక్షలు రావాల్సి ఉందంటున్నారు. పైగా ఒక్కోదానికి రూ.12 వేల నుంచి రూ.15 వేల చొప్పున విద్యుత్తు బకాయిలు పేరుకుపోయాయని ఏఈవోలు అంటున్నారు.

**నిర్వహణ పనులన్నీ ఏఈవోలకే..** రైతు సమావేశాలు జరిగిన సందర్భంలో కనీసం తాగునీరు, తేనీటికి కూడా డబ్బుల్లేవని ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటెండర్ కూడా లేకపోవడంతో ఏఈవోనే తాళం తీసుకుని శుభ్రం చేసుకుని విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. శాస్త్రవేత్తలు, వ్యవసాయా ధికారులు, రైతులు సమావేశమై సాగు సమస్యలు, ఆధునిక పద్ధతులపై చర్చించేందుకు వీలుగా ప్రతీ అసెంబ్లీ నియోజవర్గానికి ఒక రైతు వేదికను ఎంపిక చేసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. కానీ నిర్వహణ నిధులు విడుదల చేయకపోవడంతో తామే అన్ని పనులు చేసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించే సమయానికి రైతు వేదికలను సిద్ధం చేయాల్సి వస్తోందని ఏఈవోలు అంటున్నారు. ప్రతీ నెలా తమ వేతనం నుంచే నిర్వహణ ఖర్చులు భరించాల్సి వస్తోందని, ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు. ఒక్కో కేంద్రానికి మినీ భూసార పరీక్ష ల్యాబ్ కిట్లను అందజేసి వీటి ద్వారా వేదికల్లో పరీక్షలు చేయాల్సి ఉన్నా నిధులు విడుదల చేయకపోవడంతో ఈ ప్రక్రియ కూడా అటకెక్కింది.

## హమ్మయ్యా.. నిధులొచ్చాయ్!

కరీంనగర్ : విద్యాసంవత్సరం ముగింపు దశలో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు రాష్ట్ర విద్యాశాఖ నిధులు మంజూరు చేసింది. పాఠశాలల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతున్న సమయంలో మంజూరు చేయడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఆదర్శ పాఠశాలలతోపాటు కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, గిరిజన సంక్షేమ పాఠశాలలకు కంపోజిట్ స్కూల్ గ్రాంట్, స్పోర్ట్స్ గ్రాంట్ మంజూరు చేశారు. గతేడాది జులై, ఆగస్టు నెలల్లో 50 శాతం, తాజాగా సమగ్ర శిక్షా అధికారులు మిగిలిన 50 శాతం నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.

**విద్యార్థుల సంఖ్యనుబట్టి..**

ఉమ్మడి జిల్లాలోని పాఠశాలలకు మొత్తం రూ.3,08,77,500 మంజూరయ్యాయి. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యనుబట్టి వీటిని అందించారు. 1–30 మంది విద్యార్థులు గల బడులకు రూ.10 వేలు, 31–100 మందికి రూ.25 వేలు, 101–250 విద్యార్థులకు రూ.50 వేలు, 251–1000 మందిగల బడులకు రూ.75 వేల చొప్పున మంజూరు చేశారు. ఇప్పటికే ఆ నిధుల్లోని 50 శాతం రావడంతో విద్యాసంవత్సరంలో ఇప్పటి వరకు పాఠశాలల నిర్వహణకు ఉపయోగపడ్డాయి. తాజాగా మిగిలిన 50 శాతం నిధులు రావడంతో నిర్వహణ ఖర్చులకు ఇబ్బందులు తప్పాయి. పాఠశాలల్లో చాక్‌పీసులు, రిజిస్టర్లు, స్టేషనరీ, చిన్న మరమ్మతులు, బిల్లుల చెల్లింపు, ప్రయోగ పరికరాల కొనుగోలు, ఇంటర్నెట్ ఛార్జీలు వంటి వాటికి ఖర్చు చేయనున్నారు. 50 శాతం నిధులు మంజూరు చేయడంతో జగిత్యాల జిల్లాకు రూ.కోటి వరకు



కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు లక్షల్లో నిధులు మంజూరయ్యాయి. ఎస్ఎంసీ ఖాతాల్లో ఈనిధులు జమకానున్నాయి.

**క్రీడా నిధులు సైతం..**

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలలకు రావాల్సిన మిగిలిన 50 శాతం క్రీడా నిధులు మంజూరయ్యాయి. ప్రాథమిక పాఠశాలలకు రూ.5000, ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.10,000, ఉన్నత పాఠశాలలకు రూ.25 వేల చొప్పున అందజేస్తున్నారు. విద్యార్థుల ఆటలు, వ్యాయామం కోసం, క్రీడా పరికరాల కొనుగోలుకు వాటిని ఖర్చు చేస్తారు. ఉమ్మడి జిల్లాకు క్రీడా గ్రాంట్ కింద రూ.1,24,22,500 మంజూరయ్యాయి. గతంలో 50 శాతం నిధులు వచ్చినా స్పోర్ట్స్ సెంటర్ల మాయజాలానికి ఆకర్షితులైన పలువురు నాసిరకం పరికరాలను కొనుగోలు చేసి నిధులు దుబారా చేసినట్లుగా విమర్శలున్నాయి. కొనుగోలు చేయాల్సిన క్రీడా, వ్యాయామ పరికరాల వివరాలు, ధరలను అధికారులే నిర్ణయించినా క్షేత్రస్థాయిలో అమలు కాలేదని ఆరోపణలు ఉన్నాయి.

## స్వచ్ఛతకు చర్యలు

సారంగాపూర్ : స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా అత్యంత రద్దీగా ఉండి ప్రభుత్వ స్థలం ఉన్న ప్రాంతాల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా పర్యాటక ప్రదేశాలు, ప్రార్ధన స్థలాలు, బస్టాండ్లు, ఆస్పత్రులు, మార్కెట్‌లతోపాటు అత్యంత రద్దీగా ఉండి ప్రభుత్వ స్థలాలు ఉన్న ప్రాంతాల్లో ఆధునిక టెక్నాలజీతో స్నానాల గది, మూత్రశాలలు, మరుగుదొడ్డి నిర్మించనున్నారు. ఇందులో స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా 70 శాతం చెల్లిస్తుండగా, 30 శాతం గ్రామ పంచాయతీలు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లించాల్సి ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా మండలాల్లో 18 స్థలాలు ఎంపిక చేయగా నిర్మాణాలకు జిల్లా



అధికారులు పరిపాలన అనుమతులు మంజూరు చేశారు.

**రూ.3 లక్షల నిధులతో..**

రూ.3 లక్షలతో శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో రూ.2.10 లక్షలు స్వచ్ఛ భారత్ మిషన్(ఎస్బీఎం) కింద, రూ.90 వేలు 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు వ్యయం చేయనున్నారు. రద్దీ ప్రాంతాల్లో రూ.5 లక్షలతో అదనంగా వస్తువుల విక్రయాలకు గది నిర్మాణం చేపట్టనున్నారు. డీఆర్డీఏ, ఎస్బీఎం అధికారులు సంయుక్తంగా నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు.

**రద్దీ ప్రాంతాల్లో..: హారిణి, ఎస్బీఎం, జిల్లా సమన్వయకర్త** రద్దీ ఉన్న ప్రాంతాల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛ భారత్ మిషన్, డీఆర్డీఏ ఆధ్వర్యంలో నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 18 నిర్మాణాలు చేపట్టాం. పరిసరాలు పరిశుభ్రంగా ఉండడమే కాకుండా ప్రజల ఇబ్బందులు తొలగనున్నాయి.

## చిట్టీల పేరుతో రూ.కోట్లకు కుచ్చుటోపీ?

ఇల్లెందు : ఓ ప్రైవేటు చిట్టీ వ్యాపారి ఘరానా మోసం పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పైసా పైసా కూడబెట్టి చిట్టీ వేస్తే.. ఆ డబ్బులను ఓ నిర్వాహకురాలు గద్దలా తన్నుకుపోయిందని బాధితులు వాపోతున్నారు. బాధితుల కథనం ప్రకారం.. పట్టణంలోని 24 ఏరియా కేంద్రంగా.. సింగరేణి కార్మికులు, వారి కుటుంబీకులే లక్ష్యంగా ఓ మహిళ చిట్టీలు నడుపుతోంది. గత 20 సంవత్సరాల నుంచి నమ్మకంగా కమీషన్‌పై ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తోంది. కొత్త చిట్టీలు ప్రారంభించడంతో పాటు, కొంతకాలంగా చిట్టీ పాడిన వారికి డబ్బులను చెల్లించడం లేదు. గట్టిగా అడిగిన వారికి వడ్డీలు చెల్లిస్తూ నెట్టుకొచ్చింది. చివరకు ఉడాయించినట్లు తెలిసి బాధితులు వాపోతున్నారు.

**సుమారు రూ.3కోట్లు ఎగ్గొట్టిన వైనం?**

చిట్టీ నిర్వాహకురాలు ఓ ప్రైవేటు ఉద్యోగి భార్య. గతంలో నమ్మకంగా చెల్లింపులు చేయడంతో ప్రస్తుతం వంద మందికి పైగా చిట్టీలు వేస్తున్నారు. ఆయా గ్రూప్ సభ్యుల్లో ఎక్కువగా సింగరేణి యూనియన్ల నాయకులు, కార్మికులు, విశ్రాంత కార్మికోద్యోగులున్నారు. నిర్వాహకురాలిపై నమ్మకం పెరగడంతో స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల్లోని కుమార్తెలు, అల్లుళ్లు, బంధువులనూ చేర్పించారు. ఒక్కో ఇంట్లో సుమారు ముగ్గురు, నలుగురు వరకు చిట్టీలు కడుతున్నారు. పలువురు సభ్యులు చిట్టీ పాడిన తర్వాత వచ్చిన డబ్బును సైతం ఆ మహిళకే వడ్డీకి ఇచ్చేవారు. గత మూణ్నెల్లుగా ఎవరికీ డబ్బులు, వడ్డీ చెల్లించకపోవడంతో కొందరికి అనుమానం వచ్చింది. బకాయిలను లెక్కతీయగా రూ.3 కోట్లుగా తేలాయి. గట్టిగా నిలదీయడంతో రేపు, మాపు అంటూ కాలం వెళ్లదీస్తోంది. గత కొద్దిరోజుల నుంచి ఆమె కనిపించకుండా పోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. కొందరు పెద్దలకు మాత్రం తమ సొమ్ము గుట్టుగా ముట్టినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో సాధారణ కార్మికులు తమ గోడు ఎవరికి చెప్పాలో తెలియక మనోవేదన చెందుతున్నారు. ఈ విషయం స్థానిక పోలీసుల చెంతకు వెళ్లినట్లు సమాచారం. బాధితులు తమకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, విషయాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

## నను బ్రోవమని చెప్పవే..

నేలకొండపల్లి నేలకొండపల్లిలో శనివారం నుంచి మూడు రోజులపాటు భక్తరామదాసు జయంత్యుత్సవాలు నిర్వహించనున్నారు. భద్రాచలం దేవస్థానం, రాష్ట్ర ప్రభుత్వ భాషా, సాంస్కృతికశాఖల ఆధ్వర్యంలో ఏటా ఉత్సవాలు జరుగుతాయి. స్థానిక భక్త: రామదాసు విద్వత్ కళాపీఠం బాధ్యులు తమ సహకారాన్ని అందిస్తున్నారు. ఏటా మాఘశుద్ధ తదియ నుంచి ఉత్సవాలను ప్రారంభిస్తారు. ఈ ఏడాదికి ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నిర్వహించనున్నారు. రామదాసు పదోతరం వంశీయులు కంచర్ల శ్రీనివాస్ కుటుంబీకులు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. మంత్రులు, కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరవనున్నారు. రామదాసు కీర్తనలు, నగర సంకీర్తన, వాయిద్య ప్రదర్శనలు, భక్తి నృత్యాలు, గానకచేరిలు, వాగ్గేయకారుల ప్రదర్శనలతో ధ్యానమందిరం మార్మోగనుంది. ధ్యానమందిర ప్రాంగణం వద్ద నూతనంగా ఆడిటోరియాన్ని నిర్మించారు. గతంలో ధ్యానమందిర ప్రాంగణంలోనే కార్యక్రమాలు నిర్వహించగా ఈ ఏడాది నుంచి నూతన ఆడిటోరియంలో భద్రాచల దేవస్థానం ఆధ్వర్యంలో కొనసాగనున్నాయి.

భద్రాచలం ట్రస్టు బోర్డులో స్థానమివ్వాలి..

రామదాసు భద్రాచల దేవస్థానాన్ని నిర్మించినందున ట్రస్టు బోర్డులో ఇక్కడి స్థానికులొకరికైనా చోటు కల్పించేలా సంప్రదాయాన్ని అనుసరించాలని ప్రధానంగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. భక్త రామదాసు అపరభక్తుడే కాక చరిత్రలో ప్రముఖ వాగ్గేయకారుడు. ఆయన పేరుతో ఆధ్యాత్మిక, సంగీత రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు అందిస్తే చరిత్రలో నిలిచిపోతుంది. రామదాసు రూపాన్ని అంచనా వేసి సరైన విగ్రహాన్ని నేలకొండపల్లిలో ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ధ్యానమందిరాన్ని పునఃనిర్మించి సీతారామచంద్రుల దేవాలయాన్ని అనుబంధంగా ఏర్పాటు చేస్తే తన జన్మస్థలంలోనూ పరమ భక్తుని కోరిక నేరవేరినట్లువుతుంది. పరిసర ప్రాంతాలను మందిరం అభివృద్ధి కోసం సేకరించి ఉంచితే శ్రీరామనవమి తదితర పండుగలకు వేలాదిగా భక్తులొస్తారని అంచనా. జయంత్యుత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వ నిధులు కేటాయించి సీఎం, గవర్నర్ స్థాయి వ్యక్తులు హాజరయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తే ధ్యాన మందిరం విశిష్టత భావితరాలకూ అందుతుంది.

చురకలు



# ఉ అంటే.. ఊడ్చేస్తారు

విజయనగరం: ఫోన్ చేసి ఉద్యోగాలు, రుణాలు, కమీషన్లు, కార్డులు, లాటరీల పేరిట ఒకప్పుడు నగదు కాజేసేవారు.. కొన్ని రోజులుగా కేటుగాళ్లు రూటు మార్చారు.. వ్యక్తిగత, కుటుంబ, బ్యాంకు ఖాతాలు, డెబిట్, క్రెడిట్ వివరాలను సేకరించి పక్కా సమాచారంతో సంప్రదిస్తున్నారు.. మత్తు పదార్థాలు, నిషేధిత వస్తువులను సరఫరా చేస్తున్నారని, మీరు ఆర్డరు చేసిన పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని నమ్మబలుకుతూ రూ.లక్షలు కాజేస్తున్నారు.. ఇవే డిజిటల్ అరెస్టులు. కేంద్ర ప్రభుత్వం సైతం ఇప్పటికే ఇలాంటి కేసులపై అప్రమత్తమైంది.

**ఏం చేస్తారంటే..**

కేటుగాళ్లు ముందుగానే పూర్తిస్థాయి వివరాలు తెలుసుకుంటారు. అనంతరం సంప్రదిస్తారు. మీ కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరిని అరెస్టు చేస్తామని బెదిరిస్తారు. లేకపోతే మిమ్మల్నే కేసులో ఇరికిస్తామని పేర్కొంటారు. ఉన్నతాధికారి విచారణ చేస్తున్నారని, వివరాలు చెప్పాలని నమ్మబలుకుతారు. అలా ఖాతాలో నగదు కాజేస్తారు. గత అయిదు నెలల్లో విజయనగరం జిల్లాలో ఇలాంటివి పది కేసులు నమోదు కాగా.. అందరూ నగదు పోగొట్టుకున్నారు. విజయనగరం జిల్లాలో నవంబరు వరకు ఆన్‌లైన్‌లో నగదు కాజేసిన ఆర్థిక మోసాలపై 93 కేసులు నమోదయ్యాయి. మన్యంలో 21 కేసులను గుర్తించారు.

'సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెరిగితే ఆన్‌లైన్ మోసాలకు దూరంగా ఉంటారు. లఘుచిత్రాలు ప్రదర్శించి అప్రమత్తం చేస్తున్నాం. బాధితులుంటే పోలీసులను గానీ, 1930ను గానీ సంప్రదించాలి' అని ఎస్పీలు వకుల్ జిందాల్, మాధవరెడ్డి తెలిపారు.

**అప్రమత్తత ఇలా..**

గుర్తుతెలియని నంబర్ల నుంచి కాల్ వస్తే స్పందించకపోవడం మంచిది. పోలీసులు గానీ, ఇతర శాఖల అధికారులు గానీ ఆన్‌లైన్‌లో, చరవాణుల్లో విచారణ చేయరు. గూగుల్‌పే, ఫోన్‌పే తదితర యూపీఐ ఆధారిత యాప్‌లకు ఎప్పటికప్పుడు పాస్‌వర్డులను మార్చాలి.

ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాంకు ఖాతాల వివరాలు గానీ, ఓటీపీలు గానీ చెప్పకూడదు ఒకవేళ సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే పోలీసులను సంప్రదించాలి ప్లస్ గుర్తు తరువాత పదకొండ అంకెల నంబర్లు ఉంటే ముప్పుగా పరిగణించాలి హేష్ తరువాత 90, 09 తదితర నంబర్లను డయల్ చేయమంటే అప్రమత్తం కావాలి.

# బహుళ ప్రయోజనం.. సృజనకు దర్పణం

విజయనగరం : ఉమ్మడి జిల్లా పాలీటెక్ ఫెస్ట్ వేదికగా డిప్లొమా విద్యార్థుల ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. సృజనాత్మకతకు అద్దం పట్టాయి. ప్రభుత్వం ఇస్తున్న సోలార్ సబ్సిడీని ఎలా సద్వినియోగం చేసుకోవాలి? పరిశ్రమల్లో ప్రమాదాలు తగ్గించే విధానం? బహుళ అవసరాలకు డ్రోన్ల వినియోగంపై విద్యార్థులు ప్రదర్శనల రూపంలో తెలియజెప్పారు. మహారాజా ఆనంద గజపతిరాజు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఫెస్ట్ ప్రారంభమైంది. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు 62 ప్రాజెక్టులను ప్రదర్శించారు. కొన్ని ప్రాజెక్టుల గురించి వారి మాటల్లోనే..

**రోబోటిక్ ఆర్మ్** పరిశ్రమల్లో మానవ ప్రమాదాలు తగ్గించడమే ఉద్దేశం. పని ప్రదేశాల్లో కొన్ని తప్పిదాల వల్ల కార్మికులు గాయపడుతున్నారు. కొందరు చనిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో మనిషి చేసేది రోబోట్ చేస్తోంది. సరకుల తరలింపు, కూర్పు వంటి పనులు రోబోటిక్ ఆర్మ్ ద్వారా చేయొచ్చు. ఎం.సుమన్, కె.గ్రీష్మన్, ఎస్.రఘురాం, పి.రవీంద్ర, డిప్లొమా విద్యార్థులు, అవంతి కళాశాల, చెరుకుపల్లి

**ఆన్‌లైన్ యూపీఎస్ సిస్టమ్**

ప్రస్తుతం ఉపయోగిస్తున్న యూపీఎస్ విద్యుత్తుపై పనిచేస్తుంది. దీనిలో ఆన్‌లైన్ విధానంలో నిరంతరం విద్యుత్తు సరఫరా జరుగుతుంది. బ్యాటరీని ఛార్జి చేయడం ద్వారా అత్యవసర సమయాల్లో వాడుకకు బాగుంటుంది. డేటా సెంటర్లు, టెలికాం, ఆసుపత్రులు, పరిశ్రమల్లో ఉపయోగకరం. – మహేంద్రప్రసాద్, వైష్ణవి, వెంకట్, మహారాజా ఆనంద గజపతిరాజు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, విజయనగరం



**పెడల్ పవర్ ఎలక్ట్రిసిటీ జనరేటర్**

యాంత్రిక శక్తిని ఉపయోగించి విద్యుత్తును ఉత్పత్తి చేసే విధానం. 12 కేవీ మోటార్, సైకిల్ పెడల్, చక్రం సహాయంతో ఉత్పత్తి చేసే విధానాన్ని ప్రయోగపూర్వకంగా చేసి చూపించాం. విద్యుత్తు సౌకర్యం కల్పించలేని మారుమూల గ్రామాలు, కొండ ప్రాంతాలకు అనువైనది. ఆరోగ్యపరంగా ప్రయోజనాలున్నాయి.

– హిమసాగర్, జగన్‌మోహన్, ప్రదీప్, సాయి, అక్షర పాలిటెక్నిక్ కళాశాల, బొండపల్లి

**మల్టీపర్పస్ డ్రోన్లు** డ్రోన్లను బహుళ అవసరాలకు ఉపయోగించే విధానాన్ని తెలియజేశాం. పురుగు మందులు పిచికారీ, భూముల సర్వే, పంట పర్యవేక్షణ, మందుల సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ రక్షణరంగాల్లో దీనిని ఉపయోగించవచ్చు. ప్రయోగపూర్వకంగా చేసి చూపించాం.– భోజరాజు, వంశీ, సాయి శ్రీనివాస్, సూరిబాబు, ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, విజయనగరం

**మల్టీపర్పస్ డ్రోన్లు** డ్రోన్లను బహుళ అవసరాలకు ఉపయోగించే విధానాన్ని తెలియజేశాం. పురుగు మందులు పిచికారీ, భూముల సర్వే, పంట పర్యవేక్షణ, మందుల సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ రక్షణరంగాల్లో దీనిని ఉపయోగించవచ్చు. ప్రయోగపూర్వకంగా చేసి చూపించాం. – భోజరాజు, వంశీ, సాయి శ్రీనివాస్, సూరిబాబు, ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, విజయనగరం

సోలార్ విద్యుత్తును ఉపయోగించి పంటలకు పురుగు మందులు పిచికారీ చేయవచ్చు. గంటకు 140 లీటర్లు పిచికారీ చేసేలా దీన్ని రూపొందించాం. రూ.2000– రూ.2,500 బడ్జెట్‌లో అందుబాటులోకి తెస్తే చిన్న రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. – బి.బాలాజీ, జి.భానుప్రకాష్, పి.వి.ఎన్.కమలేశ్, కె.సాయికుమార్, ప్రభుత్వ ఆదర్శ గురుకుల పాలిటెక్నిక్ కళాశాల, గుమ్మలక్ష్మీపురం

**పవర్ ఆఫ్ హైవోల్టేజీ** తక్కువ వోల్టేజీని ఎక్కువ వోల్టేజీగా మార్చుకోవచ్చు. పీడబ్ల్యూఎం సర్క్యూట్, ఫ్లైబ్యాక్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఉపయోగించడం ద్వారా మార్పు వస్తుంది. ఇంట్లో తీగలు ఉపయోగించకుండా విద్యుత్తు వినియోగం, పరిశ్రమల్లో అవసరాలు, ఉపగ్రహాల్లో ఆవశ్యకతను తెలియజేశాం.– ఎం.ఎస్.ఎస్.సోమేశ్, కె.జస్వంత్, ఎ.శివప్రసాద్, డి.సాయిగణేష్, ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల, చీపురుపల్లి

# హామీలు సరే.. వంతెన ఏదీ..?

పెనుమూరు : ప్రభుత్వాలు, పాలకులు మారిన ప్రతిసారి సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి కృషి చేస్తామని హామీలు గుప్పిస్తున్నారు. చివరకు వాటిని అమలు చేయడంలో మాత్రం నిర్లక్ష్యం చూపుతున్నారు. దీంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఈ కోవకు చెందినదే పెనుమూరు–పూతలపట్టు మండలాలను కలిపే తూపల్లె వద్ద భీమా నదిపై వంతెన నిర్మాణం. గత జడ్పీ ఛైర్మన్ గీర్వాణి, వైకాపా ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన నారాయణస్వామి ఇచ్చిన హామీలు నేటికీ నీటి మూటగానే మిగిలిపోయాయి.

**ప్రజలకు తిప్పలు..**

పాకాల, పులిచర్ల, పూతలపట్టు మండలాల్లో కురిసే భారీ వర్షాలకు బీమా నదికి వరద వస్తుంది. ఈ వరద నీరు నేరుగా ఎన్టీఆర్ జలాశయంలోకి చేరుతుంది. ఈ మధ్యలో మండలంలోని తూపల్లె వద్ద పెనుమూరు–పూతలపట్టు మండలాలను కలిపేందుకు నదిలో రహదారి ఉంది. వరద వచ్చిన ప్రతిసారీ ఈ రోడ్డు కోతకు గురవుతోంది. దీంతో మండలానికి చెందిన చిన్నకలికిరి పంచాయతీ ప్రజలకు మండలానికి రావాలంటే వ్యయప్రయాసలు తప్పడం లేదు. ఇక మండలంలోని కలికిరి, నంజరపల్లె, లక్కలపూడివాండ్ల ఊరు పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, కూలీలు చిత్తూరు, తిరుపతి వెళ్లేందుకు నానా తంటాలు పడుతున్నారు.

**నేతల హామీ గాలికి..**

భీమా నదిపై వంతెన నిర్మించి ప్రజల ఇక్కట్లు తొలగిస్తామని నేతలు ఇచ్చిన హామీలు నెరవేరలేదు. తెదేపా హయాంలో చిత్తూరు జడ్పీ ఛైర్మన్‌గా పనిచేసిన గీర్వాణి.. ఓసారి నదిలో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఆ సమయంలో జడ్పీ నిధులతో వంతెన ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ తరవాత అతీగతీ లేకుండా పోయింది. గత వైకాపా పాలనలో ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన అప్పటి స్థానిక ఎమ్మెల్యే నారాయణస్వామి సైతం సమస్య పరిష్కరించేందుకు వంతెన ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మాట ఇచ్చినా నీటి మూటలాగా నదిలో కొట్టుకు పోయిందనే చెప్పాలి. ఇటీవల రెండుసార్లు రోడ్డు కోతకు గురికావడంతో దాతల సాయంతో బాగు చేశారు.



**నది ప్రవహిస్తే అవస్థలే..**

భీమా నది ప్రవహించిన ప్రతిసారీ రోడ్డు కోతకు గురవుతోంది. దీంతో ఈ ప్రాంత ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. నాయకులు హామీలు ఇస్తున్నా ఆ తరవాత పట్టించుకోవడంలేదు. దాదాపు 15 గ్రామాల ప్రజలు పనులకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. సమస్య పరిష్కారానికి పాలకులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.
నీరజాక్షులునాయుడు, ఎల్లంపల్లె

**ఇబ్బందులు పడుతున్నాం..**

నదికి వరద వచ్చి రోడ్డు కోతకు గురైతే మాకు తిప్పలు తప్పవు. ఏదైనా పనిమీద మండల కేంద్రానికి వెళ్లాలంటే 30 కిమీ. ప్రయాణం చేయాలి. దీంతో అన్నివిధాలా నష్టపోతున్నాం. అధికారులు చొరవ తీసుకుని వంతెన త్వరితగతిననిర్మిస్తే ఇక్కట్లు తీరుతాయి. ముత్తుకుమార్, చిన్నకలికిరి

# నిధులొస్తే మరింత ఊపు



ముమ్మిడివరం: వైకాపా అయిదేళ్ల పాలనలో అస్తవ్యస్తంగా మారిన రహదారులను బాగు చేయడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో 'పల్లె పండుగ' పథకంలో గ్రామాల్లో పెద్దఎత్తున సిమెంటు రహదార్లు, కాలువల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఈ ఏడాది సంక్రాంతి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో చేపట్టగా వివిధ కారణాలతో పూర్తికాలేదు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి పూర్తి చేయాలని భావిస్తున్నా బిల్లులు రాకపోవడంతో పనులు మందగించాయి.

**గత వైఫల్యాలు వెంటాడుతూ..**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గత ఏడాది అక్టోబరు 14న రూ.88.17 కోట్లతో 1,002 పనులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు 60 శాతం పనులే పూర్తయ్యాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ ద్వారానే నడుస్తోంది. గత పాలకులు ఈ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు ఇతర పథకాలకు మళ్లించడం.. నిబంధనలు సక్రమంగా పాటించకపోవడంతో ఏపీలో దీని నిర్వహణపై కేంద్రానికి నమ్మకం సడలింది. ఉపాధి హామీ పథకంలో చేసిన పనులకు అప్పట్లో బిల్లులు ఇవ్వకపోవడంతో చాలామంది ఇబ్బందులకు గురయ్యారు. ఆ భయం ప్రస్తుత గుత్తేదారులనూ వెంటాడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పథకం నిధులు గ్రామ సభల తీర్మానాలకు అనుగుణంగా చేపడుతున్నారు.

**మొదట్లో బాగానే వచ్చినా..**

పల్లె పండుగలో చేపట్టిన సిమెంటు రహదారులు, కాలువల నిర్మాణానికి మొదట్లో బిల్లుల సమస్య లేదు. పని ప్రారంభించిన తర్వాత ఉపాధి హామీ పథకం పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన వెంటనే బిల్లులు వచ్చేవి. ప్రతి గురువారం చెల్లింపులు జరిగేవి. ఇప్పటి వరకు రూ.34 కోట్లు విలువ చేసే పనులు పూర్తికాగా, రూ.6.91 కోట్ల బిల్లుల చెల్లింపులు పూర్తిచేశారు. మిగతావాటికి అందాల్సి ఉంది ఇది పనులపై ప్రభావం చూపుతోంది. **పూర్తి చేసేందుకు చర్యలు**

పల్లె పండుగలో చేపట్టిన రహదారుల నిర్మాణం ఈ నెలాఖరునాటికి పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం బిల్లుల చెల్లింపు నిలిచినా, త్వరలోనే నిధులు విడుదలవుతాయి. ప్రస్తుతం చాలా వరకు పనులు ప్రారంభించారు. వాటిని పూర్తి చేయడంపై దృష్టి సారించాం. పి.రామకృష్ణారెడ్డి, ఈఈ పంచాయతీరాజ్, అమలాపురం

# సమయం లేదు మిత్రమా..

కాకినాడ : గత వైకాపా పాలనలో గ్రామాలను పట్టించుకోలేదు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను జగన్ సర్కారు ఇతర పనులకు వాడుకుంది. పల్లె పాలనను పూర్తిగా అటకెక్కించారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులున్నా ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక పల్లె పండగ పేరుతో వీటిపై దృష్టి సారించింది. పల్లె దారులు చక్కదిద్దడానికి సంకల్పించింది. రూ.61.31కోట్ల విలువైన 537 పనులు పూర్తి చేయాలి. మార్చి 31లోగా పూర్తి చేసి, బిల్లులు సమర్పిస్తేనే మంజూరైన నిధులు మనుగడలో ఉంటాయి. ఇంకా నెల మాత్రమే ఉన్న నేపథ్యంలో త్వరగా పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

**123 కి.మీ.రోడ్డు నిర్మించారు..**

పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షిస్తుండగా జిల్లా నీటియాజమాన్య సంస్థ నిధులు మంజూరు చేస్తోంది. జిల్లాలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.120.54 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటివరకు రూ.59.23 కోట్ల విలువైన పనులు పూర్తి చేయగా, రూ.45.52కోట్ల మేర బిల్లుల చెల్లింపు, ఎఫ్‌టీవోలు జారీ చేశారు. 195.96 కి.మీ. రహదారి నిర్మాణానికి గాను 123.52 కి.మీ. నిర్మించారు. 1,279 పనులకు 742 పూర్తి చేశారు. కొన్నిచోట్ల శంకుస్థాపనలు జరిగినా, పనులు చేపట్టలేదు. త్వరగా పూర్తి చేసేలా ఈ రెండు శాఖల సమన్వయం తప్పనిసరి. **నియోజకవర్గాల వారీగా ఇదీ పరిస్థితి..**

పిఠాపురం నియోజకవర్గంలో 370 పనులకు 202 మాత్రమే పూర్తయ్యాయి. జగ్గంపేట నియోజకవర్గంలో 98 పనులకు 28 పూర్తి చేశారు. జగ్గంపేట మండలంలో 52 పనులకు 6, కిర్లంపూడి మండలంలో 29 పనులకు 8 మాత్రమే పూర్తయ్యాయి.

తుని నియోజకవర్గంలో 253 పనులకు 156 పూర్తి చేశారు.

ముమ్మిడివరం నియోజకవర్గంలోని తాళ్లరేవు మండలంలో 37 పనులకు 9 పూర్తయ్యాయి.



అనపర్తి నియోజకవర్గం పెదపూడిలో 35 పనులకు 30, రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరులో 27 పనులకు 22 జరిగాయి.

పెద్దాపురం నియోజకవర్గంలో 51 పనులకు 15 మాత్రమే పూర్తయ్యాయి. కాకినాడ గ్రామీణం నియోజకవర్గంలో 262 పనులకు 152 అయ్యాయి.

ప్రత్తిపాడు నియోజకవర్గంలో 146కు 128 పూర్తి చేశారు.

త్వరగా పూర్తి చేస్తాం..సీసీ రోడ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేస్తాం. నెల వ్యవధిలో అన్నింటిని సాకారం చేసి, ప్రజలకు అందుబాటులోకి తెస్తాం. పూర్తయిన పనులకు ఎప్పటికప్పుడు బిల్లులు పొందుపరుస్తున్నాం. నాణ్యతతో జరిగేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నాం. ఏవీఎస్ శ్రీనివాస్, పర్యవేక్షక ఇంజినీరు, పంచాయతీరాజ్‌శాఖ, కాకినాడ జిల్లా

# పాపం.. పోషకలోపం

విజయనగరం : పిల్లల ఎదుగుదలలో ఏడాది నుంచి అయిదేళ్ల లోపు వయసు అత్యంత కీలకం. ప్రస్తుతం పోషకాహార సమస్యతో వేల మంది చిన్నారులు బాధపడుతున్నారు. సరైన ఆహారం తీసుకోకపోవడం, సదుపాయాల కొరత, పేదరికం, తల్లిదండ్రుల జీవన పరిస్థితులే అందుకు కారణాలు. వారిని సకాలంలో గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించాలి. ఆ బాధ్యత ఆశాలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పీహెచ్‌సీల సిబ్బందిదే. వారి నుంచి స్పందన లేకపోవడంతో తల్లిదండ్రులు కేంద్రాలకు తీసుకు రావడం లేదు.

**ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా..**

ఎత్తుకు తగిన బరువు, వయసుకు తగ్గ బరువు లేకున్నా, చేతులు కర్రపుల్లలా కనిపించినా, కడుపు ఎత్తుగా ఉండి చుట్టూ ఎముకలు గూడు



తలపించేలా ఉన్నా, 8 గ్రాముల కంటే తక్కువ రక్తం ఉంటే వెంటనే తల్లిదండ్రులు అప్రమత్తం కావాలి. అటువంటి వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలి. అక్కడ ఆట పాటలతో పాటు పుష్టిగా భోజనం పెడుతూ ఉచిత వైద్యం, కౌన్సెలింగ్ అందిస్తూ సాధారణ పిల్లల్లా మారుస్తారు. ప్రస్తుతం విజయనగరంలోని ఘోషాసుపత్రిలో సేవలు కొనసాగుతున్నాయి.

**ఆర్థిక సాయం..**

ఆరు నెలల నుంచి అయిదేళ్ల లోపు పిల్లలను తీసుకెళ్లవచ్చు. 60 రోజుల పాటు వారికి సేవలు ఉంటాయి. 24 గంటల పాటు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు చేస్తారు. వాటి ఆధారంగా వైద్యం చేస్తారు. పిల్లలను తీసుకొచ్చే వారికి రోజుకు రూ.100 చొప్పున ఇస్తారు. ఇతర సిబ్బంది వెంట వస్తే వారికి అదనంగా రూ.50 అందజేస్తామని ఎన్ఆర్సీ పర్యవేక్షకులు ప్రతిరా, విజయలక్ష్మి తెలిపారు. పాలు, కిచిడీ, బెల్లంతో చేసిన హల్వా, ఉడకబెట్టిన ఎర్రదుంపలు, శనగపిండితో చేసిన పదార్థాలు, ఆకు కూరలతో భోజనం అందిస్తామన్నారు. ప్రతి 2 గంటలకోసారి ఇలాంటి బలవర్థక ఆహార పదార్థాలు ఇస్తామని పేర్కొన్నారు.

# 5 ఏళ్ల 'నిధి'రాత

నంద్యాల : ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా సాగు నీటి వనరుల నిర్వహణను వదిలేసింది.. ప్రపంచ బ్యాంకు, సింప్, జైకా వంటి సంస్థలు ముందుకొచ్చినా స్పందించలేదు.. రాష్ట్ర ప్రభుత్వం వాటా ఇవ్వకపోవడంతో పనులు గట్టు దాట లేదు.. ఫలితంగా చెరువులు చెదిరాయి.. కాల్వలకు గండ్లు పడ్డాయి.. సాగు నీరు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. పనులు పూర్తి చేసి ఉంటే కేసీ కాల్వ పరిధిలో 1.65 లక్షల ఎకరాలు, చెరువుల పరిధిలో 81,629 ఎకరాలకు నీరు సాఫీగా అందేది.

**జైకా జారిపోయింది**

ఉమ్మడి జిల్లాలో వరదల తాకిడికి దెబ్బతిన్న చెరువులు మరమ్మతులు చేయడానికి అవసరమైన నిధులు ఇవ్వడానికి జపాన్ అంతర్జాతీయ



సహకార సంస్థ (జైకా) ముందుకొచ్చింది. నంద్యాల జిల్లాలో ఒక చెరువును రూ.1.50 కోట్లు, కర్నూలు జిల్లాలో 16 చెరువులను రూ.2 కోట్లతో బాగు చేయాలని ప్రతిపాదించారు. ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు.

**'సింప్'లుగా వదిలేశారు**

ఇటీవల నిర్వహించిన సాగునీటి పారుదల సలహా సంఘం సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక సమర్పించాలని మంత్రులు ఆదేశించారు.

కర్నూలు– కడప ప్రధాన కాల్వ దెబ్బతిన్నది.. 305 కి.మీ. పొడవునా లైనింగ్‌ను బాగు చేసేందుకు రూ.550 కోట్లతో అధికారులు ప్రతిపాదించారు. సుంకేసుల ఆనకట్ట నుంచి చాగలమర్రి మండలం చివరి ఆయకట్టు వరకు లైనింగ్ దెబ్బతిన్న తీరును అధికారులు నివేదికలో సమర్పించారు.

స్పందించిన కేంద్రం సపోర్ట్ ఫర్ ఇరిగేషన్ మాడరైజేషన్ ప్రోగామ్ (సింప్) కింద నిధులు విడుదల చేసేందుకు ముందుకొచ్చింది. కేంద్రం 85 శాతం నిధులిస్తే రాష్ట్రం 15 శాతం వెచ్చించాల్సి ఉంటుంది. వైకాపా ప్రభుత్వం వాటా నిధులు ఇవ్వకపోవడంతో పనులు జరగలేదు. ప్రధాన కాల్వ 0 నుంచి 25 కి.మీ. వరకు లైనింగ్ పూర్తిగా దెబ్బతిన్నది. వేల్పనూరు నుంచి సంతజూటూరు వరకు 12 కి.మీ. మేర పూర్తిగా చెడిపోయింది.

చెరువుకు చేరని నిధులు

ఇప్పటి వరకు ఎనిమిది చెరువుల వద్దే పనులు చేశారు. కరివేముల, తంగడంచ, ఉప్పలపాడు, నేతలమర్రి, పత్తికొండ ఊరి చెరువు పనులు ప్రారంభమే కాలేదు.

ఉమ్మడి జిల్లాలో 31 చెరువులను పునరుద్ధరించి ఆరు వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. వ్యవసాయ పరివర్తన ప్రాజెక్టు (ఏపీఐఏటీసీ) కింద నిధులిచ్చేందుకు ప్రపంచ బ్యాంకు ముందుకొచ్చింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.52.04 కోట్లు.. ఇందులో ప్రపంచ బ్యాంకు వాటా 70 శాతం, రాష్ట్ర వాటా 30 శాతం. వైకాపా హయాంలో పట్టించుకోలేదు.

రుద్రవరం మండలంలో 2, ఆళ్లగడ్డ 2 , అవుకు, జూపాడుబంగ్లా, బండిఆత్మకూరు, శిరివెళ్ల, ఉయ్యాలవాడ, గడివేముల, జూపాడుబంగ్లా, డోన్ మండలాల్లో ఒక్కొక్క చెరువును ఎంపిక చేశారు. దేవనకొండ మండలంలో రెండు, ఆదోనిలో మూడు, పత్తికొండ, హొళగుంద, ఆస్పరి, సి.బెళగల్, కృష్ణగిరి, వెల్దుర్తి, కౌతాళం, హాలహర్వి, ఆలూరులలో ఒక్కోటి బాగు చేయాలని నిర్ణయించారు.

చురకలు



# నియంత్రికలు మండుతున్నాయ్..!

చిత్తూరు : వేసవి మొదలుకాక ముందే ఎండ వేడిమి తీవ్రమవడంతో విద్యుత్తు డిమాండ్ మరింత పెరిగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విద్యుత్తు వినియోగం 172.02 మిలియన్ యూనిట్ల(ఎంయూ)కు చేరింది. లోవోల్టేజీ, అధిక లోడు తదితర కారణాలతో నియంత్రికలు మండుతున్నాయి. రైతులు, వినియోగదారులకు సమస్య తలెత్తకుండా మరమ్మతు చేసి వెంటనే అందజేసేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు.

జిల్లాలో ఫిబ్రవరి నెలలోనే 320 నియంత్రికలు దగ్ధమైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. వైకాపా హయాంలో విద్యుత్తుశాఖను అక్రమార్కులకు నిలయంగా మార్చిన నేతలు లైన్ల నిర్వహణ, అధిక లోడు, లోవోల్టేజీ సమస్యను అరికట్టడం తదితర విషయాలను గాలికొదిలేశారు. అవసరం లేని చోట ఉప కేంద్రాల ఏర్పాటు చేసి.. సమస్య ఉన్న ప్రాంతాల్లో కొత్త వాటి ఏర్పాటు పట్టించుకోలేదు. ఫలితంగా వేసవిలో



నియంత్రికలు దగ్ధమవుతున్నాయి.

సమస్య ఎక్కడంటే.. పెనుమూరు, పాలసముద్రం, గంగాధరనెల్లూరు, ఐరాల, పూతలపట్టు, ఐరాల మండలాలతో పాటు పలమనేరు తదితర ప్రాంతాల్లో పరివర్తకాలు అధికంగా దగ్ధమవుతున్నాయి. వాటిని చిత్తూరు, పలమనేరు, పుంగనూరులోని కేంద్రాలకు తరలించి నిర్దేశిత గడువులోగా మరమ్మతులు చేస్తున్నారు. అవసరమైన కాపర్ వైండింగ్ వైరు, ఆయిల్ తదితర ముడి వస్తువుల కొరత లేకుండా జాగ్రత్త పడుతున్నామని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు.

# ఇంటి నుంచి పనిచేస్తారా?

తిరుపతి : మీరు వర్క్ ఫ్రం హోం చేస్తున్నారా? మీకున్న సమస్యలేంటి? ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం కావాలి? రాష్ట్రంలో 18 నుంచి 50 ఏళ్లలోపు వయసు ఉండి, ఆధునిక సాంకేతిక అంశాలపై అవగాహన, విద్యార్హత కలిగిన వారికి వర్క్ ఫ్రం హోం ద్వారా మెరుగైన ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం సర్వే చేపట్టింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ సచివాలయాల సిబ్బంది వెళ్లి వారి వివరాలు సేకరిస్తున్నారు. ఈ నెల పదో తేదీలోగా సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఆపై కార్యాచరణ రూపొందించి అమలు చేయనుంది. తగిన విద్యార్హత ఉన్నవారు ఐటీ/ఐటీఈఎస్/ ఇతర అనుబంధ సంస్థల్లో పనిచేయడానికి ఆసక్తిగా ఉన్నారా? అనేది తెలుసుకోనున్నారు. వారు ఇంటి నుంచే పనిచేయడానికి ఎలాంటి సదుపాయాలు కావాలని అడుగుతున్నారు.

ఒకే ప్రాంతంలో ఎక్కువ మంది సుముఖంగా ఉంటే అలాంటిచోట ఒక సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటిలో 20 నుంచి 25 మంది పనిచేసేలా వసతులు కల్పించనుంది. సర్వే



పూర్తయ్యాక వివిధ ఐటీ సంస్థలను ప్రభుత్వం సంప్రదించనుంది. వర్క్ఫ్రం హోం విధానాన్ని విస్తృతపరచడానికి ప్రభుత్వం యత్నిస్తోంది. వివిధ సంస్థల ద్వారా ప్రస్తుతం ఇళ్ల నుంచి పనిచేస్తున్న వారినుంచి పలు వివరాలు సేకరిస్తోంది.

జిల్లాలో ఇప్పటి వరకు సర్వే చేసిన సచివాలయాలు: 691
సర్వే ముగిసిన వ్యక్తులు: 45,964 మంది
వర్క్ఫ్రం హోం చేస్తున్న వారిసంఖ్య: 1317 మంది

# అశాస్త్రీయం.. అవస్థలమయం

రాజమహేంద్రవరం : జిల్లాలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధుల విషయంలో అశాస్త్రీయంగా జరిగిన విభజన వల్ల కక్షిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. స్థిరాస్తి దస్త్రావేజుల(డాక్యుమెంట్ల) రిజిస్ట్రేషన్లకు వ్యయప్రయాసలు పడాల్సి వస్తోంది. ఏన్నో ఏళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ పరిధుల విషయంలో ఉన్న లోపాలు సరిచేయకపోవడంతో నేటికీ సమస్యగానే మిగిలింది. జిల్లాలో 12 సబ్రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా వీటిలో రోజుకు 250 నుంచి 300 వరకు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. కొందరు స్థిరాస్తి క్రయ,విక్రయదారులు కూడా తమ పరిధిలోని సబ్రిజిస్ట్రార్ కార్యాలయం దూరంగా ఉండటం.. రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి వెళ్లాలంటే దూరాభారం కావడంతో ఇబ్బందులు పడ్సాల్సి వస్తుందని అంటున్నారు.

**ఇదీ పరిస్థితి..**కడియం, రాజానగరం, సీతానగరం, పిడింగొయ్యి సబ్రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటు కాకముందు ఆయా ప్రాంతాల్లోని స్థిరాస్తులకు సంబంధించిన దస్తావేజుల రిజిస్ట్రేషన్లు రాజమహేంద్రవరంలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగేవి. 1995లో కడియం, సీతానగరం, రాజానగరంలో సబ్రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పడిన తర్వాత పరిధులు విభజన జరిగినప్పటి నుంచి ఆయా కార్యాలయాల పరిధిలోని స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు అక్కడే జరుగుతూ వస్తున్నాయి. 2007లో పిడింగొయ్యి సబ్రిజిస్ట్రార్ కార్యాలయాన్ని స్థానిక మోరంపూడి జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేయగా గాడాల, కాతేరు, కోలమూరు, మధురపూడి, నిడిగట్ల, తొర్రేడు, గోకవరం మండలంలోని శివరామపట్నం, పిడింగొయ్యి గ్రామాలను దీని పరిధిలోకి తీసుకొచ్చారు. ఆయా కార్యాలయాల పరిధుల విభజన శాస్త్రీయత లేకుండా అహేతుకంగా జరిగిందనే విమర్శలు గతంలోనే వచ్చినప్పటికీ సరిచేసే ప్రయత్నాలు ఇప్పటివరకు జరగలేదు.

**ఇలా చేస్తే మేలు..**శివరామపట్నం, మధురపూడిలను కోరుకొండ సబ్రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలోకి తీసుకొస్తే కక్షిదారులకు వ్యయప్రయాసలు తప్పుతాయి. రాజమహేంద్రవరం గ్రామీణంలోని శాటిలైట్సిటీ, మోరంపూడి, హుకుంపేట, బొమ్మూరు గ్రామాలు కడియం సబ్రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఉండటంతో ఈ గ్రామాల్లోని స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లకు అక్కడికి వెళ్లాల్సి వస్తోంది. అదే ఈ ప్రాంతాలను మోరంపూడి సమీపంలోని పిడింగొయ్యి సబ్రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోకి తీసుకొస్తే దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు వ్యయప్రయాసలు తప్పుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గం లోని డివిజన్లతోపాటు గ్రామీణ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే కొన్ని డివిజన్లు కలిసి మొత్తం 90 ప్రాంతాలు నగరంలోని అస్యూరెన్సుల జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఒరిజనల్ బ్రాంచి(ఓబీ) పరిధిలో ఉండటంతో ఇక్కడ ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరగడంతోపాటు సిబ్బందికి పని ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది.

# ఎవరా.. నకిలీ వైద్యులు..?



ధర్మవరం : కింగ్ జార్జి ఆసుపత్రి(కేజీహెచ్)లో నకిలీ వైద్యుల పేరిట బాధితుల నుంచి నగదు దోచుకున్న 'కిడ్నీ ముఠా' వ్యవహారాన్ని ఆసుపత్రి వైద్యులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. వెలుగులోకి వచ్చిన ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ పి.శివానంద నగర పోలీసు కమిషనర్ను కోరారు.ఇటీవల పెద్దాసుపత్రిలో జరుగుతున్న ఘటనలు కొంత ఆందోళన కలిగిస్తున్నాయి. ఆక్సిజన్ ప్లాంట్లో పైపులు కోసేయడం, ప్రసూతి విభాగంలో బిడ్డల తారుమారు ఘటనలు మరువకముందే మరో మోసం వెలుగు చూసింది. తాజా ఘటనలో కేజీహెచ్ వైద్యులమని నమ్మించిన వ్యక్తులు... బాధితుల్ని కేజీహెచ్కు రప్పించారు. దీంతో ఆసుపత్రికి చెడ్డపేరు తీసుకురావాలనే ఉద్దేశంతో, గుర్తుతెలియని వ్యక్తులు ప్రణాళికలు అమలు చేస్తున్నారేమోనని వైద్యాధికారులు అనుమానిస్తున్నారు.

**నిశిత పరిశీలన:** రూ.లక్షకే కిడ్నీ ఇస్తామని మోసం చేసిన వారిపై బాధితులు ఇప్పటికే వన్టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు... సీసీ ఫుటేజీలను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఆసుపత్రిలోని పిల్లల వార్డు, సూపరింటెండెంట్ కార్యాలయ పరిసరాల్లో సంచరించిన గుర్తుతెలియని వ్యక్తుల వివరాలపై ఆరా తీస్తున్నారు.

**మాయ మాటలతో బురిడీ:** కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడికి కేజీహెచ్ నుంచి కిడ్నీ ఇస్తామంటూ... మోసగాళ్లు మాయమాటలు చెప్పి బాధితుల్ని బురిడీ కొట్టించారు. సాధారణంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలన్నీ నిబంధనల ప్రకారమే జరుగుతాయి. జీవన్దాన్ ద్వారా బాధితుల పేర్లు నమోదు చేసుకుంటే, బ్రెయిన్డెడ్ అయిన వారి నుంచి కిడ్నీలు సేకరించి అందిస్తారు.

రోజూ 3 వేల మంది..!: ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి కేజీహెచ్లో ఓపీ విభాగాలకు రోజూ దాదాపు 3 వేల మంది రోగులు వస్తుంటారు. ఇన్పేషెంట్లుగా మరో 1500 మంది చికిత్స పొందుతుంటారు. వారితో పాటు రోగుల సహాయకులు ఉంటారు. నిత్యం వేల మంది సంచరించే కేజీహెచ్ ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

భద్రత పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నా... అవాంఛనీయ ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో భద్రతపై ఆసుపత్రి వర్గాలు మరింత దృష్టి సారించాల్సి ఉంది.

**కఠిన చర్యలు తప్పవు**

ఆసుపత్రికి చెడ్డపేరు తీసుకొచ్చేలా వ్యవహరించే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవు. కిడ్నీ ముఠాపై పోలీసులకు ఫిర్యాదు చేసి, విచారణ కోరాం. బయటి వ్యక్తులు చేసిన మోసంతో కేజీహెచ్కు సంబంధం లేదు. కేజీహెచ్లో వైద్యసేవలు, ఇతర సమాచారం కోసం ఎవరైనా 0891-2590100, 2590102 నంబర్లలో సంప్రదించాలి. కొత్త వ్యక్తుల ఫోన్కాల్స్కు, మెసెజ్లకు రోగులు, వారి సహాయకులు ఎవరూ స్పందించి, మోసపోవద్దు.- డాక్టర్ శివానంద, ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి

# నగరవనం.. అంతా ఆహ్లాదం



అనకాపల్లి : ఏటా పెరుగుతున్న పట్టణీకరణతో నగరాల్లో పచ్చదనం కనుమరుగవుతోంది. అభివృద్ధి పేరుతో తయారవుతున్న కాంక్రీట్ జంగిల్లో పట్టణవాసులు ఆహ్లాదానికి దూరమవుతున్నారు. పని ఒత్తిళ్లు, కాలుష్యం కారణంగా శారీరక, మానసిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యలకు పరిష్కారంగా పట్టణాలకు చేరువుగా నగరవనాలను అటవీ శాఖ అందుబాటులోకి తెస్తోంది. అనకాపల్లి నియోజకవర్గం కశింకోట వద్ద ఇప్పటికే శారదావనం ఏర్పాటు చేశారు. ఇందులో అడవి అందాలను ఆస్వాదించేలా సకల సదుపాయాలను సమకూర్చారు. కాంక్రీట్ జంగిల్ నుంచి పచ్చని వనాల మధ్యకు పట్టణ ప్రజలను ప్రకృతి ఆహ్వానించేలా ఈ వనాన్ని తీర్చిదిద్దారు. వీటికి అదనంగా ఎలమంచిలి, నర్సీపట్నం నియోజకవర్గాల్లో మరో రెండు వనాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఒక్కో నగరవనాన్ని రూ.2 కోట్ల అంచనా విలువతో అభివృద్ధి చేస్తున్నారు. పట్టణాలకు సమీపంలోని 70 నుంచి 120 ఎకరాల అటవీ భూములను ఈ వనాల కోసం ఉపయోగిస్తున్నారు. కశింకోట మండలం బయ్యవరం వద్ద కొండలను ఆనుకుని 120 ఎకరాల్లో శారదావనాన్ని అభివృద్ధి చేశారు. పచ్చని చెట్లు, ప్రకృతి మధ్య ఇంటిల్లిపాది సేదతీరేలా వన కుటీరాలు, పిల్లలు ఉత్సాహంగా ఆడుకునేందుకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటుచేశారు. యువత కోసం ట్రెక్కింగ్, యోగా, ధ్యానం, వ్యాయామం చేసుకునేలా సౌకర్యాలు కల్పించారు. త్వరలో ఎలమంచిలి సమీపంలోని ఎర్రవరం (వేమగిరి రిజర్వ్ ఫారెస్ట్) వద్ద, నర్సీపట్నం నుంచి గొలుగొండకు వెళ్లే మార్గంలో ఆరిలోవ అటవీ ప్రాంతాలను నగరవనాలుగా మార్చనున్నారు.

**ప్రకృతి పాఠం నేర్పేలా..**

పట్టణవాసులకు పచ్చదనంతో పాటు జీవవైవిధ్యం ప్రాధాన్యాన్ని వివరించేలా ఈ వనాలను తీర్చిదిద్దుతున్నారు. ప్రధాన ద్వారం నుంచి పగోడాలు, కాటేజీలు వరకు పూర్తిగా చెక్కతోనే తయారు చేశారు. ప్రకృతి ఒడిలో పాఠం నేర్పేవిధంగా అక్కడ భూమి సారం నుంచి మొక్కల విశిష్ఠతను వివరించేందుకు ఏర్పాట్లు చేశారు. అంతరించి పోయే చెట్ల జాతులను ఈ వనాల్లో నాటి సంరక్షించనున్నారు. భావితరాలకు అవగాహన కల్పించేలా పర్యావరణ అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నర్సీపట్నం అటవీ ప్రాంతంలో ప్రస్తుతమున్న ఔషధ మొక్కల పెంపక క్షేత్రం ధన్వంతరీ వనంలో 35 హెక్టర్లలో కొత్తగా నగరవనం అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడ సహజ అటవీ ప్రాంతం కావడంతో ఏడాది పొడవునా ఇక్కడ ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. కాలుష్యానికి దూరంగా పట్టణవాసులు సేద తీరేడానికి ఎంతో అనువైన ప్రాంతం కూడా.

**సహజ వాతావరణం అందించేందుకే...:** నగరవనాల ద్వారా పట్టణవాసులకు ప్రకృతి, పచ్చదనాన్ని చేరువచేస్తున్నాం. అడవి అందాలను వీక్షిస్తూ శారీరక, మానసిక ఆరోగ్యం పెంచుకునేందుకు వీలుగా వీటిని తీర్చిదిద్దుతున్నాం. ప్రకృతి పట్ల ప్రేమ, పర్యావరణ అవగాహన కల్పించేందుకు ఇవి దోహదపడతాయి.
-శామ్యూల్, జిల్లా అటవీ అధికారి

# నేతన్నకు మంచి రోజులు

ధర్మవరం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు చేయూత అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా వైకాపా ప్రభుత్వ హయాంలో రద్దు చేసిన థ్రిఫ్ట్ ఫండ్ పథకాన్ని పునరుద్ధరించింది. నిధులు సైతం కేటాయించింది. ప్రస్తుతం ఈ పథకానికి రూ.5 కోట్లు ఇవ్వగా.. అందులో సింహభాగం ఉమ్మడి అనంతకు దక్కనుంది. ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయనున్న చేనేత సహకార సంఘాలలో కార్మికులకు పథకంతో లబ్ధి చేకూరనుంది. కార్మికుడు సంపాదించిన సొమ్ములో 8 శాతం పొదుపు చేసుకుంటే... ప్రభుత్వం థ్రిఫ్ట్ ఫండ్ నుంచి 16 శాతం మేర కార్మికుల ఖాతాకు జమ చేయనుంది. మూడు నెలలకు ఒకసారి కార్మికుల ఖాతాల్లో సొమ్ము జమ కానుంది. దీంతో చేనేత మగ్గాలపై పని చేసే కార్మికులకు లబ్ధి చేకూరనుంది. గత వైకాపా పాలనలో రద్దు చేసిన థ్రిఫ్ట్ ఫండ్ పథకాన్ని ఇటీవల పునరుద్ధరించడంతో చేనేతల్లో ఆనందం వ్యక్తవుతోంది. ఉమ్మడి జిల్లాలో కొత్తగా 55 చేనేత సహకార సంఘాల ఏర్పాటుకు దరఖాస్తులు అందాయి. వాటిలో కొన్నింటికి అనుమతులు వచ్చాయి. శ్రీ సత్యసాయి జిల్లాలో ధర్మవరం, హిందూపురం, మడకశిర... అనంత జిల్లాలో యాడికి, పెద్దపప్పూరు, తాడిపత్రి, ఉరవకొండ, సిండికేట్నగర్ (అనంతపురం) తదితర ప్రాంతాల్లో కొత్త సంఘాలను ఏర్పాటు చేయనున్నారు.

**3 వేల మందికిపైగా..**

ఉమ్మడి జిల్లాలో సంఘాల ద్వారా 3 వేల మంది కార్మికులు లబ్ధి పొందనున్నారు. నెలకు చేనేత కార్మికుడు మగ్గం నేయడం ద్వారా రూ.20వేలు సంపాదిస్తే అందులో 8 శాతం (రూ.1600) పొదుపు చేస్తే థ్రిఫ్ట్ ఫండ్ పథకం ద్వారా 16 శాతం



ప్రభుత్వం జమ చేయనుంది. రూ.3200తో పాటు తాను పొదుపు చేసుకున్న రూ.1600 బ్యాంకు ఖాతా నుంచి ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. సంఘాల్లో సభ్యులుగా ఉన్న కార్మికులకు థ్రిఫ్ట్ ఫండ్ ఆర్థిక భరోసా ఇవ్వనుంది. ఉమ్మడి జిల్లాలో కుదేలైన చేనేత రంగానికి కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఊతం కానుంది.

# హెచ్చెల్సీకి పొంచి ఉన్న ముప్పు

ఉరవకొండ : తుంగభద్ర ఎగువ కాలువ(హెచ్చెల్సీ)లో నీటి ప్రవాహం ప్రమాదకర స్థాయిలో కొనసాగుతోంది. ఉరవకొండ మండల పరిసరాల్లోని కాలువలో దాదాపు 1600 క్యూసెక్కులు ప్రవహిస్తున్నాయి. ప్రధాన కాలువలో నింబగల్లు సమీపంలో రెగ్యులేటరీ గేట్లు మరమ్మతుకు గురయ్యాయి. దాంతో ఎక్కువ నీరు ప్రవహించేందుకు ఆటంకం ఏర్పడుతోంది. ఉరవకొండ మండలం రాయంపల్లి సమీపంలోని అండర్ టన్నెల్ వద్ద గట్టుపై నుంచి నీరు బయటకు పోతున్నాయి. ప్రవాహం ఇలాగే కొనసాగితే గట్టు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు, గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే అండర్ టన్నెల్ శిథిలం అయ్యింది. అధిక నీటి ప్రవాహానికి



అది కూలి పోతుందేమోనన్న భయాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఇక జీబీసీ సమీసంలో మరో అడుగు నీటి ప్రవాహం పెరిగినా గట్టు తెగిపోతుంది. ప్రధాన షట్టర్ వద్ద గట్టుకు పెద్ద రంధ్రం పడింది. షట్టర్లపై నుంచి నీరు వేగంగా దూకుతున్నాయి. నింబగల్లు వద్ద రెగ్యులేటరీ గేట్లను పైకెత్తితే ప్రవాహం తగ్గిస్తేనే పరిస్థితి అదుపులోకి వస్తుంది. గతంలో ఎన్నడూ లేనంతగా తాగునీటి అవసరాల నిమిత్తం ఈ సారి పీఏబీఆర్, ఎంపీఆర్ జలాశయాలకు నీటిని తరలిస్తున్నారు. ఈ విషయాన్ని హెచ్చెల్సీ దర్గాహొన్నూరు సెక్షన్ ఏఈఈ నిసారుద్దీన్ దృష్టికి తీసుకెళ్లగా అండర్ టన్నెల్ వద్ద గట్టు మీద నుంచి నీరు బయటికి పోకుండా మట్టి సంచులు ఏర్పాటు చేయిస్తామన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

# ఆగని ఇసుక అక్రమ రవాణా

ముదిగుబ్బ : ధర్మవరం నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. కూటమి ప్రభుత్వం ప్రజల కోసం తీసుకొచ్చిన ఉచిత ఇసుక పథకాన్ని నాయకులు సొమ్ముగా మార్చుకుంటున్నారు. ప్రధానంగా చిత్రావతి నది, మద్దిలేరు వాగు నుంచి చుట్టుపక్కల మండలాలు, నియోజకవర్గాలకు రాచమార్గాల్లోనే పెద్దఎత్తున అనుమతి లేకుండా తరలిస్తున్నారు. అడ్డుకోవాల్సిన రెవెన్యూ, పోలీసులు, మైనింగ్ శాఖాధికారులు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి.

**పట్టపగలే తవ్వేస్తున్నారు..**

నదీ పరివాహక ప్రాంతాల్లో చుట్టుపక్కల గ్రామాలవారు మాత్రమే ట్రాక్టర్లలో ఇసుక తీసుకెళ్లొచ్చన్నది ప్రభుత్వ నిబంధన. అయితే కొందరు నాయకులు బత్తలపల్లిలోని గర్శినపల్లి, సంగాల, ఉప్పర్లపల్లి సమీపంలో



నూ, ముదిగుబ్బలోని పీసీరేవు, బూదనాంపల్లి, బ్రహ్మదేవరమర్రి కొట్టాల, ఎస్.బండ్లపల్లి సమీపంలో నుంచి ఇసుక పెద్దఎత్తున తరలిస్తున్నారు. బూదనాంపల్లి, గర్శినపల్లి సమీపంలో ఏకంగా పొక్లెయిన్లతో తవ్వి పట్టపగలే తరలిస్తున్నారు. రాళ్లఅనంతపురం క్రాస్లో గతంలో చెక్పోస్టు ఉండేది. ప్రస్తుతం అది ఎత్తేయడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. ఇసుక టిప్పర్లలో నింపినందుకు ఒక్కోదానికి రూ. 6వేలు, ట్రాక్టర్ అయితే రూ.వెయ్యి చొప్పున వసూలు చేస్తున్నారు. ఇలా రోజుకు సుమారు 80నుంచి 100 టిప్పర్ల వరకు అక్రమ రవాణా జరుగుతోంది. ట్రాక్టర్లయితే వందకిపైగానే తరలిపోతోంది. ఒకవేళ అధికారులు వాహనాలను పట్టుకుంటే.. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో వదిలేస్తున్నారన్నా విమర్శలున్నాయి.

**నిఘా ఉంచుతాం**

ఇసుక అక్రమంగా రవాణా చేయకుండా ప్రత్యేక నిఘా ఉంచుతాం. విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లి అన్నిశాఖల సమన్వయంతో అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకుంటాం.- రామ్మోహన్, మైన్స్ ఏడీ

# నాణ్యమైన విద్యకు బాట

అనకాపల్లి : అనకాపల్లి జిల్లా వాసుల చిరకాల వాంఛ ఎట్టకేలకు నెరవేరింది. అనకాపల్లికి కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. అనకాపల్లి ఉడ్పేట పాఠశాల ప్రాంగణంలో గతంలో సిద్ధం చేసిన భవనాలు, తరగతి గదుల్లో 2024-25 విద్యా సంవత్సరం నుంచి తరగతులు ఆరంభిస్తారు. అనకాపల్లి మండలం సుందరయ్యపేట పంచాయతీ అచ్చియ్యపేటలో సర్వే సంఖ్య 511 కేటాయించిన పది ఎకరాల స్థలంలో శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టనున్నారు. అనకాపల్లిలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు 2016లో అప్పటి తెదేపా ప్రభుత్వం హయాంలో శ్రీకారం చుట్టారు. కేటాయించిన స్థలంలో రూ. 20 లక్షలతో వంతెన నిర్మాణాన్ని చేపట్టారు. ఈ స్థలంలో విద్యుత్తు స్తంభాల ఏర్పాటుకు కోసం రూ. 6 లక్షలు వెచ్చించారు. రూ. 9 లక్షలతో ప్రాంగణంలో తుప్పలు, వ్యర్థాలు తొలగించారు. స్థలంలో తొలగించిన చెట్లకు రూ. 4.20 లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు ప్రకటించారు. అక్కడ భవన నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. భవన సముదాయం సిద్ధమేతే దశల వారీగా ఇంటర్మీడియట్ వరకూ ఇక్కడ తరగతులు నిర్వహిస్తారు. అంతవరకూ ఉడ్పేట పాఠశాల ప్రాంగణంలోనే ఈ విద్యాలయాన్ని నిర్వహిస్తారు. ఇందుకోసం ఇక్కడ కూడా అవసరమైన సదుపాయాలు కల్పించాలి. రానున్న విద్యా సంవత్సరంలో ఐదో తరగతి వరకూ ఇక్కడ తరగతులు నిర్వహించనున్నారు. సుదీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్న కేంద్రీయ విద్యాలయం అనకాపల్లికి మంజూరు కావడంతో ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యావంతులు, తల్లిదండ్రులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇక్కడ తరగతులు ఆరంభమవుతాయని ఎంపీ సీఎం రమేశ్ వెల్లడించారు. విద్యాలయం మంజూరుపై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కూటమి నాయకులు దాడి వీరభద్రరావు, పీలా గోవింద, బుద్ధ నాగజగదీశ్వరరావు హర్షం ప్రకటించారు.

## హద్దులు చెరిపి.. ఏమార్చి..!

సూళ్లూరుపేట : అది చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి. దానిని ఆనుకొని రూ.కోట్ల విలువైన భూములున్నాయి. అవన్నీ పరిశ్రమలకు చెందినవే. వీటిని ఇంటి స్థలాలకు పనికి వచ్చే వ్యవసాయ భూమిగా దస్త్రాల్లో చూపి మార్కెట్ విలువను తగ్గించి రిజిస్ట్రేషన్ చేసేశారు. సూళ్లూరుపేట మండలం కోటపోలూరు రెవెన్యూ పరిధిలో చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి పక్కన ఏసియన్ పెరాక్సైడ్ లిమిటెడ్ పేరుతో 13.53 ఎకరాల భూమి ఉంది. 1986 ఏప్రిల్ 21న కంపెనీ యాక్ట్ 1956 ప్రకారం నమోదైంది. 2016 నుంచి పరిశ్రమను మూసేశారు. ఆ తర్వాత 2018 ఏప్రిల్ 5న ఏసియన్ పెరాక్సైడ్ లిమిటెడ్ పేరును ఏసియన్ పెరాక్సైడ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీగా మార్పు చేశారు. దీనికి కార్పొరేట్ ఐడెంటీ నంబరు యు24117 టీఎన్1986పీటీసీ012930 కేటాయించారు. ఈ పరిశ్రమకు చెందిన భూములు నోషనల్ ఖాతా నుంచి రెగ్యులర్ ఖాతాకు మార్చాలని సూళ్లూరుపేట ఆర్డీవో నుంచి కలెక్టరేట్‌కు ఫైలు కదిలింది. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ నోషనల్ ఖాతాలో భూములు ఉన్నా.. రిజిస్ట్రేషన్ చేయవచ్చని సాధారణ ఖాతాకు మార్పు చేయాల్సిన



అవసరం లేదని తేల్చారు. దీంతో గత నెలలో సూళ్లూరుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆ భూములను ఇంటి స్థలాలకు పనికి వచ్చేవిగా కనబరుస్తూ రిజిస్ట్రేషన్ చేసేశారు.

**ఆ విలువతోనే రిజిస్ట్రేషన్..**

కోటపోలూరు పంచాయతీలో నివాస స్థలాలు చదరపు గజం రూ.4 వేలు ఉండగా.. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పరిశ్రమల భూములను కారు చౌకగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అడంగల్‌లోనూ భూములు ఏసియన్ పెరాక్సైడ్ ఫ్యాక్టరీ పేరు మీద నమోదై ఉన్నాయి. అయితే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు ఇంటి స్థలాలకు పనికి వచ్చే వ్యవసాయ భూమి అంటూ పేర్కొని ఆ విలువతోనే పక్కాగా రిజిస్ట్రేషన్ చేసేశారు. సాధారణంగా హైవే పక్కన ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం రూ.6 వేల నుంచి 7వేలు ఉండగా... కేవలం గజం రూ.1800తో రిజిస్ట్రేషన్ చేయడం గమనార్హం. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో గండిపడుతోంది.

**నిబంధనల మేరకే చేశాం**

ఇంటికి పనికి వచ్చే వ్యవసాయ భూముల కింద నమోదు చేసి, ఆ విలువ మేరకు సదరు భూములకు నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేశాం. రోహిణి, ఎస్ఆర్, సూళ్లూరుపేట

## వంతెన అదురుతోంది.. గుండె బెదురుతోంది

నంద్యాల : ఉమ్మడి కర్నూలు జిల్లాలో వంతెనలు వణికిస్తున్నాయి. గత ఐదేళ్లుగా నిర్వహణలేకపోవడంతో ఎప్పుడు కూలిపోతాయే తెలియని పరిస్థితి నెలకొంది. కొన్ని శిథిలావస్థకు చేరగా.. మరికొన్నిటికి రక్షణ గోడలు కూలిపోయాయి. ఇంకొన్ని చోట్ల పిల్లర్లు నెర్రెలిచ్చి కుంగిపోయాయి. ఇవి ఇలా ఉంటే లోలెవెల్ వంతెనలు చిన్నపాటి వర్షాలకే మునిగిపోవడంతో రాకపోకలు స్తంభించిపోతు న్నాయి. వైకాపా పాలనలో వీటి మరమ్మతులపై దృష్టిపెట్టిన దాఖలాల్లేవు.. అధికారులు ప్రతిపాదనలు పంపించినా బుట్టదాఖలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి జిల్లాలో 78 వంతెనల స్థానంలో నూతన నిర్మాణాలు చేపట్టేందుకు ఆర్అండ్‌బీ అధికారులు రూ.200 కోట్లతో ప్రతిపాదనలు పంపారు.

**వెళ్తే మునుగుతారు**

నంద్యాల జిల్లాలో 72 లోలెవెల్ వంతెనల్లో 54, కర్నూలు జిల్లాలో 69 లోలెవెల్ కాజ్‌వేలపై 59 ప్రమాదకరంగా మారాయి. ఏటా వర్షాకాలంలో వీటిపై నీరు ప్రవహిస్తోంది. పలు గ్రామాలకు రాకపోలు



ఆగిపోతున్నాయి. పాణ్యం మండలం గోనవరం, మద్దూరు సమీపంలో లోలెవెల్ వంతెనలపై తరచూ రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఆత్మకూరు నియోజకవర్గంలో 9, నందికొట్కూరు 6, డోన్ 8, నంద్యాల 3, ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 9 చోట్ల ఇలాంటివి ఉన్నాయి. కర్నూలు జిల్లాలోని కోడుమూరు నియోజకవర్గంలో 8, ఆలూరు 7, పత్తికొండ 9, మంత్రాలయం 6, ఎమ్మిగనూరు నియోజక వర్గంలో 5 చోట్ల ఇలాంటి వంతెనలు భయపెడుతున్నాయి.

వీటిపై వెళ్లడం కష్టం

ఆదోని పట్టణంలో ఆకాశవంతెన శిథిలావస్థలో ఉంది.. ఇప్పటికే దీనిపై భారీ వాహనాల రాకపోకలు నిషేధించారు. దీన్ని పూర్తిస్థాయిలో ఆధునికీకరించాల్సి ఉన్నా నిధుల కొరత వేధిస్తోంది.

కర్నూలు జిల్లాలో 36, నంద్యాలలో 35 పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. పత్తికొండ నియోజకవర్గంలో 2, ఆదోనిలో 3, పెద్దకడుబూరులో 3, తుగ్గలి, ఆలూరు, చిప్పగిరి మండలాల్లో 2 చొప్పున పాత వారధులు పనికిరాకుండాపోయాయి.

సంజామల మండలం ముదిగేడు వద్ద వంతెన పూర్తిగా దెబ్బతింది. బండిఆత్మకూరుకు 4 కి.మీ దూరంలో ఓంకారం మార్గంలో ఉన్న వారధి కుంగిపోయి ప్రమాదకరంగా మారింది.

పాణ్యం మండలంలో రెండు, ఆళ్లగడ్డ మండలంలో వక్కిలేరు వాగుపై రెండు, రుద్రవరం, శిరివెళ్ల మండలాల్లోకి ఒక్కో వంతెన పూర్తిగా దెబ్బతిన్నాయి.

గోరెంట్ల వద్ద వంతెన కూలే స్థితిలో ఉంది. హాలహర్వి మండలం చింతకుంట వద్ద కుర్ర వంకపై వారధి శిథిలమైంది.

ఉమ్మడి జిల్లాలో వంతెనలు : 327

లోలెవెల్ కాజ్‌వేలు : 113

శిథిలమైన కట్టడాలు : 71

## మట్టి మింగేసి.. స్థిరాస్థికి బాటేసి



తిరుపతి : గుడిని, గుడిలోని లింగాన్ని మింగేసే స్థాయిలో భూబకాసురులు రామచంద్రాపురంలో పుట్టుకొస్తున్నారు. ఇక్కడ జడలు విప్పిన మైనింగ్ మాఫియా కొండలు, గుట్టలు కరిగించి మట్టి తరలించడమే కాకుండా.. ఆ స్థలాలను చదును చేసి అక్రమ స్థిరాస్తి వ్యాపారానికి బాటలు వేస్తోంది. రెవెన్యూ, గనుల శాఖ అధికారులకు ఈ వ్యవహారం తెలిసినా సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. రామచంద్రాపురం మండలం బొప్పరాజుపల్లి సమీపంలోని సత్రంమిట్ట, నెత్తకుప్పం రెవెన్యూ పరిధిలోని పిళ్లారికోన, సి.రామాపురం రెవెన్యూ, ఎల్‌వీపురంలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తున్నారు. రోజుకు 300 టిప్పర్లకు పైగానే గ్రావెల్ తరలుతోంది. ఆరేడు పొక్లెయిన్లు ఇందుకోసం వినియోగిస్తున్నారు. పిళ్లారికోనలో విశాఖలోని రుషికొండను తలపిస్తూ కొండను కొల్లగొడుతున్నారు. కొంత ఎర్రగా, నాణ్యంగా ఉంటే ఇటుక బట్టీలకు రవాణా చేస్తున్నారు. లేదంటే తిరుపతి నగరంలోని లేఔట్లకు పంపిస్తూ డబ్బులు పోగేసుకుంటున్నారు. ఒక్కో టిప్పర్‌కు రూ.3వేలు – రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నారు. మొత్తంగా రోజుకు రూ.10 లక్షలకుపైగా విలువైన మట్టి మాయమవుతోంది.

**కీలక నేతకు వాటాలు**

రామచంద్రాపురంలో మట్టి మాఫియా నుంచి నియోజకవర్గంలో కీలక నేతకు వాటాలు వెళ్తుండటంతో అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. స్థానికుల నుంచి పదేపదే ఫోన్లు వస్తే మాత్రమే అక్కడకు వెళ్లి కాసేపు హడావుడి చేస్తున్నారు. యంత్రాంగం వెళ్లగానే పొక్లెయిన్లు, టిప్పర్లు వచ్చేస్తున్నాయి. మా వాహనాలు సీజ్ చేసే ధైర్యం మీకుందా? అని రెవెన్యూ, గనులు, పోలీసు శాఖకు సవాలు విసురుతున్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయల విలువైన మట్టిని మింగేశారు. గతంలో వైకాపాలో ఉంటూ దందా సాగించిన నేతలు కొందరు ప్రస్తుతం కూటమి పార్టీల్లో చేరి దందా సాగిస్తున్నారు.

**అధికారులకు తెలిసినా..**

సత్రంమిట్ట, పిళ్లారికోన, సి.రామాపురం, ఎల్‌వీపురంలో అక్రమంగా తవ్వేస్తున్నారని అధికారులకు తెలిసినా మీనమేషాలు లెక్కిస్తున్నారు. అడిగితే అనుమతులున్న క్వారీల పర్మిట్లు చూపిస్తూ ఆ ముసుగులో మట్టి తరలిస్తున్నారు. ఇటీవల తహసీల్దారు వెంకటరమణ, ఆర్డీవో రామ్మోహన్ తూతూమంత్రంగా తనిఖీలు చేశారు. ఎల్‌వీపురం వద్ద టిప్పర్లు, పొక్లెయిన్ వెళ్లకుండా కందకం తవ్వినా ఐదు నిమిషాల్లోనే అక్రమార్కులు దాన్ని పూడ్చేస్తున్నారు.

**అనుమతులు ఇవ్వలేదు**

అక్రమంగా తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి పనులు నిలుపుదల చేశాం. గ్రావెల్ తవ్వకాలకు రెవెన్యూశాఖ పరంగా ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. ఒకవేళ ఇచ్చి ఉంటే చూపాలని కోరాం. వెంకటరమణ, తహసీల్దారు, రామచంద్రాపురం

## వ్యూహం అవశ్యం




శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఫిబ్రవరి 21వ తేదీ నుంచి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. భక్తులకు మెరుగైన వసతుల దృష్ట్యా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెవెన్యూశాఖ, దేవాదాయశాఖ మంత్రుల నేతృత్వంలో ఏర్పాట్లపై సమీక్ష జరుగుతోంది. గతంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా సామాన్య భక్తులకు సత్వరం, సంతృప్తికర దర్శనం అందుబాటులోకి తీసుకువస్తారన్న ఆశతో భక్తులందరూ ఆశలు పెట్టుకున్నారు.

**ప్రణాళికల అమలు తప్పనిసరి..**

బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా 25వ తేదీ శేషవాహనం, 26 మహాశివరాత్రి, 27 రథోత్సవం, 28 కల్యాణోత్సవం, మార్చి 2న గిరిప్రదక్షిణం, 4న పల్లకీసేవ రోజుల్లో రద్దీ అధికంగా ఉంటుంది. వీలైనమేర మహద్వార దర్శనానికి అనుమమించకుండా ఉంటే మేలు.

కొన్నేళ్లుగా లింగోద్భవం కోసం అర్ధరాత్రికే అందరూ ఆలయం వద్దకు చేరడం, క్యూలైన్లల్లో అనుమతించకపోవడం, తీరా కొన్ని మార్గాల్లో సిఫార్సులతో ఉన్న వాళ్లను అనుమతించడం వల్ల ఇబ్బందులు తప్పడం లేదు. దర్శనం అయినవారిని వెంటనే బయటకు పంపే ఏర్పాట్లు చేయాలి. గతంలో జరిగిన ఘటనలన్నీ దృష్టిలో ఉంచుకుని పాలకులందరూ భక్తులకు వీలైనంత మేర శీఘ్రంగా, సంతృప్తికర దర్శనం చేయించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తారని కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. శివరాత్రి రోజున ఉత్సవమూర్తులను బయటకు తీసుకువచ్చాక ఏటా క్యూలైన్లు స్తంభించిపోతున్నాయి. శివరాత్రి రోజున మహద్వారం ఆవలివైపున ఎక్కువ జనం ఉండిపోకుండా దర్శనం అయిన వాళ్లను వీలైనంత త్వరగా బయటకు తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేయాలి. స్వామి, అమ్మవార్ల ఆలయాల వద్ద ఏర్పాటు చేసే మహాలఘు దర్శనం నిలుపుదల కాకుండా కొనసాగించేలా ఏర్పాట్లు ఉండాలి. క్యూలైన్లు నిలిచి పోయినప్పుడు భక్తులకు తాగునీరు, మజ్జిగ, బిస్కట్లు అందుబాటులో ఉంచాలి. క్యూలైన్లు నిలిచినప్పుడు వివరాలను క్యూలైన్లల్లో భక్తులకు తెలియజేసే విధంగా ఏర్పాట్లు చేపట్టాల్సి ఉంది. శివరాత్రి రోజున అంత్రాలయ దర్శనాల కట్టడి చేయగల్గితే క్యూలైన్లు నిలిచే అవకాశం ఉండదు. చిన్నపిల్లల తల్లులు, వృద్ధులు, మధుమేహ వ్యాధిగ్రస్తులకు వీలైనంత త్వరగా దర్శనం చేయించే విధంగా క్యూలైన్లు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది.

## గూడు కట్టారు.. గోడు తీర్చారు



కర్నూలు : ఎమ్మిగనూరు పురపాలక పరిధిలో ఆప్షన్–3 కింద వెయ్యికిపైగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. వైకాపా హయాంలో పునాదులే పడలేదు.. ప్రస్తుతం ఆరు వందల వరకు పూర్తయ్యాయి.

డోన్ పట్టణ సమీపం దొరపల్లెగుట్టలో 1,553 ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో 762 ఇంటి నిర్మాణాలు పూర్తయ్యాయి. ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షల చొప్పున రూ.13 కోట్లకు పైగా ఖర్చుచేశారు.

పేదలందరికీ పక్కా గృహాలు అంటూ ఆర్భాటం చేసిన వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో 50 వేల ఇళ్లు నిర్మించలేకపోయింది. 'కూటమి' ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలల్లో 7,615 ఇళ్ల నిర్మాణాలు పూర్తవడం విశేషం. పేదలకు సొంతింటి కల నెరవేర్చాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పక్కా గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద ఇళ్ల నిర్మాణాల మంజూరుకు సర్వే చేయించడంతోపాటు గత ప్రభుత్వ హయాంలో పలు దశల్లో ఆగిపోయిన నిర్మాణాలు పూర్తి చేసేలా లబ్ధిదారులను ప్రోత్సహించింది. సకాలంలో బిల్లులు విడుదల చేస్తూ ఆసరాగా నిలిచింది.

**త్వరలో గృహ ప్రవేశాలు**

గతేడాది డిసెంబరులోనే సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలని లక్ష్యం పెట్టుకోగా అప్పటికి రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకపోవడంతో అప్పట్లో ఆగిపోయింది. ఆ తర్వాత సంక్రాంతి పండగకు మార్చారు. ఫిబ్రవరి ఒకటో తేదీన ముహూర్తం ఖరారు చేయగా.. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదా పడిన కార్యక్రమం త్వరలో చేపట్టనున్నారు.

**అవగాహన కల్పించి.. ఆచరణలో తీసుకొచ్చి**

ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖ అధికారులకు స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించింది. అధికారులూ క్షేత్రస్థాయిలో తిరిగి విస్తృతంగా అవగాహన కల్పించారు. ఒక్కో లబ్ధిదారుడికి రూ.1.80 లక్షల చొప్పున సాయం అందిస్తూ.. స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు మరో రూ.35 వేలు చొప్పున బ్యాంకు, స్త్రీనిధి నుంచి రుణ సదుపాయం కల్పించారు. నంద్యాల జిల్లాలో లబ్ధిదారులు తమ సొంత స్థలాల్లో 2,186 గృహాలు నిర్మించుకునేలా యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకుంది.

**నాడు 100.. నేడు 2,832**

కర్నూలు జిల్లాలో ఆప్షన్–3 కింద పది వేల ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని లక్ష్యం నిర్దేశించగా.. గత నాలుగేళ్ల కాలంలో రూ.100 కోట్ల మేర బిల్లులు చెల్లించినప్పటికీ గుత్తేదారులు వంద నిర్మాణాలు పూర్తి చేయలేదు. 'కూటమి' ప్రభుత్వం రాగానే వీటిపై దృష్టి సారించింది. ఆదోని అర్బన్‌లో రూ.50 లక్షలు పెండింగ్ బిల్లులు చెల్లించి గుత్తేదారులతో 2,012 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించారు. అదేవిధంగా ఆలూరులో 74, మంత్రాలయం 55, ఎమ్మిగనూరులో 691 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది.

## సౌకర్యాల్లేక సతమతం

కొత్తపల్లి : కొలనుభారతిలో వసంతపంచమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశామని అధికారులు చెబుతున్నా...భక్తులకు ఏటా కొన్ని ఇబ్బందులు తొలగడం లేదు. అమ్మవారిని దర్శించుకునేందుకు రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు వసతుల కల్పన సక్రమంగా ఉండటం లేదని విమర్శలు రేగుతున్నాయి. గతంలో తెదేపా హయాంలో నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టి గోపురం పనులు చేస్తున్న సమయంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు ముందుకు కదల్లేదు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అసంపూర్తి పనులను పూర్తి చేయాలని



భక్తులు కోరుతున్నారు. వసంతపంచమి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే జయసూర్య ఈ క్షేత్రం అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లానని, త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చారనడంతో ఆశలు చిగురిస్తున్నాయి. కనుమరుగవుతున్న కోనేరు: ఆలయ ప్రాంగణంలో ఉన్న చారుఘోషిణి కోనేరులో నీరు లేకపోవడంతో భక్తులు నిరుత్సాహ పడుతున్నారు. నిర్వహణలోపంతో కోనేరు ఆ దుస్థితికి చేరిందని భక్తులు ఆరోపిస్తున్నారు. మరుగుదొడ్లు మరమ్మతులకు గురైన నేపథ్యంలో వాటిని బాగుచేయా'లని భక్తులు కోరుతున్నారు.

## ప్రయోగం పరీక్షే

కర్నూలు : ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలకు సమయం ఆసన్నమైంది. వృత్తివిద్యా విద్యార్థులకుఈనెల 5వ తేదీ నుంచి.. జనరల్ విద్యార్థులకు 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇంటర్ విద్యలో ప్రయోగ పరీక్షలు ఎంతో ముఖ్యం. సమయం దగ్గర పడుతున్నప్పటికీ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని చాలా ప్రాంతాల్లో సన్నద్ధత కరవైంది. కొన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రయోగ గదులు, పరికరాలు దుమ్ము పట్టాయి. కళాశాలల్లో విద్యార్థుల చేత నిత్యం ప్రయోగ పరీక్షలు చేయించాల్సి ఉన్నా తరగతులు సరిగా నిర్వహించ లేదన్న విమర్శలున్నాయి. ప్రయోగాల కోసం అవసరమయ్యే రసాయనాలూ అరకొరగా ఉండటం గమనార్హం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 43 ప్రభుత్వ జూనియర్ కళాశాలలతోపాటు కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రైవేటు, జూనియర్ కళాశాలలు కలిపి 239 ఉన్నాయి. కర్నూలు జిల్లాలో ఇంటర్మీడియట్ రెండో ఏడాది.. బైపీసీ, ఎంపీసీ, ఎంఈసీలో 15,191 మంది, హెచ్‌ఈసీ, సీఈసీలో 5,762 మంది విద్యార్థులు చదువుతున్నారు.



నంద్యాల జిల్లాలో బైపీసీ, ఎంపీసీ, ఎంఈసీలో 9,560, హెచ్‌ఈసీ, సీఈసీలో 3,993 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు.

భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, వృక్ష, జంతు శాస్త్ర సబ్జెక్టులకు సంబంధించిన ప్రయోగ పరీక్షలను ఒకేషనల్ విద్యార్థులకు ఈనెల 5వ తేదీ నుంచి, జనరల్ సైన్సు విద్యార్థులకు 10వ తేదీ నుంచి నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

**దుమ్ముపట్టిన పరికరాలు**

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని ప్రయోగశాలల్లో పలు సమస్యలు వేధిస్తున్నాయి. కొన్నిచోట్ల పరికరాలు నెలల తరబడి వాడకపోవడంతో దుమ్ము పట్టిపోయాయి. బనగానపల్లి, సంజామల, ఓర్వకల్లు, మిడుతూరు, పత్తికొండతోపాటు 28 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రయోగాలకు సంబంధించిన రసాయనాలు లేవని అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రయోగ పరీక్షల నిమిత్తం ఒక్కో విద్యార్థికి వృక్ష శాస్త్రానికి రూ.2, రసాయన శాస్త్రం రూ.4, జంతు శాస్త్రం రూ.2, భౌతిక శాస్త్రానికి రూ.2ను ప్రభుత్వం కేటాయించింది. అయినా చాలా కళాశాలల్లో అవసరమైన రసాయనాలు తదితరాలు కొనుగోలు చేయలేదు.

## రూ.1.82 కోట్ల పల్లె నిధి పక్కదారి



నంద్యాల: పల్లె ప్రగతికి కేటాయించిన నిధులను ఆ గ్రామ ప్రథమ పౌరుడే పక్కదారి పట్టించారు. రుద్రవరం పంచాయతీలో అక్రమాలు జరిగినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో విచారణకు ఆదేశించారు. పంచాయతీ పరిధిలో 2021 నుంచి 2025 వరకు రూ.1 ,11, 34,909 నిధులు దుర్వినియోగమైనట్లు డివిజినల్ పంచాయతీ అధికారి ఎన్.రాంబాబు తేల్చారు. ఎలాంటి తీర్మానాలు లేకుండానే పనులు చేయడం.. సాధారణ నిధులతో చేసిన పనులకు రశీదులు లేనట్లు గుర్తించారు. కొన్నింటికి తీర్మానాలు చేసి నకిలీ బిల్లులు పొందుపరిచారు. అదేవిధంగా 14, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.71,04,621 దుర్వినియోగమైనట్లు తేల్చారు. గ్రామంలో కబేళా, వార సంత, మార్కెట్ వేలాలకు సంబంధి ంచి 2021 నుంచి 2024 వరకు రూ.32,56,900 ఆదాయం రాగా, వేలం పాడుకున్నవారు రూ.26,97,100 చెల్లించారు. " సర్పంచి బైరి విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు ఎం.సుబ్బారాయుడు, ఎన్.భాగ్యలక్ష్మి, అక్తర్ మొహ్మద్ రఫీ, పట్నం చెన్నయ్య, వెంకట సుబ్బరాయుడు కారణమని.. అన్ని రకాలు కలిపి రూ.1,82,39,530 పక్కదారి పట్టినట్లు.. వేలం పాటదారుల నుంచి రూ.5,95,800 రావాలని" నివేదికలో తేల్చారు.

## పాఠశాలల కూర్పులో మార్పులు

అనకాపల్లి : గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117తో దారి తప్పిన విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆ జీవోకు ప్రత్యామ్నాయంగా పాఠశాలల కూర్పులో మార్పులు తీసుకువచ్చేలా కసరత్తు చేస్తోంది. ఇదివరకు ఉన్నత పాఠశాలల్లో విలీనమైన 3, 4, 5 తరగతులను వెనక్కి తీసుకొచ్చి ప్రాథమిక విద్యకు ఊపిరిపోయనుంది. పంచాయతీకి ఒక ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా మార్చనున్నారు. ఉమ్మడి జిల్లాలో 190 వరకు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది జూన్ నుంచి మొదలయ్యే విద్యా సంవత్సరంలో ఐదు రకాల బడుల విధానం అమలు చేయబోతున్నారు.

**ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు ఇలా...** పంచాయతీ కేంద్రాల్లో ప్రస్తుతమున్న ప్రాథమిక పాఠశాలల్లో ఎక్కడైతే 60 మంది కంటే ఎక్కువ పిల్లలు ఉన్నారో ఆ పాఠశాలను ఆదర్శ ప్రాథమిక పాఠశాల (మోడల్ ప్రైమరీ స్కూల్)గా మార్చనున్నారు. ఇలాంటి పాఠశాలకు అయిదు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మంజూరు చేయనున్నారు. మిగతా ప్రాథమిక



పాఠశాలలకు ఇద్దరు ఉపాధ్యాయులే ఉంటారు.

అనకాపల్లి జిల్లాలో ప్రస్తుతం 64 పాఠశాలల్లో విద్యార్థులు 60 మంది దాటి ఉన్నారు. అలాగే 153 హైస్కూళ్లలో 3, 4, 5 తరగతుల విద్యార్థులను వెనక్కి తీసుకొచ్చి సమీప ప్రాథమిక పాఠశాలల్లో చేర్చితే మరిన్ని మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటుకు అవకాశం ఉంటుందని విద్యా శాఖ అధికారులు చెబుతున్నారు. విశాఖ జిల్లాలో ప్రస్తుతం 121 ప్రాథమి పాఠశాలల్లో 60 మందికిపైగా విద్యార్థులున్నారు. వీటిలో పంచాయతీ కేంద్రంలో ఉన్నవాటినే మోడల్ ప్రైమరీ సూళ్లగా ఎంపిక చేయనున్నారు. జీవీఎంసీ పరిధిలో ప్రతివార్డులోనూ ఒకదాన్ని ఆదర్శ పాఠశాలగా మార్చడానికి అవకాశం ఉంది.

**ప్రాథమికోన్నత పాఠశాలల ఉన్నతికి..**

కొత్త విధానంలో ప్రాథమికోన్నత పాఠశాలలు కనుమరుగయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న యూపీ పాఠశాలల్లో 6, 7, 8 విద్యార్థులు 60 మంది కంటే ఎక్కువ ఉండి 3 కి.మీ పరిధిలో హైస్కూల్ లేకుంటే ఆ యూపీ పాఠశాలనే ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. అనకాపల్లి జిల్లాలో 13 పాఠశాలలు, విశాఖలో ఎనిమిది యూపీ స్కూళ్లను హైస్కూళ్లగా మార్చడానికి ప్రతిపాదించే అవకాశం ఉంది. 60 కంటే తక్కువ ఉన్న యూపీ పాఠశాల విద్యార్థులను సమీప హైస్కూళ్లకు పంపించనున్నారు. ఈ మార్పులు, చేర్పులపై కసరత్తు ముమ్మరంగా జరుగుతోందని అనకాపల్లి, అల్లూరి జిల్లాల డీఈవోలు అప్పారావునాయుడు, బ్రహ్మాజీరావు చెబుతున్నారు.

## ఇక రబీవంతు

పి.గన్నవరం : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రబీ ఆయకట్టుకు సాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా జలవనరులశాఖ ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తూర్పుడెల్టాలో నుంచి, మధ్య డెల్టా(సెంట్రల్‌డెల్టా)లో ఫిబ్రవరి 3 నుంచి వంతులవారీ విధానంలో నీరివ్వాలని నిర్ణయించారు. లాకు నుంచి లాకు మధ్యలో ఉన్న ఆయకట్టును పరిగణలోకి తీసుకుంటారు. ఉమ్మడి జిల్లాలో 32 లాకులు (మధ్యడెల్టాలో 12, తూర్పులో 20) ఉన్నాయి. నవంబరులో తూర్పు, కాకినాడ, కోనసీమ జిల్లాలవారీగా జరిగిన సాగునీటి సలహామండలి(ఐ.ఎ.బి.) సమావేశాల్లో రబీలో నూరుశాతం వరి ఆయకట్టుకు సాగునీటి సరఫరా చేస్తామని అధికారికంగా వెల్లడించారు.

**శివారుకు అందే దారేదీ..**

సాధారణంగా డిసెంబరు నుంచి రబీ సీజన్ మొదలై మార్చి 31 నాటికి పూర్తికావాలి. ఏటా మాదిరిగానే ఈ దఫా సైతం గతితప్పింది. ప్రధానంగా మధ్యడెల్టా అయిన కోనసీమలో నేటికీ రబీ నాట్లు కొనసాగుతున్నాయి. ఏప్రిల్ మాసాంతానికి గాని సీజన్ పూర్తికాదు.



ఈ నేపథ్యంలో ఏప్రిల్ 21 వరకు వంతులవారీ విధానం అమలు చేస్తారు. కాజులూరు, కరప, తాళ్లరేవు, రామచంద్రాపురం, కె.గంగవరం, ఐ.పోలవరం, ముమ్మిడివరం, అల్లవరం, కాట్రేనికోన, మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో సుమారు 50 వేల ఎకరాల ఆయకట్టు కాలువలకు శివారులో ఉంది. వంతులవారీ విధానంలో నీరు సరఫరా చేసినప్పటికీ శివారు ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బందులు పడిన సందర్భాలు ఉన్నాయి. అలాంటి అనుభవాలను పరిగణలోకి తీసుకుని ఈ రబీలో ప్రతి ఎకరానికి పుష్కలంగా సాగునీరు అందించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

**ఒక క్యూసెక్కు 107 ఎకరాలకు..**

ప్రస్తుతం ఒక క్యూసెక్కు నీరు 107 ఎకరాలకు సరిపడేలా ఇస్తున్నారు. ఈ లెక్కన శుక్రవారం ధవళేశ్వరం బ్యారేజి నుంచి తూర్పుడెల్టాకు 2472, మధ్యడెల్టాకు 1608, పశ్చిమడెల్టాకు 4,300 క్యూసెక్కుల నీటిని రబీచేలకు సరఫరా చేస్తున్నారు. వంతులవారీ విధానంలో ఇంచుమించుగా ఇలానే అమలుచేసే అవకాశం ఉంది. మార్చి, ఏప్రిల్‌లో నీటిలభ్యత పడిపోతే ప్రత్యామ్నాయం అవసరమవుతుంది. జలవనరులశాఖ ధవళేశ్వరం సర్కిల్ ఎస్.ఇ.కె.గోపీనాథ్ మాట్లాడుతూ ప్రతి ఎకరానికి ఇబ్బంది లేకుండా సాగునీరు ఇస్తామన్నారు. శివారు ఆయకట్టుపై ప్రత్యేక దృష్టిపెడతామని తెలిపారు.

# భూములకు కొత్త విలువలు



అనంతపురం : వరుసగా రెండు పర్యాయాలు వాయిదా పడిన భూముల విలువల పెంపు నిర్ణయం ఎట్టకేలకు నుంచి అమలు కానుంది. ఈ మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. భూముల విలువలను ఆనవాయితీగా పెంచాలని గత ఏడాది నవంబరు నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించింది. రెండు పర్యాయాలు ఈ నిర్ణయాన్ని వాయిదా వేశారు. మూడోసారి భూముల విలువను పెంచడానికి ఎట్టకేలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం నుంచి కొత్త విలువల ప్రకారం దస్తావేజు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా భూముల విలువలు పెంచారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో ఏడు పర్యాయాలు భూముల విలువలు పెంచి ప్రజల నడ్డివిరిచిన సంగతి తెలిసిందే. రెండేళ్ల క్రితం భారీగా భూముల విలువలను పెంచడం వల్ల భూముల క్రయవిక్రయాలు కుదేలయ్యాయి. గత ప్రభుత్వంలో విలువలు భారీగా పెంచారు. ఫిబ్రవరి ఒకటి నుంచి కొత్త విలువలు అమల్లోకి రానున్నాయి. ప్రజల నుంచి కూడా ఎలాంటి అభ్యంతరాలు కూడా రాకపోవడంతో విలువల పెంపునకు మార్గం సుగమమైంది. భూముల విలువలను గతంలో ఎడాపెడా పెంచడంతో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయింది. భూముల అమ్మకాలు చేయడానికి ఎంతోమంది ముందుకొస్తున్నా కొనుగోలు చేయడానికి ఎవరూ మొగ్గు చూపడం లేదు. రిజిస్ట్రేషన్ల సంఖ్య భారీగా తగ్గింది. కూటమి ప్రభుత్వం శనివారం నుంచి కొత్త ధరలు అమలు చేయడానికి రంగం సిద్ధం చేశారు. గతంలో 2019, 2023 సంవత్సరాల్లో భారీగా పెంచిన భూముల విలువల జోలికి ఈసారి వెళ్లలేదు. గతంలో అసలు పెంచని భూములకు విలువలు కొద్దిగా సవరించారు.

రిజిస్ట్రేషన్ల శాఖకు ఈ ఆర్థిక సంవత్సరంలో భారీగా ఆదాయ లక్ష్యాలను నిర్దేశించారు. వైకాపా ప్రభుత్వం ముందుచూపు లేకుండా అసాధారణంగా లక్ష్యాలు కేటాయించింది. ఈ లక్ష్యాలకు చేరువ కావాలంటే ఎంతోకొంత భూముల విలువలు పెంచక తప్పలేదు. ఈ ఆర్థిక సంవత్సరానికి అనంతపురం జిల్లాకు రూ. 469.65 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాకు రూ. 248.54 కోట్లు ఆదాయం సాధించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. గత నెల వరకు నిర్ణయించిన లక్ష్యాల్లో 50 శాతమే ఛేదించారు.

**స్వల్పంగానే ధరలు సవరించాం..**

– జి.భార్గవ్, జిల్లా రిజిస్ట్రార్

భూముల రిజిస్ట్రేషన్ విలువలు ఈసారి స్వల్పంగా సవరించాం. గతంతో పోల్చితే చాలా స్వల్పంగానే ధరలు సవరించాం. ఈ పెంపు 10 నుంచి 20 శాతం లోపే ఉంది. కొత్త ధరలు శనివారం నుంచి అమలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త విలువలు పెంపునకు సంబంధించి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం.

## వ్యవసాయాభివృద్ధికి సహకార వ్యవస్థ



అనంతపురం : సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేస్తే వెనుకబడిన ప్రాంతాల్లో రైతులకు తోడ్పాటు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)ను రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాలు (ఎఫ్‌పీఓ) గా రూపొందించాలని నిర్ణయించింది. తొలి విడతలో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లా (డీసీసీబీ) పరిధిలోని కలుగోడు, శ్రీధరగట్ట, చిన్నపప్పూరు, దిగువపల్లి, బండ్లపల్లి, సోమందేపల్లి పీఏసీఎస్‌లను ఎఫ్‌పీఓలుగా తీర్చిదిద్దేలా కార్యాచరణ ప్రారంభించారు.

**ఎన్‌సీడీసీ పథక ప్రయోజనాలు :** వ్యవసాయ ఉత్పత్తులు, ఆహార ధాన్యాల ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్, నిల్వల కోసం కార్యక్రమాల ప్రణాళికలు, రుణ సదుపాయం, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ యంత్రాలు తదితర అన్నీ రకాల కార్యక్రమాలు చేపట్టి పీఏసీఎస్‌లను ఆదర్శంగా తీర్చిదిద్దనున్నారు.

**ప్రోత్సాహక నిధులు**

ఎన్‌సీడీసీ పథకంలో భాగంగా ఎంపికైన సొసైటీల్లో సాధారణ సమావేశాలు నిర్వహించి ఎఫ్‌పీఓలుగా కార్యకలాపాలు నిర్వహించేలా అధికారులు తగు చర్యలు చేపట్టారు. ఒక్కో సంఘానికి ప్రోత్సాహక నిధులు రూ.15 లక్షలు చొప్పున, మూడేళ్లపాటు కార్యకలాపాల నిర్వహణ తదితర కార్యక్రమాలకు రూ.18 లక్షల చొప్పున మంజూరు చేస్తారు. మౌలిక వసతుల కల్పనకు రూ.30 లక్షలు రుణంగా ఇవ్వనున్నారు. ఈ పథకంలో భాగంగా ఎంపికైన సొసైటీల్లో ఇప్పటికే తీర్మానాలు కూడా సేకరించారని, పీఏసీఎస్‌లను ఎఫ్‌పీఓలుగా మార్చే ప్రక్రియ ప్రారంభం అవుతుందని అధికారులు తెలిపారు.

**వెనుకబడిన ప్రాంత రైతులకు అనుకూలం**

జిల్లాలోనే అత్యంత వెనకబడిన గుమ్మఘట్ట మండలంలోని కలుగోడు పీఏసీఎస్ సొసైటీ ఎంపిక కావటం వల్ల ఇక్కడి రైతులకు అనుకూలంగా ఉంటుంది. వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందించినట్లు ఉంటుంది. ఉన్నతాధికారుల సహాయ సహకారాలతో ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకునేలా చూస్తాం. – శ్రీనివాసులు, సీఈఓ, కలుగోడు పీఏసీఎస్

## అస్తవ్యస్తంగా మురుగు కాలువల వ్యవస్థ



గుంతకల్లు : సమగ్ర మురుగు కాలవల వ్యవస్థ ఏర్పాటు కాకపోతే గుంతకల్లుకు చెందిన మురుగు శుద్ధి ప్లాంట్‌ను నిర్మించినా పెద్దగా ప్రయోజనం ఉండదు. ప్రస్తుతం ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం అధికారులు రూ. 26 కోట్లతో మురుగు నీటిని శుభ్రం చేసే ప్లాంటు పనులను జోరుగా సాగిస్తున్నారు. పట్టణంలో వెలువడే మురుగునంతా ప్లాంటు వద్దకు చేరవేయాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది. ప్రస్తుతం కొన్ని మురుగు కాలువలకు చెందిన మురుగు కృష్ణాజలాలు ప్రవహించే గుత్తి కాలువలోకి వదులుతున్నారు. కొంత మురుగు నీటిని ఆలూరు రోడ్డు పక్కనున్న రైతుల పొలాల్లోకి వదులుతున్నారు. ఫలితంగా రైతులు పంటలు సాగు చేసుకోలేకపోతున్నారు. భాగ్యనగర్‌లోని కొత్తకొట్టాల నుంచి వచ్చే మురుగు షికారీ కాలనీలోకి వదులుతుంటే వారు మురుగు కాలువల పక్కన నివాసముంటూ అవస్థ పడుతున్నారు.

**పక్కా ప్రణాళిక ఏదీ?**

గుంతకల్లులో ఒక్క మురుగు కాలువ కూడా సక్రమంగా లేదు. మురుగంతా ప్రధాన కాలువ గుండా ప్రవహించడం లేదు. సమగ్రమైన మురుగు కాలువల వ్యవస్థను ఏర్పాటు చేయాలని గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలోనే ప్రత్యేక ఇంజినీర్ల బృందం సమగ్ర సర్వే చేసింది. దాదాపు 200 కి.మీ.లు కాలువలను నిర్మించడానికి రూ. 289 కోట్లు ఖర్చవుతుందని ప్రణాళికను రూపొందించి మున్సిపాలిటీకి అందజేసింది. దీన్ని 2018లో మున్సిపల్ కౌన్సిల్ ఆమోదించింది. అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ పథకం కింద కేటాయించాలని కౌన్సిల్ కోరుతూ తీర్మానాన్ని ఆమోదించి ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ప్రణాళిక గురించి ఏమాత్రం పట్టించుకోలేదు.

గుత్తి మున్సిపాలిటీలో సమగ్ర మురుగు కాలువల వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో అధికారులు నాలుగేళ్ల కిందట సర్వే చేశారు. కాలువలను పూర్తి స్థాయిలో నిర్మించడానికి రూ. 40 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. రూపొందించిన ప్రణాళిక మరుగున పడిపోయింది. గుత్తిలో మురుగు కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.

**నివేదికను బయటకు తీస్తాం**

– నయీం అహమ్మద్, మున్సిపల్ కమిషనర్

గుంతకల్లులో సమగ్ర మురుగు కాలువల వ్యవస్థ ఏర్పాటుకు రూపొందించిన నివేదిక ప్రస్తుతం ఎక్కడుందో తెలియడం లేదు. నివేదికను బయటకు తీసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తాం. మురుగు శుద్ధి ప్లాంట్ పనులు పూర్తయ్యేలోగా కాలువల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తాం.

## పచ్చదనంపై గొడ్డలి వేటు

తాడిమర్రి : అడవుల రక్షణే ధ్యేయంగా ప్రభుత్వాలు కృషి చేస్తుంటే కొందరు అక్రమార్కులు మాత్రం చెట్లను నరికి కలప విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ముదిగుబ్బ, తాడిమర్రి, నల్లమాడ, కదిరి ప్రాంతంలో కలప అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పట్టణాల్లో కలపకు మంచి డిమాండ్ ఉంది. పెద్దఎత్తున భవన నిర్మాణాలు చేపడుతున్న నేపథ్యంలో తలుపులు, కిటికీలు, గృహోపకరణాలకు వాటిని వినియోగిస్తున్నారు. డిమాండ్ పెరగడంతో అడవుల్లో చెట్లను నరికేస్తున్నారు. ఎవరైనా అడ్డగిస్తే రైతుల పట్టా భూముల్లోని చెట్లను తరలిస్తున్నామని బుకాయిస్తూ.. రవాణా సాగిస్తున్నారు. గత నాలుగు నెలల నుంచి ఈ దందా సాగుతోంది.

**హైవే దగ్గర అక్రమంగా నిల్వలు..** రైతుల భూముల్లో నీలగిరి, సిగర, సరవ, సుబాబుల్ చెట్లు ఉంటే అమ్ముకోవచ్చనేది నిబంధన ఉంది. అయితే కలప వ్యాపారులు సమీపంలోని అటవీ ప్రాంతంలోని చెట్లను నరికి తీసుకెళ్తున్నారు. రైతులకు కొంత డబ్బులు ముట్టచెప్పి వారి పేరుపై తరలిస్తున్నారు. ముదిగుబ్బ, నల్లమాడతోపాటు సమీపంలో పులివెందులలోని సింహాద్రిపురం నుంచి కలప అక్రమంగా తీసుకొచ్చి ముదిగుబ్బ బైపాస్ దగ్గర నిల్వ చేస్తున్నారు.

## రామవరంలో 'భూ మాయ'

పి.గన్నవరం: ఆనందపురం మండలం రామవరంలో 'భూ మాయ' జరిగింది. 20 ఏళ్ల కిందట మేకల పెంపకం కోసం 8 ఎకరాలను నిబంధనలకు విరుద్ధంగా పేదలకు కేటాయించారు. ఆయా భూములకు జిల్లా యంత్రాంగం ఫ్రీహోల్డు చేసి యాజమాన్య హక్కులు కల్పించింది. ఇప్పుడు ఆ భూములు చేతులు మారినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంలో వైకాపా నేతల పాత్ర ఉన్నట్లు సమాచారం. ఇటీవల ఫ్రీహోల్డు భూములపై అధికారులు పునర్విచారణ చేసిన సమయంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆయా భూముల విషయంలో ఏం చేయాలనే అంశంపై జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. అవసరమైతే ఫ్రీహోల్డు నుంచి ఆయా



భూముల్ని మినహాయించి వెనక్కి తీసుకొనే విషయాన్ని జిల్లా యంత్రాంగం పరిశీలిస్తోంది. జిల్లాలో ఆనందపురం, పద్మనాభం, భీమునిపట్నం, పెందుర్తి మండలాల పరిధిలో 625 ఎకరాలను ఫ్రీహోల్డు చేశారు. వాటిల్లో 125 ఎకరాల వరకు చేతులు మారినట్టు సమాచారం. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫ్రీహోల్డు భూములపై పునర్విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే రామవరం గ్రామంలోని సర్వే సంఖ్య 37/12, 6, 14, 15ల్లో 7.55 ఎకరాలు, పాలవలస గ్రామంలో 45 సెంట్లు వెరసి 8 ఎకరాల భూముల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇక్కడ ఎకరం భూమి బహిరంగ మార్కెట్‌లో రూ.5 కోట్లు వరకు పలుకుతోంది. ఈ లెక్కన 8 ఎకరాల విలువ రూ.40 కోట్లు ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

## పుష్కరాలకు అఖండ రేవు

రాజమహేంద్రవరం : పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఘాట్లను అనుసంధానం చేసేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. పుష్కరాలకు ఎలాగూ రేవుల(ఘాట్ల)ను ఆధునికీకరించాల్సి ఉంది. అదే సందర్భంలో అన్ని ఘాట్లను ఏక మొత్తంగా కలపడం ద్వారా ఒకేసారి ఎక్కువ మంది పుణ్యస్నానాలు చేసేందుకు ఆస్కారం ఉంటుంది. ఒక ఘాట్ నుంచి మరో దానికి చేరేందుకు అనువైన మార్గం ఏర్పాటు చేయడం ద్వారా బయట రద్దీని నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. రూ.300 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక అందించారు. అఖండ గోదావరి తీరం కలిగిన రాజమహేంద్రవరానికి పుష్కర వేళ భక్తులు పోటెత్తుతారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని గత పుష్కరాలకు కోటిలింగాల రేవును విస్తరించారు. అంతకు ముందు కేవలం 230 మీటర్ల మేర ఉండే ఘాట్‌ను రూ.9 కోట్లతో 1.2 కిలోమీటర్ల మేర నిర్మించారు. దీనిపై గంటకు 80 వేల మంది స్నానాలు ఆచరించారు. గత(2015) పుష్కరాలకు సుమారు మూడు కోట్లమంది వస్తే కోటిన్న




రకు పైగా ఈ రేవులోనే స్నానాలు ఆచరించారు. 2027 పుష్కరాలకు ఎనిమిది కోట్ల మందికి పైగానే భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రేవులను ఆధునికీకరించడం కంటే విస్తరించడంపైనే దృష్టి సారించాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం రేవుల మధ్య కట్టడాలున్నాయి. ఈ నేపథ్యంలో అవకాశం ఉన్నంత వరకూ వాటిని తొలగించనున్నారు.

**అంతా పుష్కరఘాటే..**

ధవళేశ్వరం నుంచి కాతేరు వరకూ రేవులను అనుసంధానం చేయనున్నారు. మొత్తం 17 రేవులను గుర్తించారు. వీటి అనుసంధానం ద్వారా 7.1 కిలోమీటర్ల మేర ఘాట్ల పరిధి పెరుగుతుంది. వీటిపై రోజుకు 75 లక్షల మంది స్నానాలు ఆచరించగలరని అంచనాలు రూపొందించారు. తద్వారా పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీని నియంత్రించగలమని ప్రణాళికలు రూపొందించారు. గతంలో జరిగిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అన్ని రేవులను కలిపి పుష్కర ఘాట్‌గానే ఈసారి నామకరణం చేయాలని నిర్ణయించారు. తద్వారా భక్తులు ఎక్కడైనా స్నానాలు చేసేందుకు ఆస్కారం ఉంటుంది.

## ఏం కష్టమొచ్చిందో.. ఎందుకిలా చేశారో

పామర్రు: పశ్చిమగోదావరి జిల్లా తణుకు పోలీస్‌స్టేషన్‌లో తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఎస్సై ఆదుర్తి గంగ సత్యనారాయణమూర్తి మృతితో స్వస్థలం కె.గంగవరంలోని కుటుంబ సభ్యులు, స్నేహితులు విషాదంలో మునిగిపోయారు. ఆదుర్తి గోపాలరావుకు కుమారులు వెంకటేష్, సత్యనారాయణమూర్తితో పాటు కుమార్తె ఉన్నారు. వెంకటేష్ స్వగ్రామంలోనే పురుగు మందుల



దుకాణం నిర్వహిస్తున్నారు. సత్యనారాయణమూర్తి సెలవులకు గ్రామం వస్తూ అందరితో సరదాగా గడిపేవారు. ధైర్యవంతుడని, కష్టపడి చదివి మంచి స్థాయికి వెళ్లారని స్థానికులు చెబుతున్నారు. విధి నిర్వహణలో ఏర్పడిన ఇబ్బందులతోనే ఆత్మహత్యా నిర్ణయం తీసుకుని ఉంటారని వాపోయారు. ఎస్సై శిక్షణ సమయంలో కూడా బాగా ఉండేవారని, పనిచేసిన చోట్ల మంచిపేరు తెచ్చుకున్నారని సహచరులు తెలిపారు. భార్య విజయ, కుమారుడు చందన్(5), కుమార్తె(16 నెలలు) ఉన్నారని, ఆయన ఇటువంటి తీవ్ర నిర్ణయం ఎందుకు తీసుకున్నారో అర్థం కావడం లేదన్నారు. తల్లిదండ్రులకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో కుమారుడి మృతి విషయం వారికి చెప్పలేదని బంధువులు తెలిపారు. మృతదేహం శుక్రవారం రాత్రి కె.గంగవరానికి తీసుకొస్తారని, కోటిపల్లి వద్ద ఒడ్డున అంత్యక్రియలు చేద్దామని నిర్ణయించుకున్నట్లు కుటుంబీకులు తెలిపారు.




# అజిత్ కూతురు అప్పుడే హీరోయిన్ అయిపోయిందా..!

ఒకప్పుడు చైల్డ్ ఆర్టిస్టులుగా నటించిన చిన్నారులంతా ఇప్పుడు హీరోహీరోయిన్లుగా వెండితెరపై రాణిస్తున్నారు. ఇప్పటికే తెలుగులో తేజ సజ్జ, సంతోష్ శోభన్, సంగీత్ శోభన్, శ్రీదివ్య, కావ్య కళ్యాణ్ రామ్, అనిక సురేంద్రన్, ఎస్తేర్ పలు సినిమాల్లో ప్రధాన పాత్రలు పోషిస్తూ కెరీర్ లో ముందుకెళ్తున్నారు. ఈ లిస్ట్ లో యువీనా పార్థవి కూడా ఇప్పుడు హీరోయిన్ గా సిల్వర్ స్క్రీన్ పై సందడి చేస్తోంది. తమిళంలో ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించి అలరించిన యువీనా పలువురు స్టార్ హీరోలతో కలిసి నటించింది. అమాయకపు మాటలు, అల్లరితో ఆడియన్స్ కు దగ్గరైన యువీనా



మధ్యలో స్టడీస్ కోసమని సినిమాలకు దూరమైంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో బాగా యాక్టివ్ గా ఉంటున్న యువీనా రెగ్యులర్ గా తన ఫోటోలు, అప్డేట్స్ ను అందిస్తూ ఫాలోవర్లను ఆకట్టుకుంటుంది. ఒకప్పుడు ఎంతో ముద్దుగా కనిపించిన యువీనా ఇప్పుడు ఎంతో గ్లామరస్ గా కనిపిస్తోంది. 2013లో ఇవాన్ ఏ కమల్ సినిమాతో తమిళ సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది యువీనా.

ఆ తర్వాత మంజాభైమా ప్యాలెస్, కత్తి సినిమాల్లో నటించింది. సూర్య, అజిత్ సినిమాల్లోనూ నటించి బాలనటిగా మంచి పేరు తెచ్చుకున్న యువీనా తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో ఎన్నో సినిమాల్లో నటించింది. వీరమ్ సినిమాలో అజిత్ తో కలిసి నటించిన ఈ చిన్నది అప్పుడే హీరోయిన్ గా మారిందేంటని అందరూ తన ఫోటోలు చూసి షాకవుతున్నారు.

# రకుల్.. లెగ్స్ అందాలతో మైండ్ బ్లాక్!

రకుల్ ప్రీత్ సింగ్.. పంజాబీ బ్యూటీ అయిన అమ్మడు.. ఒకప్పుడు టాలీవుడ్ లో ఓ రేంజ్ లో అలరించిందన్న విషయం తెలిసిందే. వరుస సినిమాలతో చక్రం తిప్పింది. స్టార్ హీరోలతో నటించి మెప్పించింది. తన యాక్టింగ్ తో మంచి గుర్తింపు సంపాదించుకుంది. తెలుగు సినీ ఇండస్ట్రీలో వేరే లెవెల్ ఫ్యాన్స్ బేస్ ఆమె సొంతం. కాలేజ్ టైమ్ లోనే మోడలింగ్ తో కెరీర్ ను స్టార్ట్ చేసిన రకుల్.. 2009లో కన్నడ మూవీ గిల్లితో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత కెరటం సినిమాతో తెలుగు, తమిళ భాషల్లో మెప్పించింది. అనంతరం వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ సినిమాతో ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చింది. అలా స్టార్ హీరోల సరసన నటించి ఆకట్టుకుందనే చెప్పాలి. అయితే తెలుగులో అవకాశాలు తగ్గడంతో బాలీవుడ్ కు మకాం మార్చేసింది రకుల్ ప్రీత్ సింగ్. అక్కడ కూడా వరుస అవకాశాలు అందుకుంటున్న



ముద్దుగుమ్మ.. అనుకున్నంతగా హిట్లు మాత్రం అందుకోలేకపోతుందనే చెప్పాలి. అయినప్పటికీ అవకాశాలు మాత్రం బాగానే వస్తున్నాయి. నాన్ స్టాప్ గా సినిమాలో సందడి చేస్తోంది. అదే సమయంలో సోషల్ మీడియాలో రకుల్ ఫుల్ యాక్టివ్. ఎప్పటికప్పుడు కొత్త కొత్త పిక్స్ ను పోస్ట్ చేస్తుంటుంది. రకరకాల ఔట్ ఫిట్స్ తో ఫోటోలు దిగుతూ చేసే సందడి వేరే లెవెల్. ఆమె పిక్స్.. ఎప్పటికప్పుడు నెట్టింట వైరల్ అవుతూనే ఉంటాయి. అందరినీ ఆకట్టుకుని ట్రెండింగ్ లో నిలుస్తుంటాయి. రీసెంట్ గా వన్ పీస్ షైనింగ్ డ్రెస్ లో వేసుకుని సందడి చేసింది రకుల్. ఫుల్ మోడ్రన్ గా ఆ డ్రెస్ లో అందాలు ఆరబోసింది. రకరకాల పోజులు ఇచ్చి మైండ్ బ్లాక్ చేసిందనే చెప్పాలి. మెయిన్ గా లగ్స్ అందాలతో ఫిదా చేసిన ముద్దుగుమ్మ.. లుక్ బ్యాక్ ఎట్ మీ అంటూ ఇచ్చిన క్రేజీ క్యాప్షన్ ఇప్పుడు వైరల్ గా మారింది. ప్రస్తుతం రకుల్ పిక్స్.. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఫోటోలు అదిరిపోయాయని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అట్రాక్ట్ అయిపోతున్నామని చెబుతున్నారు. ఎవర్ గ్రీన్ బ్యూటీ అని అంటున్నారు. గ్లామరస్ స్కిన్ తో ఫిదా చేసిందని పొగిడేస్తున్నారు.

# మురుగదాస్‌ని టార్గెట్ చేస్తున్నారా?




సల్మాన్ ఖాన్ కథానాయకుడిగా బాలీవుడ్ లో ఏ.ఆర్.మురుగదాస్ భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. సాజిద్ నడియాడ్ వాలా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అయితే ఈ సినిమా మధ్యలో చాలా చిక్కుల్ని ఎదుర్కొంటోందని, బడ్జెట్లు విపరీతంగా పెరిగిపోయాయని ఇంతకుముందు ప్రచారం సాగింది. నెటిజనులు ఈ సినిమా టీజర్ సహా ప్రమోషనల్ మెటీరియల్ పై రకరకాల కామెంట్లు గుప్పించారు. ఇప్పుడు ఈ సినిమా బడ్జెట్ పెరిగిపోవడంతో మధ్యంతరంగా నిలిచిపోయిందంటూ షాకింగ్ గాసిప్ షికార్ చేస్తోంది. అయితే ఈపాటికే ఈ సినిమా చిత్రీకరణ 90శాతం పూర్తి చేసేసాడు మురుగదాస్. ఒక వైపు నిర్మాణానంతర పనుల్ని మొదలు పెడుతున్నాడని తెలిసింది. అయితే ఇలాంటి సమయంలో సినిమా ఆగిపోయింది! అనే పుకార్ పుట్టుకొచ్చింది. నిజానికి అంత పెద్ద సినిమా, భారీ మొత్తాలను వెచ్చించి సాహసాలు చేస్తున్న నిర్మాతలకు ఎలా ఉంటుంది? ఇలాంటి అయోమయ గందరగోళ సన్నివేశాన్ని సృష్టించడం ద్వారా మురుగదాస్ సినిమాకి నష్టం చేకూర్చాలని భావిస్తున్నారు. ఇది ఒక సెక్షన్ ఆడియెన్ లో భయాందోళనలు కలిగించడమేనని కూడా విశ్లేషిస్తున్నారు.

ముఖ్యంగా ఒక సౌత్ దర్శకుడి సినిమాపై నెగెటివ్ గా ప్రచారం సాగడం గతంలో కూడా ఉంది. ఇప్పటికీ ఉత్తరాదిన ఈ తరహా ప్రచారం ఉంటుంది. అయినా అన్నిటినీ అధిగమించి మురుగదాస్ భారీ యాక్షన్ చిత్రంతో విజయం సాధించాలని అతడి అభిమానులు కోరుకుంటున్నారు. ఒక సౌత్ దర్శకుడు అయినా కానీ మురుగదాస్ కి సల్మాన్ చాలా అండగా నిలబడుతున్నారు. అయితే తనను నమ్మినందుకు సల్మాన్ భాయ్ కి అదిరిపోయే హిట్టివ్వాల్సిన బాధ్యత కూడా మురుగదాస్ పై ఉంది. ఈద్ కానుకగా సల్మాన్-రష్మిక మందన్న నటించిన సికందర్ విడుదలకు సిద్ధమవుతోంది.


# నందమూరి ఫ్యాన్స్ కాలర్ ఎగరేసేలా..



టాలీవుడ్ టాలెంటెడ్ హీరో నందమూరి కళ్యాణ్ రామ్.. ఇప్పుడు NKR 21 సినిమాతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఆ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. చివరగా.. డెవిల్ తో వచ్చిన కళ్యాణ్ రామ్ నటుడిగా ఎప్పటికప్పుడు కొత్తగా ట్రై చేస్తాడని నిరూపించారు. దీంతో ఇప్పుడు NKR 21 ప్రాజెక్టుతో మంచి హిట్ కొట్టాలని చూస్తున్నారు. అందుకు తగ్గట్లే కష్టపడుతున్నారు. ప్రతీ విషయంలో కేర్ తీసుకుంటున్నారని ఎప్పటి నుంచో టాక్ వినిపిస్తోంది. భారీ బడ్జెట్ తో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్న ఈ సినిమాలో సీనియర్ నటి, లేడీ సూపర్ స్టార్ విజయశాంతి కీలక పాత్ర పోషిస్తున్నారు. కళ్యాణ్ రామ్ సరసన సయీ మంజ్రేకర్ హీరోయిన్ గా నటిస్తున్నారు. అయితే ఇప్పటికే సినిమా నుంచి రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్ మంచి రెస్పాన్స్ అందుకుంది. మూవీపై వేరే లెవెల్ బజ్ క్రియేట్ అయ్యి ఉంది. దీంతో మూవీ కచ్చితంగా హిట్ అవుతుందని అంతా డిస్కస్ చేసుకుంటున్నారు. ఇప్పుడు షూటింగ్ చివరి దశకు చేరుకుందని ఇండస్ట్రీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. సినిమా అవుట్ పుట్ వేరే లెవెల్ లో వచ్చినట్లు ఇండస్ట్రీలో అంతా మాట్లాడుకుంటున్నారు. కళ్యాణ్ రామ్ కెరీర్ లో మంచి హిట్ గా నిలవనుందని చెబుతున్నారు. అన్ని విషయాల్లో మేకర్స్ పెర్ఫెక్ట్ గా ప్లాన్ చేసుకుంటున్నారని డిస్కస్ చేసుకుంటున్నారు. దీంతో ఆ విషయం తెలుసుకున్న నందమూరి ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అయిపోతున్నారు. అయితే మొన్న అతనొక్కడే.. నిన్న బింబిసార.. నేడు NKR 21.. అని చెబుతున్నారు. గుర్తుపెట్టుకోండి సినిమా రిలీజ్ తర్వాత మాట్లాడుకుందామని అంటున్నారు. నందమూరి ఫ్యాన్స్ కాలర్ ఎగరేసే సినిమా లోడింగ్ అంటూ సందడి చేస్తున్నారు. అలా ప్రస్తుతం సోషల్ మీడియాలో NKR 21 గురించి జోరుగా చర్చ నడుస్తోంది. నిజానికి.. అతనొక్కడే, బింబిసార కళ్యాణ్ రామ్ లో మంచి హిట్ మూవీస్ గా నిలిచాయి. అతనొక్కడేతో సెన్సేషనల్ హిట్ ను అందుకున్నారు. నిర్మాతగానూ లాభాలు ఆర్జించారు. ఆ తర్వాత కెరీర్ లో సక్సెస్ ఫెయిల్యూర్స్ సంబంధాలు లేకుండా ఎన్నో ప్రయోగాలు చేశారు. ఇక బింబిసారతో బిగ్గెస్ట్ హిట్ సాధించారు. తన యాక్టింగ్ తో మెప్పించారు. ఇప్పుడు NKR 21తో మరో విజయాన్ని సొంతం చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. మరి ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి క్రేజ్ అందుకుంటుందో చూడాలి.

# నెట్టింట వైరల్ వీడియోలు.. విద్యాబాలన్ స్ట్రాంగ్ రియాక్షన్!

సోషల్ మీడియాలో బాలీవుడ్ నటి విద్యా బాలన్ వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి! ప్రధానంగా... ఫేస్ బుక్ తో పాటు వాట్సప్ గ్రూపుల్లోనూ ఆ వీడియోలు హల్ చల్ చేస్తున్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో విద్యా బాలన్ స్పందించారు. ఈ సందర్భంగా ఓ సందేశం విడుదల చేశారు. ఇదే సమయంలో.. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవును... సోషల్ మీడియా, వాట్సప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతోన్న వీడియోలను ఉద్దేశించి బాలీవుడ్ నటి విద్యా బాలన్ స్పందించారు. ఈ సందర్భంగా ఆ వీడియోలతో తనకు ఏమాత్రం సంబంధం లేదని.. అవన్నీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీతో క్రియేట్ చేసిన డీప్ ఫేక్ వని తెలిపారు. ఈ విషయంలో నెటిజన్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా స్పందించిన విద్యా బాలన్... ఈ మధ్యకాలంలో తనకు సంబంధించిన పలు వీడి



యోలు సోషల్ మీడియా, వాట్సప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్నాయి.. అయితే, అవన్నీ ఏఐ జనరేటెడ్ వీడియోలను తెలిపారు. ఆ వీడియోలతో తనకు ఎటువంటి సంబంధం లేదని.. వాటిని క్రియేట్ చేయడం, షేర్ చేయడంలో తన ప్రమేయం లేదని అన్నారు. ఇదే సమయంలో.. ఆ వీడియోల్లోని కంటెంట్ ను తాను ఏమాత్రం అంగీకరించనని.. అందువల్ల సోషల్ మీడియాలో ఆ వీడియోలు షేర్ చేసే ముందు దయచేసి వాటి గురించి పూర్తి సమాచారం తెలుసుకోవాలని కోరారు. ఏఐ జనరేటెడ్ కంటెంట్ మిమ్మల్ని తప్పుదోవ పట్టించే ప్రమాదం ఉందని చెబుతూ.. అప్రమత్తంగా ఉండాలని కోరారు. కాగా... ఈ డీప్ ఫేక్ టెక్నాలజీ కారణంగా ఇప్పటికే ఎంతోమంది హీరోయిన్లు, సెలబ్రిటీలు ఇబ్బందులు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా.. రష్మిక మందాన, కత్రినా కైఫ్, దీపికా పదుకొణె, అలియా భట్, కాజోల్ వంటి హీరోయిన్లు ఈ టెక్నాలజీ బాధుతులే! ఇదే సమయంలో పలువురు క్రీడాకారులు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన ఏఐ జనరేటెడ్ కంటెంట్ కూడా నెట్టింట హల్ చల్ చేసిన సంగతి తెలిసిందే.

# హీరోయిన్‌ల వయసు పెరగడానికి అనుమతించరు: జ్యోతిక

సినీపరిశ్రమలో మహిళా నటీమణులకు మేల్ స్టార్స్ తో పోలిస్తే అవకాశాలు తక్కువగా ఉంటాయని అన్నారు జ్యోతిక. నిజానికి మహిళా నటీమణులకు వయసు పెరగడానికి అనుమతి లేదని వ్యాఖ్యానించారు. కానీ వయసు పైబడిన మగ నటులను ఇప్పటికీ సూపర్ స్టార్లుగా కీర్తిస్తున్నారని అన్నారు. ఒక ఎఫ్.ఎం రేడియోతో జరిగిన చర్చా కార్యక్రమంలో.. జ్యోతిక సినీపరిశ్రమలో మగ- ఆడ వైరుధ్యాల గురించి వ్యాఖ్యానించారు. హీరోలను దృష్టిలో పెట్టుకుని సినిమాలు తీస్తున్నారని, హీరోయిన్‌లు, మహిళా నటీమణుల కోసం కథలు రాయడం లేదని కూడా జ్యోతిక విమర్శించారు. అలాగే వయసు పెరిగితే కథానాయికలకు అవకాశాలుండవు అని కూడా అన్నారు. "వయసు దక్షిణాదిలో నిజంగా పెద్ద ప్రశ్న. నాకు 28 ఏళ్ల వయసులో పిల్లలు పుట్టారు. ఆ తర్వాత నేను చాలా భిన్నమైన పాత్రలు చేయడం ప్రారంభించాను. నిజానికి నేను 28 ఏళ్ల తర్వాత స్టార్ లేదా హీరోతో పని చేయనే లేదు. ఇది చాలా పెద్ద సవాల్. ఎందుకంటే వయసు పెరిగాక పూర్తిగా కొత్త దర్శకులతో సినిమాలు తీస్తూ స్వయంగా



నిర్మించాల్సి ఉంటుంది. ఇదంతా వయస్సు కారకంతో సంబంధం కలిగి ఉంటుంది. తమిళ పరిశ్రమలో వయసు అనేది మరింత పెద్ద సమస్య. నేను అన్ని దక్షిణాది భాషల గురించి చెప్పను" అని జ్యోతిక అన్నారు. నాటి రోజుల్లో కె. బాలచందర్ లాంటి పెద్ద దర్శకులు, అనుభవజ్ఞులైన ఫిలింమేకర్స్ నాయికా ప్రధాన పాత్రలు లేదా ప్రాధాన్యత ఉన్న కథానాయికను తెరపై చూపించేవారని, ఇటీవలి కాలంలో నాయికా ప్రధాన కథలు రావడం లేదని జ్యోతిక విమర్శించారు. పెద్ద వ్యక్తుల కోసం సినిమాలు తీసే పెద్ద వ్యక్తులు మాత్రమే మనకు ఉన్నారు. ఒక నటి కోసం సినిమా తీసే పెద్ద ఫిలింమేకర్స్ మనకు లేరని భావిస్తున్నట్టు చెప్పారు. మహిళా నటీమణులకు బడ్జెట్ పరిమితం. వయస్సు పెద్ద సవాల్. రెండవది ఒక మహిళా దృక్కోణం నుండి అనుభవజ్ఞులైన దర్శకుడు కథ చెప్పడం. దక్షిణాదిలో ఒక మహిళ ప్రయాణం చాలా కఠినమైనదని నేను భావిస్తున్నాను. ఎందుకంటే ఇది ఒక ఒంటరి పోరాటం! అని కూడా జ్యోతిక అన్నారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. జ్యోతిక త్వరలో 'డబ్బా కార్టెల్' అనే చిత్రంలో కనిపిస్తుంది. 'డబ్బా కార్టెల్' ట్రైలర్ ఇప్పటికే విడుదలై ఆకట్టుకుంది. ఐదుగురు మధ్యతరగతి మహిళల లంచ్ బాక్స్ వ్యాపారం ఊహించని విధంగా వారిని ప్రమాదకరమైన డ్రగ్ కార్టెల్‌లోకి తీసుకెళ్తుంది. ఒక చిన్న వ్యాపారంలా ప్రారంభమైనా, ఇది ఫార్మా మాఫియా గురించి, ఈ రంగంలోని చీకటి వ్యాపారాల గురించి అన్వేషిస్తుంది. ఈ చిత్రానికి హితేష్ భాటియా దర్శకత్వం వహించారు. షబానా అజ్మీ, గజరాజ్ రావు, జ్యోతిక తదితరులు ఇందులో నటించారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536